అనుదినం... జనస్వరం

నవతెలంగాణ

శుక్రవారం 31-3-2023

సమగ్ర తెలుగు దినపత్రిక

సంపుటి : 9 | సంచిక : 89 | Published from Hyderabad, Rangareddy, Khammam, Karimnagar | www.navatelangana.com | 10 పేజీలు | వెల : 6.50



ఐపీఎల్ పండుగొచ్చె!

నేటి నుంచి ధనాధన్ లీగ్ 16వ సీజన్

10 జట్లు, 12 స్టేడియాలు, 52 రోజులు, 74 మ్యాచులు.. ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్) 16 సీజన్‌కు రంగం సిద్ధం. ప్రపంచ క్రికెట్‌లో అత్యంత పాపులర్ టీ20 లీగ్ నేడు అహ్మదాబాద్‌లోని మోతెరా స్టేడియంలో ఆరంభం కానుంది. 52 రోజుల పాటు సాగనున్న కప్పు వేటలో పది జట్లు పోటీపడుతుండగా.. బెంగళూర్, పంజాబ్, ఢిల్లీ, లక్నోలు తొలిసారి విజేతగా నిలిచేందుకు ఎదురుచూస్తున్నాయి. నేటి ఆరంభ వేడుకల్లో రష్మిక మంధాన, తమన్నా భాటియాలు నృత్య ప్రదర్శన చేయనున్నారు.

వివరాలు ఆటలులో..





బీసీ గణన చేయాలి

కేంద్రంపై ఒత్తిడి తెస్తాం...

- మండల్ కమిషన్ సిఫారసులు అమలు చేయాలి
- బీసీ ఉద్యమానికి సంపూర్ణ మద్దతు : సీపీఐ(ఎం) ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి



న్యూఢిల్లీ : దేశ జనాభాలో సగ భాగమున్న బీసీలకు అన్ని రంగాల్లో అన్యాయం జరుగుతోందనీ, బీసీల ఉద్యమానికి తమ పార్టీ మద్దతు ఉంటుందని సీపీఐ(ఎం) ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి పేర్కొన్నారు. గురువారం సీపీఐ(ఎం) కేంద్ర కార్యాలయంలో సీతారాం ఏచూరిని, సీపీఐ ప్రధాన కార్యాలయంలో ఆ పార్టీ ప్రధాన కార్యదర్శి డి.రాజాను, కేంద్ర సామాజిక న్యాయ సాధికారిత సహాయ మంత్రి రాందాస్ అథవాలేను ఆయన నివాసంలో జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్ గౌడ్ ఆధ్వర్యంలో ఆ సంఘం నేతలు కలిశారు. ఈ సందర్భంగా తమ ఉద్యమానికి మద్దతు ఇవ్వాలని కోరారు. సీపీఐ(ఎం) ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి మాట్లాడుతూ బీసీ జనగణన, మండల్ కమిషన్ సిఫారసుల అమలు కోసం కేంద్ర ప్రభుత్వంపై సీపీఐ(ఎం) ఒత్తిడి పెంచుతోందని అన్నారు. కేంద్ర ప్రభుత్వంపై బీసీలు చేసే ఉద్యమానికి మా పార్టీ మద్దతుగా ఉంటుందని తెలిపారు. సీపీఐ ప్రధాన కార్యదర్శి డి.రాజా మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ఇకనైనా బీసీల విషయంలో సానుకూలంగా వ్యవహరించాలని అన్నారు. బీసీ రిజర్వేషన్ పెంచాలని, ప్రత్యేక మంత్రిత్వ శాఖ ఏర్పాటు చేయాలని, చట్ట సభల్లో బీసీ రిజర్వేషన్లు కల్పించాలని డిమాండ్ చేశారు. బీసీ ఉద్యమానికి తమ పార్టీ తరపున సంపూర్ణ మద్దతు ఉంటుందని అన్నారు. ప్రభుత్వంలో మంత్రిగా ఉన్నప్పటికీ జనగణనలో బీసీలవైపే ఉంటామని కేంద్ర సహాయ మంత్రి రాందాస్ అథవాలే అన్నారు. బీసీ జనగణన విషయంలో కేంద్రంతో తమకు భిన్నాభిప్రాయాలు ఉన్నాయని పేర్కొన్నారు. క్రిమిలేయర్ ఆదాయ పరిమితిని రూ.8 లక్షల నుంచి రూ.12 లక్షలకు పెంచాలని పరిశీలిస్తున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం తెలంగాణ రాష్ట్ర కార్యనిర్వాక అధ్యక్షులు శ్రీనివాస్ ముదిరాజ్, బీసీ విద్యార్థి సంఘం అధ్యక్షులు తాటికొండ విక్రం, యువజన సంఘం అధ్యక్షులు కనకాల శ్యాం కుర్మా, తెలంగాణ బీసీ విద్యార్థి సంఘం అధ్యక్షులు గొడుగు మహేష్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.



ఢిల్లీలో పోస్టర్ల యుద్ధం

- మోడీకి వ్యతిరేకంగా 11భాషల్లో పోస్టర్లు
- నేడు దేశవ్యాప్తంగా ఆందోళన : ఆప్

5లో..



పెరుగు వివాదంపై

పీఛేముడ్...

దహీ లొల్లిపై వెనక్కి తగ్గిన కేంద్రం

5లో..



పీఎఫ్ ఖాతాల్లో 4,962 కోట్లు

నిర్వహణలో లేని భారీ నగదు..కేంద్రం

న్యూఢిల్లీ : ఉద్యోగుల ప్రావిడెంట్ ఫండ్ (ఈపీఎఫ్)లో నిర్వహణలో లేని ఖాతాల్లో రూ.4,962.70 కోట్ల నిధులు ఉన్నాయని కేంద్ర కార్మికశాఖమంత్రి రామేశ్వర్ తేలి వెల్లడించారు. 2022 మార్చి 31 నాటికి ఈ మొత్తం ...5లో

బీమా కంపెనీలకే

లబ్ధి

రైతులకు ప్రయోజనం చేకూర్చని పీఎం ఫసల్ బీమా యోజన

- అన్నదాతల పేరు మీద కంపెనీలకు ఆదాయం
- ఆరేండ్లలో రూ. 40వేల కోట్లకు పైగా మిగులు
- అకాల వర్షాలు, ప్రతికూల వాతావరణ పరిస్థితులతో అన్నదాత ఆగమాగం
- రైతు సంఘాల నాయకుల ఆగ్రహం



> ప్రధాన మంత్రి ఫసల్ బీమా యోజన అసలు లక్ష్యం నీరు కారుతున్నదా? రైతులకు ఇది ప్రయోజనాన్ని చేకూర్చడం లేదా? ఇన్సూరెన్స్ కంపెనీలకే ఈ పథకం కింద లబ్ధి చేకూరుతున్నదా? బీమా కంపెనీలు రైతుల పేరు మీద భారీ మొత్తంలో డబ్బును పోగు చేసుకుంటున్నాయా? అంటే అవుననే సమాధానాలే వినబడుతున్నాయి. రైతులకు బీమా విషయంలో పార్లమెంటు సాక్షిగా మోడీ సర్కారు వెల్లడించిన గణాంకాలే ఈ విషయాన్ని వెల్లడిస్తున్నాయి.

న్యూఢిల్లీ : రైతన్నలకు ఈ ఏడాది వాతావరణం గట్టి పరీక్ష పెడుతున్నది. నిరంతరాయంగా కురుస్తున్న అకాల వర్షాలు, వడగళ్ల వానల కారణంగా దేశవ్యాప్తంగా చాలా చోట్ల పంటలు నాశనమయ్యాయి. ఇందులో గోధుమ, ఆవాలు, ఆలు, ఉల్లి, మిరప వంటి పంటలు ఉన్నాయి. దీంతో రైతులు తీవ్రంగా నష్టపోయారు. వారు ఇప్పుడు ప్రభుత్వ సాయం కోసం ఎదురు చూస్తున్నారు. ఇలాంటి ఆపదల నుంచి రైతులను రక్షించడానికి, వారికి ఉపశమనం కలిగించడానికే ప్రధాన మంత్రి ఫసల్ బీమా యోజన ఉన్నది.

అయితే ఈ పథకం రైతులకు లబ్ధి చేకూర్చడమేమో కానీ.. బీమా కంపెనీల బొజ్జనింపుతున్నదని ధనికంగా మారుస్తున్నదని రైతు సంఘాలు ఆరోపిస్తున్నాయి.

హర్యానాలోని రోహ్‌తక్ జిల్లాలోని రిథాలా గ్రామానికి చెందిన రైతు సంజయ్ (38) మాట్లాడుతూ.. "అకాల వర్షాలు, బలమైన గాలులు నా మొత్తం పంటను నాశనం చేశాయి. ఖర్చులో 25 శాతం తిరిగి పొందడం కూడా నాకు కష్టంగా ఉంటుంది" అని అన్నారు. మొత్తం హర్యానాలో గోధుమ పంటలు, ముఖ్యంగా రోహ్‌తక్, భివానీ, హిసార్ , సిర్సాలలో వాతావరణ తీవ్రతను ఎదుర్కొంటున్నాయి. కొందరు రైతులు ఆవాలు సాగు చేశామనీ, అయితే వడగళ్ల వానతో పంట పొలాల్లోనే పడిపోయిందని తెలిపారు. కాంట్రాక్టుపై ఇతరుల భూమిలో వ్యవసాయం చేసుకునే వారు చాలా ఇబ్బందులు పడుతున్నారు. కౌలు రైతు రణ్‌వీర్ సింగ్ మాట్లాడుతూ.. పంజాబ్ నేషనల్ బ్యాంక్ నుంచి రూ.1,10,000 పరిమితితో కిసాన్ క్రెడిట్ కార్డును మంజూరు చేసినట్టు చెప్పారు. అంటే పంటల సాగు కోసం బ్యాంకు నుంచి పైన ...2లో



కార్పొరేట్లకు పన్నులు తగ్గించి..

ప్రజల్ని దోచుకుంటారా..?

కేంద్ర ప్రభుత్వం క్షమాపణలు చెప్పాలి

- బీజేపీని వదిలించుకుంటేనే ధరాభారం నుంచి విముక్తి : పెట్రో ధరల దోపిడీపై కేంద్రానికి మంత్రి కేటీఆర్ బహిరంగ లేఖ

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

కార్పొరేట్ కంపెనీలకు మేలు జరిగేలా పన్నులు తగ్గించి... సామాన్య ప్రజలను నిలువునా దోచుకుంటారా..? అని కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వాన్ని రాష్ట్ర ఐటి, పరిశ్రమల శాఖ మంత్రి కేటీఆర్ ప్రశ్నించారు. అంతర్జాతీయ ముడిచమురు ధరలు తక్కువగా ఉన్నా, పెట్రో ఉత్పత్తుల ధరలను విపరీతంగా పెంచి సామాన్యుల నడ్డి విరుస్తున్న మోడీ సర్కార్... దేశ ప్రజలకు వెంటనే క్షమాపణ చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు. 2013లో ఒక బ్యారెల్ ముడి చమురు ధర 110 డాలర్లు ఉన్నప్పుడు, దేశంలో లీటర్ పెట్రోల్ రేటు కేవలం రూ.76 ఉండేదని గుర్తు చేశారు. ప్రసుతం బ్యారెల్ ముడిచమురు రేటు దాదాపు సగం పడిపోయినా మన దేశంలో పెట్రోల్ ధర లీటర్‌కు రూ.110 ఉండటమే కేంద్ర ప్రభుత్వ దోపిడీకి నిదర్శనమని ఆయన పేర్కొన్నారు. దేశంలో పెట్రోల్ ధరల పెంపునకు ముడిచమురు కారణం కాదనీ, మోడీ నిర్ణయించిన చమురు ధరలేననేది దీన్నిబట్టి మరోసారి రుజువైందని విమర్శించారు. ఈ ...5లో

వైభవంగా రాములోరి కల్యాణం

ముత్యాల తలంబ్రాలు, పట్టు వస్త్రాలు అందజేసిన మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి



నవతెలంగాణ-భద్రాచలం

శ్రీరామ నవమి బ్రహ్మోత్సవాల్లో భాగంగా భద్రాచలం సీతారామచంద్రస్వామి దేవాలయంలోని మిథుల ప్రాంగణంలో గురువారం నిర్వహించిన రాములోరి కల్యాణం అంగరంగ వైభవంగా జరిగింది. రాష్ట్రం నుంచే కాకుండా సమీప ఆంధ్రప్రదేశ్, ఛత్తీస్‌గఢ్ తదితర ప్రాంతాల నుంచి వేలాది సంఖ్యలో భక్తులు ఈ కల్యాణ మహోత్సవానికి హాజరయ్యారు. రాష్ట్ర ప్రభుత్వం తరపున దేవాదాయ, ధర్మాదాయ శాఖ మంత్రి అల్లోల ఇంద్రకరణ్ రెడ్డి మహోత్సవానికి హాజరై పట్టువస్త్రాలు, ముత్యాల తలంబ్రాలు అందజేశారు. అర్చక స్వాములు సంప్రదాయ బద్ధంగా ఈ కళ్యాణ క్రతువును ఘనంగా జరిపించారు. వేకువజామునే ఆలయ తలుపులు తెరిచిన అర్చక స్వాములు ...5లో



డర్టీ బీజేపీ ఎమ్మెల్యే

త్రిపుర అసెంబ్లీలో పోర్న్ చూస్తూ చిక్కిన ప్రజాప్రతినిధి

అగర్తలా : మనం ఎన్నుకున్న ప్రజాప్రతినిధులు ఏంచేస్తుంటారు..ప్రజాసమస్యలను ప్రస్తావించాల్సిన చట్టసభలో బీజేపీకి చెందిన ఓ డర్టీ ఎమ్మెల్యే అశ్లీల చిత్రాలను చూస్తూ అడ్డంగా దొరికిపోయాడు.

ఇంతకీ ఏం జరిగిందంటే...

త్రిపుర బీజేపీ ఎమ్మెల్యే జదబ్ లాల్ నాథ్ వీడియో సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. అసెంబ్లీ సమావేశాలు జరుగుతున్నప్పుడు ఎమ్మెల్యే పోర్న్ వీడియో చూస్తున్నారని ఆరోపించారు. మీడియా నివేదికల ప్రకారం, ఈ వీడియో మార్చి 30 నాటిది (గురువారం రోజు). అసెంబ్లీలో బడ్జెట్ ...5లో

బీజేపీ పాలనలో అచ్ఛే దిన్ కాదు..

సామాన్యుడు చచ్చే దిన్..

మందుల ధరలు పెంపు దారుణం : వైద్యారోగ్య శాఖ మంత్రి హరీశ్ రావు



నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

ప్రజల ప్రాణాలు కాపాడే ఔషధాల ధరలను 12 శాతం పెంచాలని కేంద్రం నిర్ణయించడం దారుణమని రాష్ట్ర వైద్యారోగ్య శాఖ మంత్రి టి హరీశ్‌రావు విమర్శించారు. ఇది పేద, మధ్య తరగతి ప్రజలకు వైద్యాన్ని దూరం చేసే చర్య అని ఒక ప్రకటనలో తెలిపారు. జ్వరం, ఇన్ఫెక్షన్లు, బీపీ, చర్మ వ్యాధులు, ఎనీమియా తదితర చికిత్సల్లో వినియోగించే మందులతో పాటు పెయిన్ కిల్లర్లు, యాంటీ బయోటిక్స్, యాంటీ ఇన్ఫెక్టివ్స్ వంటి 800 పైగా నిత్యావసర మందుల ...5లో

శ్రీరామనవమి ఉత్సవాల్లో విషాదం !

ఇండోర్ ఆలయంలో బావి పైకప్పు కూలి 14మంది మృతి

- మిగిలిన వారి కోసం గాలింపు చర్యలు




ఇండోర్ : శ్రీరామ నవమి ఉత్సవాల సందర్భంగా మధ్యప్రదేశ్‌లోని ఇండోర్‌లో గురువారం విషాదం చోటు చేసుకుంది. బేలేశ్వర్ మహదేవ్ ఝులేలాల్ ఆలయంలో పురాతనమైన మెట్ల బావి పై కప్పు కూలి 14మంది చనిపోగా, బావిలో పడిన మరో 19మందిని కాపాడారు. లోపల 25మంది వరకు చిక్కుకుని వుంటారని భయపడుతున్నారు. వారికోసం గాలింపు కొనసాగుతోంది. పెద్ద సంఖ్యలో ఆలయానికి వచ్చిన భక్తులు బావి పైకప్పుపై కూర్చున్నారు. బరువు ఎక్కువ కావడంతో పై కప్పు కూలిపోయి ఈ దుర్ఘటన చోటు చేసుకుందని అధికారులు తెలిపారు. కుప్పకూలిన ...5లో

రాహుల్‌కు పాట్నా హైకోర్టు

సమన్లు

ఏప్రిల్ 12న హాజరు కావాలని ఆదేశాలు




వివరాలు 5లో..

ఊళ్లను..దుమ్ము కమ్మేస్తోంది..!

తర్నం వంతెన కుంగుబాటుతో రాకపోకలు బంద్

- గ్రామాల మీదుగా వాహనాల మళ్లింపు
- నిరాల-లాండసాంగ్వి రోడ్డు అస్తవ్యస్తం





నవతెలంగాణ-
ఆదిలాబాద్ ప్రాంతీయ ప్రతినిధి, జైనథ్

పచ్చని పంట పొలాల మధ్య అలరారిన ఆ గ్రామాల ఇప్పుడు దుమ్ము కమ్మేస్తోంది. రోజూ వందల సంఖ్యలో భారీ వాహనాల రాకపోకల కారణంగా రోడ్డు అస్తవ్యస్తంగా మారుతోంది. ఈ దారి గుండా ప్రయాణం నిత్యం నరకంగా మారింది. ఓ చోట బ్రిడ్జి కుంగిపోవడంతో అక్కడ రాకపోకలు నిలిపేసి ప్రత్యామ్నాయంగా గ్రామాల నుంచి మళ్లించడంతోనే సమస్య మొదలైంది. కానీ రాకపోకలు మళ్లించిన అధికారులు బ్రిడ్జి నిర్మాణంపై ఎలాంటి చర్యలూ తీసుకోకపోవడంతో గ్రామాలు దుమ్ము కొట్టుకుపోతున్నాయి. నిరాల నుంచి లాండసాంగ్వి వరకు సుమారు తొమ్మిది కిలోమీటర్ల రోడ్డు దుస్థితి ఇది.

ఆదిలాబాద్ గ్రామీణం, జైనథ్ మండలాల పరిధిలోని లాండసాంగ్వి, అర్లి, అడ, ముక్తాపూర్, నిరాల గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. జైనథ్ మండలం తర్నం బ్రిడ్జి కుంగింది. రాకపోకలు నిలిచాయి. దీంతో ప్రత్యామ్నాయంగా మహారాష్ట్ర, బేల, జైనథ్ మండలా ల మీదుగా వచ్చే భారీ వాహనాలను నిరాల నుంచి లాండసాంగ్వి రోడ్డు మీదుగా నడిపిస్తున్నారు. గ్రామాల మధ్య అనుసంధానం కోసం నిర్మించిన చిన్న రోడ్డు కావడం.. భారీ వాహనాలు వెళ్తుండటం కారణంగా రోడ్డు అస్తవ్యస్తంగా మారింది.

ఎగిసిపడుతున్న దుమ్ము..!

ఆదిలాబాద్ జిల్లా సరిహద్దున మహారాష్ట్రలో సిమెంట్ పరిశ్రమలు అధికంగా ...5లో

పంటలు దెబ్బతింటున్నాయి

మా ఊరి పక్క నుంచి భారీ వాహనాలు వెళ్తున్నాయి. రోజూ వందల సంఖ్యలో వాహనాల రాకపోకల కారణంగా దుమ్ము రేగడంతో పంట పొలాలు దెబ్బతింటున్నాయి. ఎడ్లబండ్లపై కూడా వెళ్లలేని పరిస్థితి. కండ్లలో దుమ్ము పడుతోంది. అధికారులు ఈ రోడ్డును వెంటనే బాగు చేయించాలి.

- రైతు భువునే రాందాస్- అర్లి

నవతెలంగాణపై స్పందన
ఫోన్ చేయాల్సిన నంబరు : 9490099016

పత్రికకు ప్రజలే మార్గదర్శకులు. నవతెలంగాణలో మీకు నచ్చిన, నచ్చని అంశాలను ఎప్పటికప్పుడు మా దృష్టికి తెస్తే.. పత్రికకు మరింత పదునుపెట్టే వీలుంటుంది. ఆదివారం మినహా ప్రతి రోజూ మధ్యాహ్నం 12 నుంచి సాయంత్రం 6 గంటలవరకూ పత్రికపై మీ అభిప్రాయాలను 9490099016కు తెలియచేయవచ్చు. మీరు చెప్పేది స్పష్టంగా, సూటిగా, క్లుప్తంగా ఉండాలి. ఇప్పటికే చాలా మంది పంపుతున్న విమర్శలు, సూచనలు మాకు బాగా ఉపయోగపడుతున్నాయి. వారందరికీ కృతజ్ఞతలు.

అభిప్రాయాలు పంపదలిస్తే మా అడ్రస్ : స్పందన, నవతెలంగాణ తెలుగు డైలీ, ఎం.హెచ్ భవన్, ప్లాట్ నెం.21/1, ఆజామాబాద్, ఆర్టీసీ కళ్యాణమండపం దగ్గర, బాగ్‌లింగంపల్లి, హైదరాబాద్ - 20.

గుండె పంపింగ్ సామర్థ్యం పెంచుతున్న రిహాబ్

ఆయుష్షుతో పాటు జీవన ప్రమాణం మెరుగు

- మారథాన్‌లో పాల్గొంటున్న రోగులు
- ఉద్యోగాలకు అవసరమైన ఫిట్‌నెస్‌కు దోహదం
- దేశంలోనే తొలిసారిగా హైదరాబాద్‌లో కార్డియాక్ రిహాబ్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

వైద్య పరిశోధనలు రోజు రోజుకు కొత్త పుంతలు తొక్కుతున్నాయి. నిన్న అసాధ్యం అనుకున్న అనేక సంగతులు నేడు వాస్తవమవుతున్నాయి. గుండె సంబంధిత రోగులు బతికి బట్టకడితే చాలనుకునే రోజుల నుంచి గుండె శస్త్రచికిత్స చేయించుకున్న వారు సైతం మారథాన్ లాంటి పరుగు పందాల్లో పాల్గొంటూ ఔరా... అనిపించే దశకు వైద్యశాస్త్రం చేరింది. ఈ క్రమంలో రోగుల ఆయుష్షు పెరగడమే గాకుండా, జీవన ప్రమాణాలు కూడా మెరుగుపడుతుండటం గమనార్హం. ప్రభుత్వ ఉద్యోగాలు పొందే వారిలో కొన్నింటికి అవసరమైన ఫిట్‌నెస్ కోల్పోయిన వారు సైతం ఆ తర్వాత ఆయా పరీక్షల్లో సైతం అర్హత సాధిస్తున్నారు. 50 సంవత్సరాల నేవీ ఆఫీసర్ ఒకరు హార్ట్ అటాక్ కారణంగా స్టెంట్ వేసుకున్నారు. గుండె కండరాలు బలహీనపడి దాని పంపింగ్ సామర్థ్యం 40 శాతానికి పడిపోయింది. దీంతో ఉద్యోగం చేయగల సామర్థ్యం అతను కోల్పోయినట్టుగా అధికారులు నిర్ధారించారు. కార్డియాక్ రిహాబ్ తర్వాత అదే వ్యక్తి సంబంధిత పరీక్షలో అర్హత సాధించారు. ఇలాగే పలువురు రిహాబ్‌తో సంతోషకరమైన కొత్త జీవితాన్ని అనుభవిస్తున్నారు. ఇదంతా కార్డియాక్ రిహాబ్ పుణ్యమే. దాని ద్వారా కేవలం మూడు నెలల వ్యవధిలో గుండె పంపింగ్ సామర్థ్యం పెరుగుతుండటం గమనార్హం. ఇది భవిష్యత్తులో గుండె జబ్బు వచ్చే అవకాశమున్న రిస్క్ గ్రూప్ వారితో పాటు ఇది వరకే గుండె జబ్బులకు చికిత్స తీసుకుంటున్న వారు, తీసుకున్న వారు, శస్త్రచికిత్స చేయించుకున్న వారికి కూడా ఉపయోగ పడుతుండడం ఆధునిక పరిశోధనలు ఇచ్చిన వరమే అని చెప్పాలి.

కరోనా తర్వాత కాలంలో ఎక్కువ మంది గుండెపోటుకు గురి కావడంతో పాటు మరణాల సంఖ్య కూడా పెరుగుతోంది. రాష్ట్ర వైద్యారోగ్యశాఖ లెక్కల ప్రకారం ప్రతి రోజు రాష్ట్రంలో 66 మంది గుండెపోటుకు గురవుతూ మరణిస్తున్నారు. వీరిని సకాలంలో గుర్తించి సీపీఆర్ (కార్డియో పల్మనరీ రెససిటేషన్) చేయగలిగితే చాలా మంది ప్రాణాలను నిలుపొచ్చనే ఉద్దేశంతో ప్రభుత్వం రాష్ట్రవ్యాప్తంగా సీపీఆర్ శిక్షణా కార్యక్రమాలను ఏర్పాటు చేస్తున్నది. ప్రతి ఒక్కరు దీనిపై అవగాహన పెంచుకోవాలంటూ జిల్లాల వారీగా కార్యక్రమాలను నిర్వహిస్తున్నది. దీనికి తోడు ఉస్మానియా మెడికల్ కాలేజీలో స్కిల్ ల్యాబ్‌లో వైద్య సిబ్బందికి గుండెతో పాటు ఇతర అత్యవసర పరిస్థితిలో వెంటనే తీసుకోవాల్సిన జాగ్రత్తలపై శిక్షణనిస్తున్నారు.




గుండె జబ్బుల నివారణకు మేలు :డాక్టర్ మురళీధర్ బాబీ

గుండె జబ్బులు, గుండెపోటు పదే పదే వచ్చే రోగులకు ముందుగానే వాటిని నివారించేందుకు కార్డియాక్ రిహాబ్ దోహద పడుతుందని కార్డియాక్ రిహాబ్ స్పెషలిస్టు డాక్టర్ మురళీధర్ బాబీ తెలిపారు. ప్రభుత్వపరంగా రిహాబ్‌పై ప్రజలకు అవగాహన కల్పిస్తే బాగుంటుందని సూచించారు. రిహాబ్ సేవలను ప్రజలకు చేరువ చేయగలిగితే అత్యవసర పరిస్థితులు తలెత్తకుండా ముందే నివారించవచ్చని చెప్పారు.

కార్డియాక్ రిహాబ్‌తో నివారణ

అత్యవసర పరిస్థితి తలెత్తిన తర్వాత సీపీఆర్, ఇతరత్రా జాగ్రత్తలపై ప్రభుత్వపరంగా శిక్షణ కొనసాగుతుంటే, మరోవైపు ప్రయివేటులో అలాంటివి రాకుండా నివారించేందుకు కార్డియాక్ రిహాబ్ వంటి చికిత్సలు అందుబాటులోకి తెస్తున్నాయి. గుండె జబ్బులు వచ్చే అవకాశం డయాబెటీస్, కొలెస్ట్రాల్, స్మోకింగ్, ఆల్కహాల్ సేవించడం, హై బ్లడ్ ప్రెషర్, ఒత్తిడితో కూడిన జీవితం, ఎప్పుడు కూర్చునే ఉండటం, కుటుంబ ఆరోగ్య చరిత్ర, గుర్తించని కారణాలున్న వారికి ఎక్కువగా ఉంటుంది. వీరికి హార్ట్ అటాక్ వచ్చిన తర్వాత ఆంజియో ప్లాస్టీ గానీ, బైపాస్ సర్జరీ చేయడం గానీ చేస్తారు. దాంతో పాటు రోగి కొన్ని ఔషధాలు కూడా వాడాల్సి ఉంటుంది. ఇలాంటి వారికి కార్డియాక్ రిహాబ్‌తో భవిష్యత్తులో గుండె జబ్బు రాకుండా నివారించుకునే అవకాశమున్నది. ఈ రిహాబ్ ద్వారా కండరాలు గ్లూకోజ్ తీసుకునే సామర్థ్యం పెరిగి డయాబెటీస్ బారిన పడే ప్రమాదాన్ని తగ్గించుకునే వీలుంది. రిహాబ్ ద్వారా జన్యువుల్లో మార్పుల ద్వారా కూడా వారసత్వ ప్రమాదాలను తప్పించుకోవచ్చు. హై బ్లడ్ ప్రెషర్ ఉన్న వారికి గుండె బాగా గట్టిపడి దాని కండరాల సైజు చిన్నగా మారుతుంది. ఇలాంటి వారికి హార్ట్ అటాక్ వచ్చే అవకాశం మిగిలిన వారి కన్నా ఎక్కువగా ఉంటుంది. రిహాబ్ తర్వాత కండరాల్లో పాజిటివ్ మార్పులు వస్తున్నట్టు గుర్తించారు. రిహాబ్ తర్వాత శారీరంగా దృఢంగా మారి ఇంటి దగ్గర ఆడుకునే ఆటలు తిరిగి ఆడుకోవచ్చు. రిహాబ్ కావాలనుకునే వారు మరిన్ని వివరాలకు www.CardiacRehab.com సందర్శించవచ్చు.



బీమా కంపెనీలకే లబ్ది

(మొదటిపేజీ తరువాయి)

పేర్కొన్న మొత్తం రుణంగా తీసుకోవచ్చు. కానీ చాలా రోజులుగా బ్యాంకుల చుట్టూ తిరుగుతున్నా రుణాలు అందడం లేదని సదరు రైతు ఆరోపించారు. "పంట నాశనమైందా లేదా అన్నది భూస్వామికి పట్టింపు ఉండదు. అతను తన డబ్బును కావాలనుకుంటాడు. అతనికి ఇవ్వడానికి నా దగ్గర ఒక్క రూపాయి కూడా లేదు. గతేడాదీ పంట బాగా లేదు. కానీ నేను డబ్బు ఇచ్చాను. కానీ ఇప్పుడు కూడా నేను అతనికి డబ్బు ఇవ్వాలి. అలాగే కొత్త పంట కోసం డబ్బు కావాలి" అని అన్నాడు. హర్యానాలో రైతు నాయకుడు, ఆలిండియా కిసాన్ సభ (ఏఐకేఎస్) జాతీయ ఉపాధ్యక్షుడు అయిన ఇంద్రజిత్ మాట్లాడుతూ.. పంటల బీమా పథకం అయిన పీఎంఎఫ్‌బీ రైతుకు అనుకూలమైనది కాదన్నారు. ప్రత్యేకించి కౌలు వ్యవసాయం చేసే వారు, వ్యవసాయ కూలీలు ప్రభుత్వ పరిహారం పొందలేరని చెప్పారు. ముందుగా ప్రభుత్వం పంట నష్టానికి సరైన పరిహారం ఇవ్వదనీ, ఒకవేళ ఏదైనా ఇచ్చినా అది భూస్వాములకు మాత్రమేనని అన్నారు. అయితే కౌలు రైతులకు ప్రభుత్వం మినహాయింపునివ్వాలని ఆయన తెలిపారు. పంటల బీమా పథకం ప్రక్రియ చాలా క్లిష్టంగా ఉన్నదనీ, దాని ప్రయోజనాలను రైతులు పొందడం దాదాపు అసాధ్యమని అన్నారు. "బీమా కంపెనీలు కొంతమంది రైతులకు కేవలం ప్రచారం కోసం కొన్ని క్లెయిమ్‌లను ఇస్తాయి. అయితే పెద్ద సంఖ్యలో రైతులకు ఇది దక్కదు" అని ఇంద్రజిత్ అన్నారు.

హర్యానాతో పాటు పశ్చిమ ఉత్తరప్రదేశ్‌లో ఆలు, గోధుమ పంటలు నాశనమయ్యాయనీ, అక్కడ రైతుల పరిస్థితి కూడా అలాగే ఉన్నదని ఆయన అన్నారు. రాజస్థాన్‌లో కూడా రైతులు పంటలు తీవ్రంగా నష్టపోయారని చెప్పారు. పలు రాష్ట్రాల్లోనూ ఇదే తీరు ఉన్నదని తెలిపారు. ఈ అన్ని రాష్ట్రాలలో ప్రభుత్వం వెంటనే సర్వే నిర్వహించి రైతులకు నష్టపరిహారం చెల్లించాలని రైతు నాయకులు డిమాండ్ చేశారు. రైతుల పేరు మీద ఈ పథకం కింద బీమా కంపెనీలు ప్రయోజనాన్ని పొందుతున్నాయని రైతు నాయకులు ఆరోపించారు. ఈ పథకం రైతులకు తక్కువ, బీమా కంపెనీలకు ఎక్కువ సాయం చేస్తున్నదన్నారు. గత ఏడాది కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి నరేంద్ర సింగ్ తోమర్ పార్లమెంటులో ఇచ్చిన సమాధానం ద్వారా ఈ విషయం స్పష్టమవుతున్నది. కేంద్ర మంత్రి సమాచారం ప్రకారం.. బీమా కంపెనీలు 2016-2017 నుంచి 2021-2022 వరకు రూ.40,000 కోట్లకు పైగా మిగులు (ఆదా)ను చూశాయి. డిపాజిట్ చేసిన ప్రీమియం రూ.1,59,132 కోట్లు కాగా.. కంపెనీలు రూ.11,90,314 కోట్ల విలువైన క్లెయిమ్‌లు చెల్లించాయి.ఈ సమస్యపై రైతులు అనేక సందర్భాల్లో దేశవ్యాప్తంగా ఆందోళనలు చేస్తున్నారు. ఈ పథకంలో రైతుల సమస్యను ఎత్తిచూపుతూ ఇటీవల మహారాష్ట్రలో కిసాన్ లాంగ్ మార్చ్ ఉద్యమం జరిగిన విషయం విదితమే. ఈ బీమా కంపెనీలు నష్టాన్ని ఎలా లెక్కిస్తాయో తెలియడం లేదనీ, ఈ ప్రక్రియ అంతా పారదర్శకంగా ఉండాలని రైతులు కోరుతున్నారు. పీఎం ఫసల్ బీమా యోజనపై ప్రచారాలకే పరిమితం కాకుండా క్షేత్రస్థాయిలో వాస్తవ పరిస్థితులను కేంద్రం తెలుసుకోవాలని రైతులు, రైతు సంఘాల నాయకులు తెలిపారు.

'ఉపాధి' బకాయిలు రూ.2,500 కోట్లు విడుదల చేయండి

- కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌కు ఏపీ సీఎం వైఎస్ జగన్ వినతి

న్యూఢిల్లీ :రాష్ట్రానికి ఇవ్వాల్సిన సుమారు రూ.2,500 కోట్ల ఉపాధి హామీ బకాయిలను కేంద్రం వెంటనే విడుదల చేయాలని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి కోరారు. గురువారం నాడిక్కడ కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌ను ఆమె నివాసంలో ఏపీ సీఎం జగన్మోహన్ రెడ్డి కలిసి వినతి పత్రం అందజేశారు. దాదాపు 40 నిమిషాలు పాటు జరిగిన ఈ సమావేశంలో వారు వివిధ అంశాలపై చర్చించారు. కేంద్ర హెూం మంత్రి అమిత్ షాను సీఎం జగన్మోహన్ రెడ్డి కలిసిన తరువాత విడుదల చేసిన ప్రకటనలోని అంశాలనే, కేంద్ర మంత్రి నిర్మలా సీతారామన్ దృష్టికి తీసుకెళ్లినట్లు సీఎం కార్యాలయం ప్రకటన విడుదల చేసింది. 2021-22లో రూ.42,472 కోట్ల రుణ పరిమితి కల్పించి, తదుపరి కాలంలో రూ.17,923 కోట్లకు కుదించిన విషయాన్ని ఆర్థిక మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. ఈ విషయంలో సానుకూల నిర్ణయం తీసుకోవాల్సిందిగా విజ్ఞప్తి చేశారు. ఏపికి రెవెన్యూ లోటు కింద రావాల్సిన రూ.36,625 కోట్లను వెంటనే విడుదల చేయాలని కోరారు. అలాగే పోలవరం నిధులు కూడా విడుదల చేయాలని తెలిపారు. తెలంగాణ నుంచి ఏపికి రావాల్సిన విద్యుత్ బకాయిలు రూ.7,058 కోట్లు ఇప్పించాలని విజ్ఞప్తి చేశారు. ఏపికి ప్రత్యేక హెూదా ఇవ్వాలని కోరారు.

భద్రాచలానికి గవర్నర్ తమిళిసై

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

శుక్రవారం భద్రాచలంలో నిర్వహించే శ్రీరాముని సామ్రాజ్య పట్టాభిషేకం కార్యక్రమంలో గవర్నర్ డాక్టర్ తమిళిసై సౌందర రాజన్ పాల్గొననున్నారు. ఇందుకోసం ఆమె గురువారం రాత్రి 11.45 గంటలకు సికింద్రాబాద్ నుంచి రైలు ద్వారా భద్రాచలం బయలుదేరి వెళ్లనున్నట్టు రాజ్ భవన్ ఒక ప్రకటనలో తెలిపింది. శుక్రవారం తెల్లవారుజామున ఆమె కొత్తగూడెం రైల్వే స్టేషన్‌కు చేరుకుంటారు.అక్కడి నుంచి భద్రాద్రికి చేరుకుని... శ్రీరామ పట్టాభిషేకానికి హాజరవుతారు. గవర్నర్‌తోపాటు రాజ్ భవన్ అధికారులు, సిబ్బంది ఇందులో పాల్గొననున్నారు.

మీవి ద్వంద్వ ప్రమాణాలు

క్రీడల్లో రష్యా క్రీడాకారుల వ్యతిరేక ప్రభుత్వాలపై ఐఓసీ అధ్యక్షుడు థామస్ బాచ్



లసానె (స్విట్జర్లాండ్) : ప్రపంచవ్యాప్తంగా ఇప్పటివరకు జరిగిన 70 యుద్ధాలు, సాయుధ బలగాల ఘర్షణపై నోరుమెదని ప్రభుత్వాలు.. ఇప్పుడు రష్యా క్రీడాకారుల పట్ల ద్వంద్వ ప్రమాణాలు పాటిస్తున్నాయని అంతర్జాతీయ ఒలింపిక్ కమిటీ (ఐఓసీ) అధ్యక్షుడు థామస్ బాచ్ పేర్కొన్నారు. ఉక్రెయిన్‌తో రష్యా యుద్ధం కారణంగా గత ఏడాదిగా ఒలింపిక్ క్రీడల్లో రష్యా క్రీడాకారులు తమ దేశానికి ప్రాతినిథ్యం వహించే హక్కు కోల్పోయారు. ఐఓసీ, లేదా సంబంధిత క్రీడల్లో అంతర్జాతీయ సమాఖ్య జెండా తరపున రష్యా అథ్లెట్లు పోటీపడుతున్నారు. రష్యా, బెలారస్ క్రీడాకారులను అనుమతించే విషయంలో పలు కీలక సిఫారసులు చేస్తూ అంతర్జాతీయ క్రీడా ఫెడరేషన్లకు ఐఓసీ లేఖ రాసింది. ఓ వైపు యుద్ధం కొనసాగుతుండగా రష్యా క్రీడాకారులపై నిషేధం ఎత్తివేయటంపై ఉక్రెయిన్, పోలాండ్, చెక్ రిపబ్లిక్ ప్రభుత్వాలు ఐఓసీ పట్ల ఆగ్రహం వ్యక్తం చేశాయి. ఐఓసీ అధ్యక్షుడు థామస్ బాచ్ విమర్శలను తిప్పికొడుతూ కీలక వ్యాఖ్యలు చేశారు. 'క్రీడల్లో, ఒలింపిక్ సర్క్యూట్‌లో మెజారిటీ అభిప్రాయాన్ని, క్రీడల స్వతంత్ర్యాన్ని కొన్ని ప్రభుత్వాలు గౌరవించాలని అనుకోవటం లేదు. ఇది తీవ్రంగా ఖండించాల్సిన అంశం. ఇదే సమయంలో ద్వంద్వ ప్రమాణాలపై వివరణ ఇచ్చేందుకు సిద్ధంగా లేవు.

ప్రపంచ వ్యాప్తంగా 70 యుద్ధాలు, సాయుధ బలగాల ఘర్షణ జరిగిన దేశాలకు చెందిన క్రీడాకారులపై పాటించాల్సిన ప్రమాణాలపై ఇప్పటి వరకు నోరు మెదపలేదు. ప్రభుత్వాల భాగస్వామ్యం ఒలింపిక్ మూవ్‌మెంట్ ఐక్యతను బలోపేతం చేసింది. కానీ ఏ క్రీడల్లో ఏ క్రీడాకారులు పోటీపడాలనే విషయాన్ని ప్రభుత్వాలు నిర్ణయించలేవు. రష్యా, బెలారస్ క్రీడాకారుల మానవ హక్కులను దృష్టిలో ఉంచుకునే వారి ప్రాతినిథ్యంపై తాజా మార్గదర్శకాలు జారీ చేశామని' థామస్ బాచ్ తెలిపారు. 2024 పారిస్ ఒలింపిక్స్‌లో రష్యా, బెలారస్ అథ్లెట్ల అధికార ప్రాతినిథ్యంపై ఐఓసీ ఇంకా నిర్ణయం తీసుకోవాల్సి ఉంది. ప్రస్తుతానికి ఒలింపిక్ క్రీడల్లో అంతర్జాతీయ టోర్నీమెంట్లలో పాల్గొనేందుకు రష్యా, బెలారస్ అథ్లెట్లను అనుమతించాలని ఐఓసీ నిర్ణయం తీసుకుంది.

1000 మంది టెక్నాలజీ కన్సల్టెంట్‌లను జోడిస్తాం

- ప్లూరల్ టెక్నాలజీ సీఈవో వెల్లడి

హైదరాబాద్: వచ్చే మూడేళ్లలో 1000 మంది టెక్నాలజీ కన్సల్టెంట్‌లను జోడించాలని లక్ష్యంగా పెట్టుకున్నామని ప్లూరల్ టెక్నాలజీ సిఇఒ సునీల్ సవరం తెలిపారు. అందులో 500 మంది జపనీస్ భాషలో శిక్షణ పొందు తారని ఆయన ఓ ప్రకటనలో పేర్కొన్నారు. 2025 నాటికి ప్లూరల్ టెక్నాలజీ, ఓపెన్‌సెసమీ టెక్నలాజీ ఐఎన్‌సిలు కలిసి 100 మిలియన్ల వ్యాపారాన్ని సృష్టించాలని లక్ష్యంగా పెట్టుకున్నాయన్నారు. ప్లూరల్ టెక్నలాజీ, జపాన్‌లోని ఓపెన్ సెసేమ్ టెక్నాలజీ ఇటీవల ఆ దేశంలో తమతో భాగస్వామ్య ఒప్పందం కుదుర్చుకుందన్నారు. ప్రస్తుతం రెండు కంపెనీలు కలిపి దాదాపు 500 మంది ఉద్యోగులను కలిగి ఉన్నాయన్నారు. మరో 1000 మంది సాంకేతిక సలహాదారులను జోడించుకోవాలని నిర్దేశించుకున్నామన్నారు.

బిజినెస్

కొత్త ప్రాజెక్టులపై అదానీ వెనుకడుగు..!

- రెండు నెలల్లో కూలిన సామ్రాజ్యం
- 10 లక్షల కోట్ల సంపద ఆవిరి



న్యూఢిల్లీ: అమెరికన్ సంస్థ హిండెన్‌బర్గ్ రిపోర్ట్ దెబ్బకు భారత అపార కుబేరుడు, మోడీకి అత్యంత సన్నిహితుడిగా పేరున్న గౌతం అదానీ వ్యాపార సామ్రాజ్యం కకావికలం అయ్యింది. భవిష్యత్తు ప్రణాళికలు మరుగున పడ్డాయి. అదానీ గ్రూపు తీవ్ర ఆర్థిక అవకతవకలు, కార్పొరేట్ ఎకౌంటింగ్ మోసాలకు పాల్పడుతుందని జనవరి 24న హిండెన్‌బర్గ్ ఇచ్చిన రిపోర్ట్‌తో ఆ సంస్థ కంపెనీల మార్కెట్ విలువ దాదాపు రూ.10 లక్షల కోట్లు (125 బిలియన్ డాలర్లు) తుడుచుకు పెట్టుకుపోయిందని బ్లూమ్‌బర్గ్ తాజాగా ఓ రిపోర్ట్‌లో పేర్కొంది. మరోవైపు అదానీ గ్రూపు అనేక లక్ష్యాలు, ఆశయాలు దెబ్బతిన్నాయని తెలిపింది. కొత్త రంగాలకు విస్తరించే ప్రణాళికలు నిలిచిపోయాయి. ఇప్పటికే భారీ అప్పుల ఊబిలో ఉన్న అదానీ గ్రూపు నిధుల సమీకరణలో మరింత ప్రతికూలతను ఎదుర్కొంటుంది. పెట్రోకెమికల్స్ వ్యాపారాల నుంచి వెనక్కి తగ్గుతోందని, పశ్చిమ భారతదేశంలోని ముంద్రాలో 4 బిలియన్ డాలర్ల గ్రీన్‌ఫీల్డ్ కోల్ టు పాలీ వినైల్ క్లోరైడ్ ప్రాజెక్టుపై ముందుకు వెళ్లే అవకాశం లేదని ఈ వ్యవహారంతో దగ్గర సంబంధం ఉన్న వారు పేర్కొన్నట్లు బ్లూమ్‌బర్గ్ వెల్లడించింది. అదే విధంగా అల్యూమినియం, స్టీల్, రోడ్ ప్రాజెక్టులలోకి ముందుకు వెళ్లాలనే ఆశయాలను వెనక్కి తీసుకుందని సమాచారం. ప్రస్తుతమున్న విద్యుత్ ఉత్పత్తి, నౌకాశ్రయాలు, గ్రీన్ ఎనర్జీ రంగాలపై మాత్రమే దృష్టి సారించే అవకాశం ఉంది. ఇటీవల దొడ్డిదారిన ఎన్‌డిటివిని స్వాధీనం చేసుకున్న అదానీ.. ఇకపై మీడియా సంస్థలను కొనుగోలు చేయడానికి ఆసక్తి చూపకపోవచ్చని తెలుస్తోంది. "హిండెన్‌బర్గ్ రిపోర్ట్‌తో తీవ్ర స్థాయిలో నష్టపోయిన విశ్వాసాన్ని తిరిగి పొందడానికి అదానీ ప్రయత్నించవచ్చు. ఇతర వాటాదారులు, పెట్టుబడిదారుల ఆందోళనపై ప్రధానంగా దృష్టి పెట్టవచ్చు." అని వాషింగ్టన్ ఆధారిత విల్సన్ సెంటర్‌లోని సౌత్ ఆసియా ఇన్స్టిట్యూట్ డైరెక్టర్ మైఖెల్ కుగెల్‌మాన్ పేర్కొన్నారు.

ఎఐ ప్రయోగాలు ఆపాలి

- 1000 మంది నిపుణుల లేఖ



వాషింగ్టన్ : ప్రజల ఉపాధి, ఉనికికే ముప్పు తెచ్చిపెట్టే కృత్రిమ మేధస్సు (ఎఐ) అభివృద్ధి, ప్రయోగాలను ఆపాలని ప్రపంచంలోని 1000 మంది నిపుణులు కోరారు. ఎఐని నిలిపివేయాల్సిన అవసరం ఉందని ట్విట్టర్ అధినేత ఎలాన్ మస్క్, ఆపిల్ సహ వ్యవస్థాపకుడు స్టీవ్ వోజ్నియాక్ సహా 1,000 మంది నిపుణులు తమ సంతకాలతో 'పాజ్ జియాంట్ ఎఐ ఎక్స్‌పెర్‌మెంట్స్' పేరిట బహిరంగ లేఖ విడుదల చేశారు. దీన్ని 'ఫ్యూచర్ ఆఫ్ లైఫ్ ఇన్స్టిట్యూట్' తరపున విడుదల చేశారు.

సంతకం చేసిన వారిలో చాట్‌జిపిటిని విమర్శిస్తున్న ప్రముఖులతో పాటు ఓపెన్‌ఎఐ ప్రత్యర్థి సంస్థల ప్రతినిధులు కూడా ఉన్నారు. ఇటీవల ఎఐ ఆధారిత చాట్‌బాట్ చాట్‌జిపిటిని అభివృద్ధి చేసిన ఓపెన్‌ఎఐ సంస్థ ఇటీవల జిపిటి-4 పేరిట మరింత అత్యాధునిక ఎఐ వ్యవస్థను ఆవిష్కరించింది. ఇది మొత్తం సమాజానికి తీవ్ర ప్రమాదాన్ని తలపెట్టే అవకాశం ఉందని నిపుణులు తమ లేఖలో ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వాలు కల్పించు కుని ఎఐ వ్యవస్థల అభివృద్ధిని వెంటనే నిలిపివేయాలని డిమాండ్ చేశారు.

దుబాయ్ గోల్డ్ సౌక్‌లో మలబార్ స్టోర్ ఏర్పాటు

హైదరాబాద్ : ప్రముఖ ఆభరణాల రిటైల్ చెయిన్ సంస్థ మలబార్ గోల్డ్ అండ్ డైమండ్స్ కొత్తగా దుబాయ్‌లోని గోల్డ్ సౌక్‌లో నూతన స్టోర్‌ను తెరిచినట్లు ప్రకటించింది. దీన్ని యుఎఇ ఆర్థిక శాఖ మంత్రి అబ్దుల్లా బిన్ తౌక్ మర్రీ ప్రారంభించారని ఆ సంస్థ ఓ ప్రకటనలో తెలిపింది. దీంతో ప్రపంచ వ్యాప్తంగా తమ సంస్థ నెట్‌వర్క్ 310 స్టోర్లకు విస్తరించినట్లు పేర్కొంది. తమ విశ్వసనీయ వినియోగదారులకు ఆదర్శప్రాయమైన ఆభరణాల షాపింగ్ అనుభవాన్ని అందించిన 30 ఏండ్ల వార్షికోత్సవాల సందర్భంగా నూతన స్టోర్‌ను తెరవడం సంతోషంగా ఉందని మలబార్ గోల్డ్ అండ్ డైమండ్స్ ఇంటర్నేషనల్ ఆపరేషన్స్ ఎండి షామ్‌లాల్ అహమ్మద్ పేర్కొన్నారు.

యుఎస్‌లో గ్రాన్యూల్స్ ప్యాకేజింగ్ కేంద్రం ఏర్పాటు

హైదరాబాద్:ప్రముఖ ఔషధ ఉత్పత్తుల కంపెనీ గ్రాన్యూల్స్ ఇండియా కొత్తగా అమెరికాలోని వర్జీనియాలో తన అనుబంధ సంస్థ గ్రాన్యూల్స్ కన్స్యూమర్ హెల్త్ (జిసిహెచ్) ద్వారా ప్యాకేజింగ్ కేంద్రాన్ని ప్రారంభించినట్లు వెల్లడించింది. అమెరికాలో భారత రాయబారిగా పనిచేస్తున్న తరన్‌జిత్ సింగ్ సంధు దీన్ని లాంఛనంగా ప్రారంభించారని తెలిపింది. 79,000 చదరపు అడుగుల విస్తీర్ణంలో ఈ కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు ఆ సంస్థ ఓ ప్రకటనలో పేర్కొంది. దీనికి ఇటీవల జీరో 483 అబ్జర్వేషన్లతో యుఎస్ ఎఫ్‌డిఎ ఆమోదం లభించిందని వెల్లడించింది. ఈ కొత్త సెంటర్ తమ సరఫరా గొలుసు సామర్థ్యాన్ని మరింత మెరుగుపరుస్తుందని, వినియోగదారులకు వేగంగా సేవలను అందించడానికి వీలుందని గ్రాన్యూల్స్ ఇండియా సిఎండి డాక్టర్ కృష్ణ ప్రసాద్ చిగురుపాటి తెలిపారు.

గోడాడీ డొమైన్లపై ప్రత్యేక ఆఫర్లు

న్యూఢిల్లీ: భారతీయ ఔత్సాహిక పారిశ్రామికవేత్తలు తమ వ్యాపారాన్ని ఆన్‌లైన్‌లో పెంచుకోవడానికి ప్రత్యేక ఆఫర్లను అందిస్తున్నట్లు గోడాడీ తెలిపింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ముగింపు ఆఫర్ కింద తొలి ఏడాదికి ఇన్‌తో ముగిసే డొమైన్ల కోసం రూ.49కి, ఇన్ఫో డొమైన్లను రూ.319కి, కామ్‌తో ముగిసే డొమైన్లను రూ.499కి, ఒఆర్‌జి డొమైన్లను రూ.749కే అందిస్తున్నట్లు తెలిపింది. ఈ ఆఫర్లు మార్చి 31 వరకూ అందుబాటులోఉంటాయని తెలిపింది.

రాష్ట్రంలో 106 స్క్రీన్లకు విస్తరించిన పివిఆర్ ఐనాక్స్

హైదరాబాద్ : దేశంలో అత్యంత ప్రీమియం సినిమా ప్రదర్శన కంపెనీ పివిఆర్ ఐనాక్స్ రాష్ట్రంలో 106 స్క్రీన్లకు విస్తరించినట్లు తెలిపింది. ఆర్మూర్‌లో కొత్తగా నాలుగు స్క్రీన్ల మల్టీప్లెక్స్‌ను ప్రారంభించడంతో ఈ స్థాయికి చేరినట్లు పేర్కొంది. ఇది రాష్ట్రంలో తమకు 19వ ప్రాపర్టీ అని వెల్లడించింది. దక్షిణాదిలో 94 ప్రాపర్టీలలో 523 స్క్రీన్లను కలిగి ఉన్నట్లు పేర్కొంది. అత్యాధునిక టెక్నాలజీతో ఆర్మూర్‌లో ఏర్పాటు చేసిన మల్టీప్లెక్స్‌లో 1254 మంది ప్రేక్షకుల సిట్టింగ్ సామర్థ్యం కలదని తెలిపింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో దేశంలో కొత్తగా 24 నగరాల్లో 30 ప్రాపర్టీలలో 168 స్క్రీన్లను ఏర్పాటు చేసినట్లు పేర్కొంది.

టాటా ఎఐఎ నుంచి నూతన ఎన్‌ఎఫ్ఓ

హైదరాబాద్ : టాటా ఎఐ లైఫ్ ఇన్సూరెన్స్ (టాటా ఎఐఎ) తాజాగా ప్రొటెక్ట్ యువర్ ఫ్యూచర్ నినాదం ఎన్‌ఎఫ్ఒలను విడుదల చేసింది. ఇందులో సస్టెయినబల్ ఈక్విటీ ఫండ్ ఒకటి కాగా మరొకటి డైనమిక్ అడ్వాంటేజ్ ఫండ్. యూనిట్‌కు రూ.10తో ఎన్ఎవి వద్ద లభ్యమవుతాయని ఆ సంస్థ తెలిపింది. దీర్ఘకాలంలో మూల ధన వృద్ధిని అందిస్తాయని పేర్కొంది. వీటిలోని ఫండ్స్‌ను ప్రధానంగా సస్టెయినబుల్ లేదా పర్యావరణ, సామాజిక, పరిపాలన అనుకూల ప్రక్రియల రంగాల్లోని కంపెనీలలో పెట్టుబడులు పెట్టనున్నట్లు పేర్కొంది.

దొంగతనం నెపంతో దళితుడి హత్య అమానవీయం

- నిందితులను పట్టుకోవడంలో పోలీసుల తాత్సారం సరికాదు : దళిత బహుజనఫ్రంట్, మానవ హక్కుల వేదిక నిజనిర్ధారణ బృందం



నవతెలంగాణ-గుమ్మడిదల

వైరు దొంగతనం చేశాడని ఒక దళితుడిని రాత్రంతా చిత్రహింసలకు గురిచేసి కరెంట్ షాక్ పెట్టి చంపడం అమానవీయమని దళిత బహుజన ఫ్రంట్ జాతీయ కార్యదర్శి పి.శంకర్, రాష్ట్ర కార్యదర్శి పులి కల్పన, మానవ హక్కుల వేదిక రాష్ట్ర కార్యదర్శి షేక్ అహ్మద్ ఆగ్రహం వ్యక్తం చేశారు. సంగారెడ్డి జిల్లా గుమ్మడిదల మండల కేంద్రంలో ఇటీవల దొంగతనం నెపంతో బేగ బుడగ జంగంకు చెందిన దళితుడైన మల్లేష్‌ను హత్య చేసిన ఘటనపై గురువారం డీబీఎఫ్, హెచ్‌ఆర్‌ఎఫ్ నిజ నిర్ధారణ చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మల్లేష్‌ను గత శనివారం అర్ధరాత్రి పొలం దగ్గర కొంతమంది రైతులు పట్టుకొని చిత్రహింసలకు గురి చేస్తూ.. జాతీయ రహదారిపై ఒక భవనం ఎదుట 40 మందికి పైగా మూకుమ్మడిగా దాడి చేశారని తెలిపారు. అంతేకాకుండా భవనం ఎదుట ఉన్న చెట్టుకు కట్టేసి కొట్టి చంపారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ హత్యపై పోలీసులు ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసినప్పటికీ నిందితులను అరెస్ట్ చేయడంలో తాత్సారం ప్రదర్శించడం తగదన్నారు. తక్షణమే వారిని అరెస్ట్ చేసి శిక్ష పడేలా చర్యలు చేపట్టాలని పోలీసులను కోరారు. అలాగే, బాధిత కుటుంబానికి ప్రభుత్వం ఎస్సీ, ఎస్టీ అత్యాచారాల నిరోధకచట్టం ప్రకారం రూ8.25 లక్షల నష్టపరిహారాన్ని వెంటనే అందించాలని డిమాండ్ చేశారు.

విద్యార్థులపై అణచివేత తగదు

- వైఎస్ షర్మిల

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

పేపర్ లీకులపై ఉద్యమిస్తున్న ఓయూ, కేయూ విద్యార్థులపై సర్కార్ అణచివేత చర్యలను మానుకోవాలని వైఎస్‌ఆర్‌టీపీ రాష్ట్ర అధ్యక్షురాలు వైఎస్ షర్మిల గురువారం ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని హెచ్చరించారు. విద్యార్థుల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించకుండా వారిపై నిర్బంధాన్ని ప్రయోగించటమేంటని ప్రశ్నించారు. నోరెత్తితే కేసులు పెడతామని బెదిరించటం తగదని పేర్కొన్నారు. మా ఉద్యోగాలు మాకే అంటూ విద్యార్థులు కొట్లాడకపోతే తెలంగాణ వచ్చేదా? అని ప్రశ్నించారు. లీకులతో ఉద్యోగాలకు లాకులు పడ్డాయని ఎద్దేవా చేశారు. 30 లక్షల మంది నిరుద్యోగుల జీవితాలను పాలకులు అంగట్లో పెట్టారని ఆందోళన వ్యక్తం చేశారు. విద్యార్థులు అడుగుతున్నట్టు ఈ కేసును సీబీఐతో దర్యాప్తు చేయించాలని డిమాండ్ చేశారు

అక్రిడేషన్ కార్డేకాదు..

- సంస్థ గుర్తింపు కార్డు ఉన్నా చాలు..
- అలాంటి మహిళా జర్నలిస్టులందరికీ ఆరోగ్య పరీక్షలు
- ఐఎన్‌పీఆర్ కమిషనర్ అర్వింద్‌కుమార్

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

రాష్ట్రంలో అక్రిడేషన్ కార్డులు ఉన్న మహిళా జర్నలిస్టులకే కాకుండా..అది లేకుండా, సంస్థ గుర్తింపు కార్డు ఉన్న వారికి కూడా ఆరోగ్య పరీక్షలు నిర్వహిస్తామని సమాచార, పౌరసంబంధాల శాఖ కమిషనర్ అర్వింద్‌కుమార్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. శ్రీరామ నవమి సందర్భంగా గురువారం సెలవు దినం కాబట్టి.. ఈ హెల్త్ చెకప్ పరీక్షలు నిర్వహించలేదనీ, శుక్రవారం నుంచి తిరిగి యదావిధిగా ఈ పరీక్షలు నిర్వహిస్తామని ఆయన పేర్కొన్నారు. వచ్చే నెల తొమ్మిది వరకు నిర్వహించే ఈ మాస్టర్ హెల్త్ చెకప్‌లో హైదరాబాద్, రంగారెడ్డి జిల్లాలకు చెందిన అక్రిడిటెడ్ మహిళా జర్నలిస్టులతోపాటు, పత్రికా, న్యూస్ ఛానెళ్లలో పనిచేస్తూ ఆర్గనైజేషన్ గుర్తింపు కార్డులు ఉన్న మహిళా జర్నలిస్టులు కూడా ఈ అవకాశాన్ని వినియోగించుకోవచ్చని ఆయన స్పష్టం చేశారు. ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు నిర్వహించే రక్త పరీక్ష, బ్లడ్ షుగర్, డయాబెటిక్ పరీక్షలు, లిపిడ్ ప్రొఫైల్, థైరాయిడ్, కాల్షియం, మూత్ర పరీక్షలు, విటమిన్ బీ 12 డీ3 మొదలైనవి, ఈసీజీ, ఎక్స్-రే, అల్ట్రాసోనోగ్రఫీ, మామోగ్రామ్, పాప్ స్మెర్ వంటి రోగనిర్ధారణ పరీక్షలు ఉంటాయని తెలిపారు. స్క్రీనింగ్ పరీక్షలు, మెడికల్ ఆఫీసర్ ఎగ్జామినేషన్, ఐ స్క్రీనింగ్, డెంటల్ పరీక్షలు, గైనకాలజీ పరీక్షలు మొదలైనవి ఉంటాయనీ, పరీక్షల నివేదికలను అదే రోజున అందజేయనున్నట్టు ఆయన తెలిపారు.

తవ్వేకొద్దీ కొత్త విషయాలే..

- సిట్ విచారణ తేలేదెన్నడు?

నవతెలంగాణ-సిటీబ్యూరో


టీఎస్‌పీఎస్సీ పేపర్ లీకేజీ కేసు ఇప్పట్లో తేలేటట్టు లేదు. సిట్ విచారణలో తవ్వే కొద్దీ విషయాలు బయటకు వస్తున్నాయి. గురువారం ఉదయం రెండో రోజు పేపర్ లీకేజీపై ముగ్గురు నిందితులను సిట్ ప్రశ్నించింది. ఈ కేసులో నిందితుడు డాక్యానాయక్ ఏఈ పేపర్‌తో దాదాపు రూ.25లక్షలు వసూలు చేసినట్టు కీలక సమాచారం అందినట్టు తెలుస్తోంది. ఈ పేపర్ కోసం నీలేశ్, గోపాల్‌నాయక్ రూ.13.5 లక్షలు చెల్లించిన విషయం తెలిసిందే. అలాగే రాజేందర్ రూ.5 లక్షలు, ప్రశాంత్ రూ.7.5 లక్షలు చెల్లించినట్టు గుర్తించారు. ఏఈ ప్రశ్నాపత్రం కోసం ప్రశాంత్ బంగారం తాకట్టు పెట్టి మరీ రూ.7 లక్షలు తీసుకురాగా, మరికొందరు పొలాలు కూడా తాకట్టు పెట్టినట్టు తెలుస్తోంది. ఈ కేసులో ఇంకా ఎంతమంది ఉద్యోగుల ప్రమేయం ఉందోనన్న కోణంలో సిట్ దర్యాప్తు చేస్తున్నట్టు సమాచారం. ఇప్పటి వరకు సిట్ అధికారులు చేసిన దర్యాప్తు ప్రకారం ఏఈ పేపర్లు 12 మందికి, గ్రూప్-1 పేపర్లు ఐదుగురికి లీకైనట్టు విచారణలో తేలింది. 16 మందిని అరెస్టు చేశారు. విచారణ ఎప్పటిలోగా పూర్తి చేయాలన్నది గడువు లేకపోవడంతో విచారణ ఎప్పుడు తేలుతుందన్నది ప్రశ్నగా మిగిలింది. విచారణ ముగిసిన తర్వాతనే నివేదికను కోర్టుకు సమర్పించే అవకాశం ఉంది.

రాహుల్ గాంధీ అంశాన్ని నిశితంగా గమనిస్తున్నాం : జర్మనీ

న్యూఢిల్లీ : రాహుల్ గాంధీ పార్లమెంట్ సభ్యత్వంపై అనర్హత వేటు విషయాన్ని, బీజేపీ-కాంగ్రెస్ మధ్య మాటల యుద్ధాన్ని నిశితంగా గమనిస్తున్నామని జర్మనీ తెలిపారు. గురువారం ఇక్కడ విలేకరుల సమావేశంలో జర్మనీ విదేశాంగ శాఖ ప్రతినిధి మాట్లాడుతూ 'రాహుల్‌గాంధీపై కేసులో కోర్టు తీర్పును, తీర్పుపై అప్పీల్ చేయగల సామర్థ్యం, ఎంపి సభ్యత్వంపై అనర్హత వేటు.. వంటి విషయాలను నిశితంగా గమనిస్తున్నాం' అని తెలిపారు. న్యాయ స్వతంత్రత, ప్రాథమిక ప్రజాస్వామ్య సూత్రాలు రాహుల్ గాంధీకి సమానంగా అమలవు తాయని జర్మనీ ప్రభుత్వం నమ్మకంగా ఉన్నట్లు చెప్పారు. ఈ వారం ప్రారంభంలో రాహుల్ కేసుపై అమెరికా కూడా స్పందించిన సంగతి తెలిసిందే. ఈ నెల 27న అమెరికా హోం మంత్రిత్వ శాఖ ప్రతినిధి వేదాంత పటేల్ మాట్లాడుతూ 'భారతీయ కోర్టుల్లో రాహుల్ గాంధీ కేసును మేం గమనిస్తున్నాం. భావ ప్రకటన స్వేచ్ఛతో సహా ప్రజాస్వామ్య విలువల్నీ కాపాడ్డంలో భారత ప్రభుత్వంతో కలిసిసాగుతాం' అని చెప్పారు. అయితే కాంగ్రెస్ పార్టీతో అమెరికా ప్రభుత్వానికి ప్రత్యక్ష సంబంధాలు ఉన్నాయా.. లేవా.. అనే ప్రశ్నకు సమాధానం చెప్పడానికి పటేల్ నిరాకరించారు. అయితే ద్వైపాక్షిక సంబంధాల్లో ప్రతిపక్ష పార్టీలను కూడా భాగం చేయడం అమెరికా ప్రభుత్వానికి సాధారణ ప్రమాణికమేనని పటేల్ తెలిపారు. కాగా, జర్మనీ చేసిన ప్రకటనను కాంగ్రెస్ నాయకులు దిగ్విజయ్ సింగ్ స్వాగతించారు. రాహుల్ గాంధీని హింసించడం ద్వారా దేశంలో ప్రజాస్వామ్యం రాజీ పడుతుందని గతంలో తాను చేసిన విమర్శలకు అనుగుణంగానే జర్మనీ ప్రకటన ఉందని దిగ్విజయ్ సింగ్ చెప్పారు.

కుచించుకుపోతున్న ఓయూ

- కోఠి మహిళా కళాశాల యూనివర్సిటీగా మార్పు
- ఓయూకు మహిళా కళాశాల ఎక్కడ ?
- దూర దృష్టి లోపించిన అధికారులు
- మరోచోట కొత్తగా ఏర్పాటు చేయాలని డిమాండ్



నవతెలంగాణ-ఓయూ

ఓయూ అస్తిత్వం నానాటికీ కుచించుకుపోతున్నది. గతంలో తెలంగాణ ప్రాంతంలో అతిపెద్ద విశ్వవిద్యాలయంగా ఉన్న ఉస్మానియా యూనివర్సిటీ (ఓయూ) నాడు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో నూతన యూనివర్సిటీల స్థాపనతో పరిధి కుచించుకుపోయింది. నూతనంగా తెలంగాణ ప్రభుత్వం కోఠి మహిళా కళాశాలను తెలంగాణ మహిళా యూనివర్సిటీగా ఏర్పాటు చేసిన విషయం తెలిసిందే. ఇది హర్షించదగ్గ విషయం. అయితే ఓయూ విద్యార్థినుల అస్తిత్వానికి ప్రతీక అయిన కోఠి మహిళా కళాశాలను వదులుకోకుండా ఓయూ అధికారులు ప్రత్యామ్నాయ ప్రతిపాదనలు ప్రభుత్వానికి సమర్పించకపోవడం పట్ల పలువురు విస్మయం వ్యక్తం చేశారు. మరోచోట మహిళా యూనివర్సిటీ ఏర్పాటు చేసి, కోఠి మహిళా కళాశాలను ఓయూ పరిధిలోనే ఉంచాలని కోరుతున్నారు.ఓయూ కోఠి మహిళా కళాశాలను సాంకేతికంగా వర్సిటీగా ఉన్నతీకరించడం మాత్రమే సరిపోదని, అందుకు అవసరమైన వసతులు కావాలని విద్యావేత్తలు అభిప్రాయపడ్డారు. చారిత్రాత్మక కట్టడాలు, అపూర్వమైన వారసత్వపు సంపద ఆ ప్రాంగణంలో ఉన్న కారణంగా మహిళా యూనివర్సిటీ విస్తరణకు తగినంత అవకాశం లేదని పలువురు సూచిస్తున్నారు. ఓయూ కోఠి ఉమెన్స్ కళాశాలను వదులుకోవడమే కాదు ఇక్కడ ఘనమైన సాంస్కృతిక, చారిత్రక, వారసత్వ సంపదను ఓయూ అధికారులు వదులుకోవడం సరికాదని యూనివర్సిటీ అధ్యాపకులు, విద్యార్థులు, ఉద్యోగులు, పూర్వ విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

చేయిదాటిన కోఠి ఉమెన్స్ కాలేజ్..


ప్రభుత్వం మహిళా యూనివర్సిటీ ఏర్పాటు చేసే క్రమంలో ఓయూ అధికారులు ఒక సుదీర్ఘ ప్రణాళికలతో ఆలోచించి, ప్రత్యామ్నాయ ప్రతిపాదనలు రూపొందించి ప్రభుత్వం ముందుంచితే బాగుండేదన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. కోఠి మహిళా కళాశాల అస్థిత్వాన్ని ఓయూలోనే కొనసాగించాలని, ఎందుకంటే 104 సంవత్సరాల ఓయూ వారసత్వంలో కోఠి ఉమెన్స్ కళాశాల ఒక కలికితురాయని అభిప్రాయపడుతున్నారు. ఓయూ అధికారులు సరైన చర్చ జరిపి విద్యావంతుల నుంచి ప్రతిపాదనలు స్వీకరించి కోఠి ఉమెన్స్ కళాశాల ప్రాంగణాన్ని చేజారకుండా యథాతథంగా కళాశాలను ఇక్కడే కొనసాగించాలని విద్యార్థినులు డిమాండ్ చేస్తున్నారు. అదే విధంగా, మహిళా యూనివర్సిటీకి అన్ని రకాల, నిధులు, నియామకాలు, వసతులు కల్పిస్తూ అధునాతన ప్రాంగణంలో అందరికీ అందుబాటులో ఏర్పాటు చేయాలని ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

యూనివర్సిటీ వ్యతిరేస్తున్నాం..
ఔట అధ్యక్షుడు ప్రొఫెసర్ మనోహర్

ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే నూతనంగా 100 ఎకరాల్లో, వసతులు, నిధులు, నియామకాలు ఏర్పాటు చేసి యూనివర్సిటీ ఏర్పాటు చేయాలి. ఓయూ కోఠి ఉమెన్స్ కళాశాల బోర్డు మార్చి ఇలా చేయడం బాధాకరం.

ఓరుగల్లు సాహితీ శిఖరం.'బాలకిషన్‌రావు' కన్నుమూత

- తెలంగాణ సాహితి సంస్థ సంతాపం




(ఫైల్)

నవతెలంగాణ- హన్మకొండ

ఓరుగల్లుకు చెందిన ఐదు దశాబ్దాల ప్రముఖ సాహితీవేత్త, కవి, న్యాయవాది నమిలికొండ బాల కిషన్‌రావు(73) గురువారం హన్మకొండలోని ప్రయివేటు హాస్పిటల్‌లో చికిత్స పొందుతూ తుది శ్వాస విడిచారు. కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధపడుతూ ఆయన ఇంటికే పరిమితమయ్యారు. హనుమకొండ సాహితీపరులకు కొండంత అండదండగా నమిలి కొండ రాష్ట్రవ్యాప్తంగా పరిచితులు. చైతన్య సాహితి, సాంస్కృతిక సమాఖ్య, సాహితీ సమితి, పోతన విజ్ఞాన పీఠం, కాళోజీ ఫౌండేషన్ కార్యవర్గ సభ్యులుగా, రాజరాజ నరేంద్ర భాషా నిలయంలో క్రియాశీల సభ్యునిగా విశేష సేవ అందించారు. ప్రసారిక మాసపత్రిక ద్వారా నూతన తరానికి వేదిక కల్పించారు. సాహితీ సమితి వేదిక అధ్యక్షులుగా కూడా పనిచేశారు. కరీంనగర్ జిల్లా పూడూరులో నమిలికొండ నారాయణరావు, రత్నబాయి దంపతులకు నలమలి కొండ బాలకిషన్‌రావు 1950 సెప్టెంబర్ 6న జన్మించారు. ఎంఏ, ఎల్‌ఎల్‌బీ, పట్టభద్రుడైన బాలకిషన్ హనుమకొండలో న్యాయవాద వృత్తి చేపట్టారు. వర్ధమాన రచయితలను ప్రోత్సహించాలనే ఉద్దేశంతో 1982లో ప్రసారిక మాసపత్రికను నెలకొల్పారు. దాంతోపాటు ఆయన స్వీయ రచనలైన యువస్వరం (1981), అక్షర చిత్రాలు (1986), శాంతి సమత (1989) అక్షరాల్లో అనంతం (1990) అక్షర ప్రతిబింబం (2006), ప్రసారకీయ కుసుమాలు(2010) వెలువరించారు. సాహితీ సమితి వేదిక ద్వారా నమలికొండ అధ్యక్షులుగా పొట్లపల్లి శ్రీనివాసరావు కార్యదర్శిగా అనేక సభలు, సమావేశాలు, కవి సమ్మేళనాలు నిర్వహించి పుస్తక ప్రచురణలు గావించారు. రాష్ట్ర వ్యాప్తంగా చాలామంది కవులకు సాహితీ సమితి ఒక వేదికగా నిలిచింది. ఇలా ఓరుగల్లు సాహితీ శిఖరంగా వెలుగొందిన నమలికొండ మరణం తెలుగు సాహితీ లోకానికి తీరని లోటని తెలంగాణ సాహితీ సంస్థ రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులు వి.జనార్ధన్, కె.ఆనందాచారి ఆయనకు సంతాపం తెలిపారు. అలాగే, పలువురు కవులు, రచయితలు నివాళి అర్పించారు.

సర్వేల వద్దే రైల్వే బ్రిడ్జీలు

- వికారాబాద్ జిల్లాలో 15 వంతెనలకు సర్వే
- కేంద్రం నిర్లక్ష్యం, నిధుల లేమితో ముందుకు సాగని పనులు
- తరచూ ప్రమాదాలతో ప్రజల్లో ఆందోళన
- వేల సంఖ్యలో మూగజీవాల మృత్యువాత



నవతెలంగాణ- రంగారెడ్డి ప్రాంతీయ ప్రతినిధి

రైల్వే వంతెనల నిర్మాణాలు సర్వేల వద్దే ఆగిపోయాయి.. కేంద్ర ప్రభుత్వం నిర్లక్ష్యం.. నిధుల విడుదల లేక వంతెనల నిర్మాణం జరగడం లేదు. వికారాబాద్- తాండూరు మార్గంలో 15 వంతెనలు నిర్మించాలని సర్వే చేసినప్పటికీ నిధులు కేటాయించకపోవడంతో కార్యరూపం దాల్చలేదు. దాంతో రైల్వే ట్రాక్‌ల వద్ద ప్రజలు బిక్కుబిక్కుమంటూ ప్రయాణించాల్సి వస్తోంది. కొన్నిసార్లు ప్రమాదాలు జరుగుతున్నాయి. వేలాదిగా మూగజీవాలు మృత్యువాతపడ్డాయి. రైల్వే బ్రిడ్జీలు లేక వికారాబాద్ జిల్లా ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులపై కథనం.

రంగారెడ్డి, వికారాబాద్ జిల్లాల్లో సుదూర రైల్వే మార్గం ఉంది. వికారాబాద్ జిల్లాలో 30 ప్రాంతాల్లో రైల్వే ట్రాక్‌లు దాటి ఆయా గ్రామాలకు వెళ్లాల్సి ఉంది. కొన్నిచోట్ల గ్రామాలకు వెళ్లే మార్గంలో చెక్ పోస్టులు కూడా లేవు. వికారాబాద్ నుంచి తాండూరు వెళ్లే మార్గం అత్యంత ప్రమాదకరంగా ఉంది. ఈ ప్రాంతంలో 15 చోట్ల వంతెన నిర్మాణాలు చేపట్టాలని రైల్వే అధికారులు సర్వే చేశారు. కానీ ఇప్పటి వరకు అతీగతి లేదు. ఇటీవల పలుచోట్ల అండర్ బ్రిడ్జీలు ఏర్పాటు చేసినా వర్షం వచ్చిందంటే రెండు, మూడ్రోజుల పాటు రాకపోకలు నిలిచిపోతున్నాయి. మోమిన్‌పేట నుంచి కేసారం పోయే మార్గంలో ఏర్పాటు చేసిన అండర్ బ్రిడ్జితో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కొత్తగాడి నుంచి కొంపెల్లి వెళ్లే మార్గంలో రైల్వే వంతెన లేక ప్రయాణికులు రైలు పోయే దాకా నిరీక్షించాల్సి వస్తోంది.

ప్రజల గోడు పట్టని కేంద్రం

ఎన్నో ఏండ్లుగా రైల్వే వంతెనలు నిర్మాణం కోసం ఈ ప్రాంత ప్రజలు పోరాటం చేస్తున్నప్పటికీ కేంద్ర ఏమాత్రం స్పందించడం లేదు. ఈ ప్రాంతంలో రైల్వే మార్గంలో జరుగుతున్న ప్రమాదాలను వివరిస్తూ వంతెనల నిర్మాణాలకు నిధులు కేటాయించాలని ప్రతియేటా బడ్జెట్ సమావేశాల్లో స్థానిక ఎంపీలు మొరపెట్టుకున్నా కేంద్రం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోంది. ఇదిలా ఉంటే, వికారాబాద్ మున్సిపాలిటీ కాంగ్రెస్ హయాంలో శాటిలైట్ సిటీ జాబితాలో ఎంపికైంది. బీజేపీ అధికారంలోకి వచ్చాక స్మార్ట్‌సిటీ జాబితా ప్రకటించింది. దాంట్లో వికారాబాద్‌కు మొండిచేయి చూపింది. వికారాబాద్‌ను ఎంపిక చేయలేదు. కేంద్ర ప్రభుత్వం తక్షణమే వికారాబాద్‌ను స్మార్ట్‌సిటీ జాబితాలో చేర్చాలని, రైల్వే వంతెనల నిర్మాణాలకు నిధులు కేటాయించాలని జిల్లా వాసులు కోరుతున్నారు. అలాగే, జిల్లాలో సీసీఐ (సిమెంట్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా)ను ప్రయివేట్ సంస్థలకు అప్పగించే నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

రైల్వే వంతెనలు ఏర్పాటు చేయాలి
మల్లేశం- సీపీఐ(ఎం) వికారాబాద్ జిల్లా కార్యదర్శి

రైల్వే వంతెనలు లేకపోవడంతో నిత్యం ఏదో ఒక చోట ప్రమాదం జరుగుతోంది. వేల సంఖ్యలో మూగజీవాలు మృత్యువాత పడ్డాయి. ఎన్నిసార్లు కేంద్ర ప్రభుత్వానికి మొరపెట్టుకున్నా పట్టించుకున్న దాఖలాలు లేవు. శాటిలైట్ సిటీగా ఎంపికైన వికారాబాద్‌ను స్మార్ట్ సిటీ జాబితాలో చేర్చకుండా కేంద్రం వివక్ష చూపింది. తక్షణమే వికారాబాద్‌ను స్మార్ట్ సిటీ జాబితాలో చేర్చి అభివృద్ధి చేయాలి.

ప్రజలు ప్రాణం కోల్పోతున్నారు
రంజిత్‌రెడ్డి- చేవెళ్ల పార్లమెంట్ సభ్యులు

వికారాబాద్ జిల్లాలో రైల్వే మార్గంలో వంతెనల నిర్మాణాలు అత్యవసరం. ఇందుకు నిధులు కేటాయించాలని ప్రతి బడ్జెట్ సమావేశంలోనూ పార్లమెంట్‌లో కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి పెంచుతున్నాం. కేంద్రం నిర్లక్ష్యంతో ఈ ప్రాంతంలో ఎన్నో ప్రాణాలు గాలిలో కలుస్తున్నాయి. తక్షణమే నిధులు కేటాయించి, రైల్వే వంతెనల నిర్మాణం చేపట్టాలి.

నిరుద్యోగులకు గుడ్ న్యూస్..

ఏప్రిల్ 1 నుంచి అకౌంట్‌లోకి డబ్బులు



భారతదేశంలో ప్రతి ఏటా యూనివర్సిటీల నుంచి చదువు పూర్తి చేసుకుని బయటకు వస్తున్న వారి సంఖ్య భారీగా పెరుగుతోంది. అయితే చదివిన అందరికి ఉద్యోగాలు లభించక పోవడంతో నిరుద్యోగ సమస్య తారా స్థాయికి చేరుకుంటోంది. దీనిని దృష్టిలో ఉంచుకుని గతంలో ఛత్తీస్‌గఢ్ గవర్నమెంట్ ఎన్నికల సమయంలో ఉద్యోగం లేని యువతకు నిరుద్యోగ భృతి ఇస్తామని హామీ ఇచ్చింది. అది ఇప్పుడు అమలు చేయడానికి శ్రీకారం చుట్టింది. వచ్చే నెల 01 నుంచి (ఏప్రిల్) నిరుద్యోగ యువతకు రూ. 2,500 నిరుద్యోగ భృతి అందించనున్నారు. దీని కోసం ఛత్తీస్‌గఢ్ ప్రభుత్వం ఏకంగా రూ. 250 కోట్ల మేర బడ్జెట్ కేటాయించింది. ఇది మాత్రమే కాకుండా అంగన్‌వాడీ కార్యకర్తలు, హౌస్‌గార్డులు, గ్రామ కొత్వార్‌లు, ఇతర ఉద్యోగుల జీతాలు కూడా పెంచనున్నట్లు గతంలో సీఎం భూపేశ్ భఘేల్ తెలిపారు, ఇది కూడా అమలయ్యే అవకాశం ఉంది.

నిరుద్యోగ భతి తీసుకోవడానికి అర్హతలు:

నిరుద్యోగ భతి తీసుకోవడానికి తప్పకుండా ఛత్తీస్‌గడ్ నివాసితులై ఉండాలి. అంతే కాకుండా 18 నుంచి 35 సంవత్సరాలు ఉన్న యువకులు, ఇంటర్ మీడియట్ పూర్తి చేసుకున్న యువకులు దీనికి అర్హులు. అలాగే కుటుంబ వార్షిక ఆదాయం రూ. 2.50 లక్షల కంటే తక్కువ ఉండాలి.

నిరుద్యోగ యువత ఛత్తీస్‌గడ్‌లోని సెల్ఫ్ ఎంప్లాయిమెంట్ గైడెన్స్ సెంటర్, జిల్లా ఎంప్లాయిమెంట్ కార్యాలయంలో నమోదు చేసుకుని ఉండాలి. ఏప్రిల్ 1 నాటికి ఎంప్లాయిమెంట్ రిజిస్ట్రేషన్ రెండేళ్లుగా ఉండాలి. ఇవన్నీ ఉన్నప్పుడే నిరుద్యోగ భతికి అర్హత పొందుతారు.

నిరుద్యోగ భతి ఎలా అందుతుంది?

నిరుద్యోగ యువతకు పైన చెప్పిన అన్ని అర్హతలు, అదే సమయంలో ఎంప్లాయిమెంట్ కార్యాలయంలో రిజిస్టర్ చేసుకుని ఉన్నప్పుడే నెలకు రూ. 2,500 లభిస్తుంది. ఇది నేరుగా లబ్దిదారుల బ్యాంక్ అకౌంట్‌కి జమ అవుతుంది. అంతే కాకుండా రాష్ట్రంలో నిరుద్యోగుల సంఖ్యను తగ్గించడానికి నైపుణ్య శిక్షణ కూడా అందించనున్నట్లు సంబంధింత అధికారులు చెబుతున్నారు.

మంటల్లో కాలిపోయిన ఆర్టీసీ బస్సు

- ద్విచక్ర వాహనాన్ని ఢీకొనడంతో ప్రమాదం
- ద్విచక్ర వాహనదారుడు మృతి





నవతెలంగాణ-మునగాల

ఆర్టీసీ బస్సు ద్విచక్రవాహనాన్ని ఢీకొట్టడంతో ఎగసిపడిన మంటల్లో బస్సు కాలిపోయింది. తీవ్రంగా గాయపడిన ద్విచక్రవాహ నదారుడు మృతిచెందాడు . ఈ ఘటన సూర్యాపేట జిల్లా మునగాల మండల వరధిలోని ఇందిరానగర్ సమీపంలో 65జాతీయ రహదారిపై గురువారం జరిగింది. ఎస్ఐ లోకేష్ తెలిపిన వివరాల ప్రకారం ..

హైదరాబాద్ మియాపూర్ డిపోకు చెందిన ఆర్టీసీ రాజధాని ఏసీ ఎక్స్‌ప్రెస్ బస్సు విజయవాడకు వెళ్తోంది. అయితే, ఇందిరానగర్ సమీపంలో గ్రామానికి చెందిన రాజు ద్విచక్రవాహనంపై పొలానికి వెళ్లి ఇంటికి వచ్చే క్రమంలో మట్టి రోడ్డు నుంచి జాతీయ రహదారి ఎక్కుతుండగా బస్సు ఢీకొట్టింది. క్షణాల్లోనే స్కూటీ నుంచి మంటలు లేచి బస్సు ముందు భాగానికి అంటుకున్నాయి. దట్టంగా పొగలు కమ్ముకోవడంతో డ్రైవర్ అప్రమత్తమై బస్సును పక్కకు ఆపేసి ప్రయాణికులను వెంటనే దింపేశాడు. సంఘనా స్థలానికి అగ్నిమాపక సిబ్బంది చేరుకునే సమయానికే బస్సు, స్కూటీ మొత్తం కాలిపోయాయి. ప్రయాణికుల సామాన్లు కాలిపోయాయి. ఈ ప్రమాదంలో ద్విచక్ర వాహనదారుడు మురుగేష్ రాజు(45) తీవ్రంగా గాయపడటంతో సూర్యాపేట ఏరియాస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించి మృతిచెందాడు. బస్సులో వున్న 13 మందిని ఇతర వాహనాల్లో పంపించారు. ఘటనా స్థలంలో దట్టంగా పొగ కమ్ముకోవడంతో జాతీయ రహదారిపై పెద్దఎత్తున వాహనాలు నిలిచిపోయాయి. మునగాల సీఐ ఆంజనేయులు పర్యవేక్షణలో పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

బాత్రూంలోనే మహిళ ప్రసవం

- నల్లగొండ ప్రభుత్వాస్పత్రిలో ఘటన



నవతెలంగాణ-నల్లగొండ

పురిటి నొప్పులు అధికమై బాత్రూమ్‌కు వెళ్లిన సమయంలోనే ఓ గర్భిణి అక్కడే బిడ్డకు జన్మనిచ్చింది. ఈ ఘటన బుధవారం రాత్రి నల్లగొండ జిల్లా కేంద్ర ప్రభుత్వాస్పత్రిలో వెలుగు చూసింది. వివరాలిలా ఉన్నాయి. నిడమనూరు మండలం ధర్మపురం గ్రామానికి చెందిన గర్భిణి పార్వతమ్మ మూడ్రోజుల కిందట పురిటి నొప్పులతో ప్రభుత్వాస్పత్రిలో చేరింది. మొదటి కాన్పులో సాధారణ డెలివరీ అయిందని, రెండో కాన్పు కూడా నార్మల్ డెలివరీ అవుతుందని డాక్టర్లు చెప్పారు. డెలివరీకి ఇంకా సమయం ఉందన్నారు. అయితే, కొద్దిసేపటికే ఆ గర్భిణి బాత్రూంకు వెళ్లింది. ఈ క్రమంలో అక్కడే బిడ్డకు జన్మనిచ్చింది. ఈ విషయం తెలుసుకున్న వైద్య సిబ్బంది పుట్టిన బాబును వెంటనే ఐసీయూకి తరలించి వైద్యం అందించారు. ఈ సందర్భంగా గర్భిణి బంధువులు మాట్లాడుతూ.. మధ్యాహ్నం 3 గంటల నుంచి తమ కూతురు నొప్పులతో బాధపడుతున్నా వైద్యులు పట్టించుకోలేదని తెలిపారు. నొప్పులు అధికమవడంతో బాత్ రూమ్‌లోనే బాబుకు జన్మనిచ్చిందని తెలిపారు. ప్రస్తుతం తల్లీబిడ్డ క్షేమంగా ఉన్నారు.

సీపీఐ సీనియర్ నేతపువ్వాడకు అస్వస్థత

- హైదరాబాద్ కిమ్స్ ఆస్పత్రికి తరలింపు

నవతెలంగాణ-ఖమ్మం

భారత కమ్యూనిస్టు పార్టీ(సీపీఐ) సీనియర్ నాయకులు, మాజీ శాసనసభ పక్ష నేత, ఖమ్మం మాజీ ఎమ్మెల్యే, మాజీ ఎమ్మెల్సీ పువ్వాడ నాగేశ్వరరావు బుధవారం(29న) ఖమ్మంలో స్వల్ప అస్వస్థతకు గురయ్యారు. దాంతో సికింద్రాబాద్‌లోని కిమ్స్ ఆస్పత్రికి తరలించారు. ఖమ్మంలోని తన నివాసంలో అస్వస్థతకు గురైన పువ్వాడకు తొలుత మమత ఆస్పత్రిలో ప్రథమ చికిత్స అందించారు. హైదరాబాద్ నుంచి వచ్చిన ఆయన కుమారుడు, మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్.. తన తండ్రికి మెరుగైన వైద్యం అందించేందుకు వెంటనే అంబులెన్స్‌లో హైదరాబాద్‌కు తరలించారు. ఆయన కూడా హుటాహుటిన హైదరాబాద్ తరలి వెళ్లారు. ఈ సందర్భంగా పోలీసులు అంబులెన్స్‌కు అంతరాయం కలుగకుండా ఆ మార్గంలో గ్రీన్‌చానెల్‌ను ఏర్పాటు చేశారు. పువ్వాడ నాగేశ్వరరావుకు కిమ్స్ వైద్యులు ప్రత్యేక వైద్య సేవలు అందిస్తున్నారు. ప్రస్తుతం వెంటిలేటర్‌పై ఉంచి పువ్వాడకు చికిత్స అందిస్తున్నట్టు సమాచారం. తన తండ్రి అనారోగ్యం దృష్ట్యా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న నేపథ్యంలో గురువారం భద్రాచలంలో జరిగే సీతారాముల కల్యాణానికి మంత్రి హాజరు కాలేదు. పువ్వాడ నాగేశ్వరరావుకు ఇద్దరు కుమారులు పెద్ద కుమారుడు పువ్వాడ ఉదయ్ కుమార్ అనారోగ్య సమస్యలతో గతంలో మృతి చెందారు. ద్వితీయ కుమారుడైన అజయ్ కుమార్ బీఆర్ఎస్ ప్రభుత్వంలో మంత్రిగా కొనసాగుతున్నారు.

పేపర్ లీకులపై టీపీసీసీ ఉద్యమ కమిటీ ఏర్పాటు

- చైర్మెన్‌గా మల్లు రవి

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

పేపర్ లీకులపై ఉద్యమించేందుకు టీపీసీసీ ప్రత్యేకంగా కమిటీ ఏర్పాటు చేసింది.టీపీసీసీ అధ్యక్షులు రేవంత్‌రెడ్డి సూచన మేరకు గురువారం కమిటీని ప్రకటించారు. టీపీసీసీ సీనియర్ పాధ్యక్షులు మల్లు రవి చైర్మెన్ కమిటీ ఏర్పాటైంది. కన్వీనర్లుగా యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు శివసేనారెడ్డి, ఎన్ ఎస్‌యూఐ అధ్యక్షులు వెంకట్, సభ్యులుగా మానవతా రాయ్, బాల లక్ష్మి, పవన్ మల్లాదిలను నియమించారు.

1010 ధాన్యాన్ని ప్రభుత్వమే కొనాలి

- ఐకేపీ కేంద్రాలను వెంటనే తెరవాలి
- సీపీఐ(ఎం) మాజీ ఎమ్మెల్యే జూలకంటి డిమాండ్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ఆయకట్టు, బావుల కింద తొలుత నాటుపెట్టిన 1010 వరి ధాన్యాన్ని ప్రభుత్వమే మద్దతు ధరకు కొనుగోలు చేయాలని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు, మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి డిమాండ్ చేశారు. గురువారం మిర్యాలగూడ సబ్‌మార్కెట్ యార్డు పరిధిలోని దామరచర్లలో ఆయన పర్యటించారు. రైతులను కలిసి వారి ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. ప్రభుత్వమే ఆ ధాన్యాన్ని ఐకేపీ కేంద్రాలు, సహకార సంఘాల ద్వారా కొంటుందని వివరించారు. రైతులు మార్కెట్ యార్డులకు ధాన్యాన్ని తెచ్చి 10, 15 రోజులు కావస్తున్నా ఐకేపీ కేంద్రాలను ఇంత వరకు తెరవలేదని విమర్శించారు. దీంతో వారు వానకు తడిసి, ఎండకు ఎండి అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. రైతులకు అక్కడ కనీస సౌకర్యాల్లేవని ఆందోళన వ్యక్తం చేశారు. తాగునీరు, కరెంటు, రోడ్లు, టార్పాలిన్‌లు అందుబాటులో లేవన్నారు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే జోక్యం చేసుకుని కనీస సౌకర్యాలను కల్పించేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. వచ్చిన ధాన్యాన్ని వచ్చినట్టుగానే ప్రభుత్వం మద్దతు ధరకు కొనుగోలు చేయాలని కోరారు. ఐకేపీ కేంద్రాలను వెంటనే తెరవాలని, తద్వారా రైతులు ఇబ్బందులు పడకుండా చూడాలని సూచించారు.

సంపాదకీయం

ఉక్రెయిన్‌లో రెచ్చిపోతున్న కిరాయి మూకలు!

అమెరికా నేతృత్వంలోని నాటో కూటమి కుట్రలను దెబ్బతీసేందుకు ఉక్రెయిన్ మీద రష్యా ప్రారంభించిన సైనిక చర్యకు గురువారం నాటితో నాలుగు వందల రోజులు నిండాయి. గత కొద్ది నెలలుగా బెక్స్‌మట్ పట్టణం వద్ద కేంద్రీకృతమైన పోరులో పుతిన్ దళాలు కొంత మేర విజయం సాధించినట్లు ఉక్రెయిన్ మిలిటరీ అధికారి అంగీకరించాడు. మరోవైపున రష్యా మరింతగా ఒత్తిడి పెంచుతోంది, దానిలో భాగంగా మిలిటరీ వార్షిక విజయోత్సవం సందర్భంగా ఖండాంతర క్షిపణులతో సైనిక విన్యాసాలు జరపనున్నట్లు రక్షణశాఖ ప్రకటించింది. పన్నెండు వేల కిలోమీటర్ల పరిధిలో ప్రత్యర్థి క్షిపణులను తప్పించుకోగలిగిన యార్స్ ఖండాంతర క్షిపణి వ్యవస్థలతో మూడు ప్రాంతాల్లో విన్యాసాలు జరపనుంది. ఇది నాటో కూటమి దుస్సాహసాన్ని ఎదుర్కోగలమని చెప్పటంతో పాటు తమ సైనిక పాటవాన్ని తక్కువ అంచనా వేయవద్దని హెచ్చరించటమే. చైనా ప్రతిపాదించిన శాంతి పథకానికి పుతిన్ వైపు నుంచి వచ్చిన సానుకూలత తప్ప జెలెనెస్కీ నోరు మెదపటం లేదు. దీన్ని బట్టి దీర్ఘకాలం ఈ సంక్షోభాన్ని కొనసాగించాలన్న నాటో కూటమి దుష్ట పథకాన్ని అర్థం చేసుకోవచ్చు.

> అమెరికా, నాటో బాధిత దేశాలకు చెందిన వారు, చెచెన్ ఇతర తీవ్రవాదులతో పని చేసి తరువాత విబేధించిన వారు ఉక్రెయిన్ మిలిటరీ దాడులకు వ్యతిరేకంగా తిరుగుబాటు ప్రాంతాలైన డాన్‌బాస్ ప్రాంతంలో జనానికి మద్దతుగా పోరు సాగిస్తున్నట్లు వార్తలు. మధ్య ప్రాచ్యం, మధ్య ఆసియా దేశాలకు చెందిన 16వేల మంది వలంటీర్లు తమ తరపున పోరాడేందుకు దరఖాస్తు చేసుకున్నట్లు గతంలో రష్యన్ రక్షణ మంత్రి సెర్గీ షొయిగు చెప్పాడు. కిరాయి మూకల గురించి ఉక్రెయిన్ బహిరంగం గానే చెబుతున్నది.

ఉక్రెయిన్ సంక్షోభంలో పశ్చిమ దేశాలు తమ మిలిటరీని దించకుండా కిరాయి మూకలకు అస్త్ర శస్త్రాలను అందించి పుతిన్ సేనల మీద దాడులు లేదా ఎదుర్కోనేట్లు చూస్తున్నాయి. ఉగ్రవాదం మీద పోరు అంటూ ఫోజులు పెడుతున్న ఈ కూటమి నిజస్వరూపం రోజు రోజుకూ బట్టబయలు అవుతున్నది. ఇప్పటి వరకు పశ్చిమాసియాలోని సిరియా ప్రభుత్వం మీద దాడులకు ఐసిస్, ఆల్‌ఖైదా పేరుతో పని చేస్తున్న కిరాయిమూకలలో భాగమైన చెచెన్లతో ఉక్రెయిన్ ఒప్పందం చేసుకొని వారికి ఇప్పుడు శిక్షణ ఇస్తున్నది. ఇప్పటికే పలు ముసుగు పేర్లతో 34దేశాలకు చెందిన మూకలు రష్యా మిలిటరీని ఎదుర్కొంటున్నాయి. ఉక్రెయిన్ భూ భాగాన్ని పరిరక్షించేందుకు ఏర్పడిన అంతర్జాతీయ దళం పేరుతో ఏర్పడిన సంస్థ ద్వారా పోరాడేందుకు 52దేశాలకు చెందిన ఇరవై వేల మంది దరఖాస్తు చేసుకున్నట్లు మార్చినెల ఆరవ తేదీన ఉక్రెయిన్ అధికారికంగా ప్రకటించింది. నిజానికి గత ఏడాది కాలంలో వివిధ దేశాలకు చెందిన వేలాది ఇప్పటికే రంగంలో ఉన్నారు. చెచెన్ మూకలతో ఒప్పందం రానున్న రోజుల్లో మరిన్ని దేశాల నుంచి భారీ ఎత్తున అలాంటి శక్తులు వచ్చేందుకు ప్రోత్సహిస్తుందనటంలో ఎలాంటి సందేహం లేదు. పరాయిగడ్డ మీద ఇతర దేశాల కోసం జరిపే దాడుల్లో తమ సైనికులు ప్రాణాలు పోగొట్టుకోవటాన్ని అమెరికన్లు సహించటం లేదు, తీవ్ర వ్యతిరేకత వెల్లడవుతున్నది. అందువలన ఇలాంటి కిరాయి బాపతును రోజుకు ఎక్కువగా రంగంలోకి దించుతున్నది.



ఉక్రెయిన్ మిలిటరీ, దానితో కలసి దాడులకు పాల్పడుతున్న కిరాయిమూకలకు ఏడాది కాలంలో అమెరికా ఇప్పటి వరకు వంద బిలియన్ డాలర్ల మేర ఆయుధాలు లేదా నగదు అందించిందని అంచనా. వలంటీర్ల పేరుతో అమెరికా నుంచి కూడా శ్వేతజాతి దురహంకారశక్తులు ఉక్రెయిన్‌లో పనిచేస్తున్నట్లు వారికి ఏడాదికి 75వేల నుంచి లక్ష డాలర్ల వరకు చెల్లిస్తున్నట్లు వార్తలు. మార్చి 26న న్యూయార్క్ టైమ్స్ పత్రిక అలాంటి వారిలో కొందరి గురించి వివరాలు ఇచ్చింది. సామ్రాజ్యవాదుల చరిత్రను చూసినపుడు ఇలాంటి కిరాయి మూకలను ఇతర దేశాలను ఆక్రమించేందుకు పంపిన సంగతి తెలిసిందే. బ్రిటన్, డచ్ పాలకులు అలాంటి మూకలను భారత్, ఇతర దేశాలకు పంపి దాడులు చేయించారు. వర్తమాన చరిత్రలో బ్రిటన్ తన అవసరాల కోసం, తరువాత అమెరికా సోవియట్ యూనియన్‌కు వ్యతిరేకంగా సీఐఏ ద్వారా ముస్లిం దేశాల్లో తాలిబాన్లు, ఆల్‌ఖైదా వంటి దళాలను ఏర్పాటు చేసిన ఉదంతాల గురించి చెప్పనవసరం లేదు. ప్రస్తుతం ఉక్రెయిన్‌లో అలాంటి మూకలను కూడగట్టటంలో అమెరికా, బ్రిటన్ తలమునకలుగా ఉన్నాయి.

ఇదే సమయంలో అమెరికా, నాటో బాధిత దేశాలకు చెందిన వారు, చెచెన్ ఇతర తీవ్రవాదులతో పని చేసి తరువాత విబేధించిన వారు ఉక్రెయిన్ మిలిటరీ దాడులకు వ్యతిరేకంగా తిరుగుబాటు ప్రాంతాలైన డాన్‌బాస్ ప్రాంతంలో జనానికి మద్దతుగా పోరు సాగిస్తున్నట్లు వార్తలు. మధ్య ప్రాచ్యం, మధ్య ఆసియా దేశాలకు చెందిన 16వేల మంది వలంటీర్లు తమ తరపున పోరాడేందుకు దరఖాస్తు చేసుకున్నట్లు గతంలో రష్యన్ రక్షణ మంత్రి సెర్గీ షొయిగు చెప్పాడు. కిరాయి మూకల గురించి ఉక్రెయిన్ బహిరంగం గానే చెబుతున్నది. అందువలన డబ్బుకోసం గాక స్వచ్ఛందంగా డాన్‌బాస్ ప్రాంతంలో జనం కోసం పోరాడేందుకు వచ్చేవారికి సాయపడాల్సి ఉందని పుతిన్ కూడా చెప్పాడు. ప్రజాస్వామ్యం గురించి కబుర్లు చెప్పే అమెరికా కిరాయి బాపతును సమీకరించేందుకు అమెరికన్లకు స్వేచ్ఛనిచ్చింది. జర్మనీ వంటి కొన్ని ఐరోపా దేశాలు స్వయంగా విధించుకున్న నిబంధనల ప్రకారం సదరు దేశాల పౌరులు కిరాయికి పని చేయటం లేదా సమీకరించటం చట్టరీత్యా నిషిద్ధం. అయితే అదే జర్మన్లు ఉక్రెయిన్‌ను పని చేస్తున్న మూకల పట్ల ఎలాంటి అభ్యం తరాలు పెట్టకపోగా అవసరమైన ఆర్థికసాయం అందిస్తున్నది.

ప్రస్తుతం సామ్రాజ్యవాదులు కిరాయి మూకలతో పాటు ప్రయివేటు మిలిటరీ సేవలు అందించే సంస్థలను పెద్ద ఎత్తున ప్రోత్సహిస్తున్నాయి. ఇప్పటికీ అనేక దేశాలో అలాంటి వాటిని ముందుకు తీసుకువచ్చి తమ ప్రయోజనాలకు వినియోగించు కుంటున్నారు. ఇదొక ప్రమాదకర క్రీడ. దాన్ని కొనసాగిస్తున్న సామ్రాజ్యవాద, మతశక్తుల పట్ల జనం అప్రమత్తంగా ఉండాలి.



పెన్షన్ భిక్ష కాదు...హక్కు!

'పెన్షన్' కేసులో నాటి సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ వైవి చంద్రచూడ్ నేతృత్వంలోనిధర్మాసనం 17 డిసెంబర్1982న ఒక చారిత్రాత్మక తీర్పుని వెలువరించింది. ఆ తీర్పు ప్రకారం... "పెన్షన్ అనేది ఉద్యోగుల హక్కు. అంతేకానీ అది ప్రభుత్వం దయతలచి ఇచ్చే బహుమతి కాదు (PENSION IS EMPLOYEES RIGHT BUT NOT BOUNTY GIVEN BY THE GOVT అనేపదం వాడి) తీర్పు ఇచ్చింది. అయినా ప్రభుత్వాలు పెన్షన్‌ని దయతో ఇచ్చే బహుమతి గానే చూడటం బాధాకరం. జనవరి 1, 2004 తర్వాత కేంద్ర సర్వీసుల్లో చేరిన ఉద్యోగులకు అదే ఏడాది సెప్టెంబర్ తర్వాత రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగాల్లో చేరిన ఉద్యోగులకు పిఎఫ్ఆర్‌డిఏ చట్టం అనుసరించి నూతన పింఛను పథకం అమలు చేస్తున్నారు. డిఫైన్డ్ ఫైన్షన్ సౌకర్యానికి నూతన పెన్షన్ విధానం పేరుతో మంగళం పాడారు. ఈ విధానం వల్ల ఎంతో మంది ప్రభుత్వ ఉద్యోగుల జీవితాలు అభద్రతలో ఉన్నాయి. డిసెంబర్ 2003లో నాటి ఎన్‌డీఏ ప్రభుత్వ ఆధ్వర్యంలో కార్యనిర్వాహక ఉత్తర్వుల రూపంలో ఉరిమిన ఉరుము, సెప్టెంబర్ 4, 2013న ప్రతిపక్ష బీజేపీ మద్దతుతో యూపీఏ ప్రభుత్వం తెచ్చిన పిఎఫ్ఆర్‌డిఏ చట్టంతో ఉద్యోగులపై పిడుగులా పడింది. కార్మికవర్గానికి ఎప్పుడూ వెన్నుదన్నుగానిలిచే అభ్యుదయ, వామపక్షవాదులు బిల్లును వ్యతిరేకించడంతో దశాబ్ద కాలం బిల్లు ఆగింది. తర్వాత 2013లో పాలక కాంగ్రెస్, ప్రతిపక్ష బీజేపీలు ఒక్కటై ఈ చట్టాన్ని చేశాయి. నూతన పెన్షన్ విధానం కొత్తగా ఉద్యోగంలో చేరిన ఉద్యోగులకు శాపంగా పరిణమించింది.



పి. సతీష్

జీవితకాలం పని చేసిన ఉద్యోగికి గ్రాట్యుటీ, ఫ్యామిలీ పెన్షన్, సర్వీస్ పెన్షన్ లాంటివి ఏమీరావు. ఉద్యోగి రిటైర్ అయ్యే నాటికి అతని అకౌంట్‌లో ఉన్న మొత్తంలో 60శాతం ఉద్యోగికి ఇచ్చి, మిగిలిన 40శాతం షేర్ మార్కెట్‌లో పెడతారు. షేర్ మార్కెట్‌లో లాభం వస్తే ఉద్యోగికి ఉపయోగం. నష్టం వస్తే ప్రభుత్వానికి ఎలాంటి సంబంధం లేదు. అసలు షేర్ మార్కెట్ ఎప్పుడు లాభాల్లో ఉంటుందో, ఎప్పుడు నష్టాల్లో ఉంటుందో ఎవ్వరూ చెప్పలేరు. కనీస పింఛను ప్రస్తావనే లేదు.

నూతన పింఛన్ పథకం(ఎన్‌పీఎస్) ఏప్రిల్ 1, 2010 నుండీ ఎల్‌ఐసిలో అమలవుతున్న విషయం అందరికీ తెలిసిందే. ఎన్‌పీఎస్ పథకాన్ని ఎల్‌ఐసి ఉద్యోగుల మీద ఏకపక్షంగా రుద్దిన వెంటనే, అఖిల భారత బీమా ఉద్యోగుల సంఘం తన నిరసనను సమ్మె రూపంలో తక్షణమే వెలిబుచ్చింది. బాధాకరమైన విషయం ఏమిటంటే ఏప్రిల్ 1, 2010 తరువాత ఎల్‌ఐసీలో చేరిన కొంతమంది ఉద్యోగులు మరణించారు. నూతన పింఛన్ పథకంలోని నిబంధనల ప్రకారం ఏడాదికి దివంగత ఉద్యోగి కుటుంబానికి లభించే కుటుంబ పెన్షన్ మొత్తం-సుమారు రూ.15,700. అనగా నెలకు సుమారు రూ.1300 మాత్రమే. ఒకవేళ దివంగత ఉద్యోగులు 1995 గ్యారెంటీ పింఛన్ పథకంలో (ఓపీఎస్) ఉండి ఉంటే వారి కుటుంబాలకు లభించే కుటుంబ పింఛను (కనీసం)రూ.15,000. అంటే, గ్యారంటీ పింఛను పథకానికి ఎన్‌పీఎస్ ద్వారా లభించే కుటుంబ పింఛన్‌కు తేడా కనీసం 10 రెట్లుఉంది. ఎన్‌పీఎస్ ద్వారా చెల్లించే కుటుంబ పింఛను మన రాష్ట్రంలో చెల్లించే సామాజిక పెన్షన్ కంటే తక్కువ. పైపెచ్చు, ఈ పింఛను మొత్తం స్థిరంగా ఉంటుంది, జీవితాంతం మారదు(డీఎలు కలవడం ఇతరా ఉండదు). ఇంత దుర్మార్గమైన పింఛను పథకం కాబట్టే, ఏఐఐఈఏ 2010 నుంచీ ఈ పథకాన్ని రద్దు చేయాలని పోరాడుతోంది. నూతన పింఛను పథకం రద్దు చేయాలని, ఈలోగా ఎన్‌పీఎస్ పథకంలో ఉన్న (ఏప్రిల్ 1, 2010 తరువాత ఉద్యోగంలో చేరిన) ఉద్యోగులకు యాజమాన్య వాటాను 10శాతం నుండి 14శాతం పెంచాలని ఏఐఐఈఏ ఏనాటి నుంచో డిమాండ్ చేస్తోంది. ఇతర రంగాల్లో ఇది అమలు చేస్తున్నారు. ఇంతవరకు, ఆ దిశగా ఎటువంటి అడుగులు పడలేదు. బోర్డు ఆమోదించినట్లు ఫ్యామిలీ పెన్షన్‌లో మార్పులు చేయకపోవడంతో మూడేండ్లుగా కుటుంబ పింఛనర్లు (దాదాపు 23,000 మంది పైబడి) నష్టపోయారు. దీన్ని దృష్టిలో పెట్టుకుని కుటుంబ పింఛను పథకంలో మార్పులు చేయాలని, నూతన పింఛను పథకాన్ని రద్దు చేయాలనే ప్రధాన డిమాండ్లతో అఖిల భారత బీమా పింఛనర్ల సంఘం ఆధ్వర్యంలో మార్చి 29న ఢిల్లీలో జంతర్ మంతర్‌లో చేసిన ధర్నా విజయవంతమైంది. అదే స్ఫూర్తితో భవిష్యత్‌లో మరిన్ని పోరాటాలు చేయాల్సిన అవసరం ఎంతైనా ఉన్నది.

కుల వివక్షను నిరసించిన 'మాలపిల్ల'

తెలుగులో న్యూ సినిమా మూవ్‌మెంట్ ఇటీవలి కాలంలో మొదలైందని కొందరు అపోహపడొచ్చు. కానీ, అది నిజం కాదు. తెలుగు చిత్రాలు ప్రారంభమైన తొలిదశలోనే గూడవల్లి రామబ్రహ్మం ఆ పనికి శ్రీకారం చుట్టాడు. 'భక్తప్రహ్లాద' వంటి పౌరాణికాలు ఒకవైపు నిర్మాణమవుతూ ఉంటే, జాతిని చైతన్యవరచడానికి మరోవైపు రామబ్రహ్మం కంకణం కట్టుకున్నాడు. అంటరానితనం అడుగంటాలని, కుల వ్యవస్థను కూకటివేళ్ళతో పెళ్ళగించి వేయాలని ఒక మహోన్నతమైన సంస్కరణ వాదంతో రూపొందించిన చిత్రం 'మాలపిల్ల!' బ్రాహ్మణాధిక్యత గల అలనాటి సమాజంలో మాలల దుస్థితి ఎలుగెత్తి చెప్పడమే కాకుండా, ఇతర కులాలవారు వారిని పెళ్ళాడి వారిని మనుషులుగా గుర్తించాలని కూడా ఆ చిత్రం సూచించింది. పైగా, మనుషులంతా ఒక్కటేనన్న సందేశాన్నిచ్చింది.



డాక్టర్ దేవరాజు మహారాజు

తెలుగులో వెలువడ్డ మొదటి సాంఘిక చిత్రం - 'ప్రేమ విజయం' అది 1936లో వెలువడింది. కాని, విజయవంతం కాలేదు. రెండు సంవత్సరాల తర్వాత 1938లో వచ్చిన 'మాలపిల్ల' సామాజిక సంస్కరణకు ఉద్దేశించి వెలువడింది. ఆ చిత్రం తెలుగువారినే కాకుండా తమిళులను కూడా విశేషంగా ఆకర్షించింది. అవి భారత స్వాతంత్ర్యం కోసం అహింసా పద్ధతిలో పోరాటాలు సాగుతున్న రోజులు. సహాయ నిరాకరణోద్యమం, సత్యాగ్రహం నిత్యజీవితంలో భాగమైన రోజులు. ఆ రోజుల్ని, ఆనాటి సమకాలీన సాంఘిక పరిస్థితుల్ని యథాతథంగా చిత్తశుద్ధితో విప్లవ స్ఫూర్తితో ఆ చలనచిత్రాన్ని చిత్రీకరించాడు - గుడవల్లి రామబ్రహ్మం. "లేరా లేరా నిద్దుర మానర హరిజన వీర కుమారా / మానవులే నిను మాల మాలయని దూరము చేసిరి కదా?" అనే పాటతో చిత్రం ప్రారంభమవుతుంది. కళ్యాణపురం అనే కుగ్రామంలో గాంధీజీ అభిమానులు సమావేశం ఏర్పాటు చేస్తారు. జనం తండోపతండాలుగా దానికి వెళుతుంటారు. అందులో హరిజనుడొకడు గొడుగు వేసుకుని వెళ్ళడం బ్రాహ్మణ పెద్దలకు నచ్చదు. పిలిచి, దుర్భాషలాడి చెప్పుతో కొడతారు. హరిజనుల్లో చలనం కలుగుతుంది. గాంధీజీ బోధనలతో ప్రభావితులై, బ్రాహ్మణాధికృతను సహించలేక - ఆలయ ప్రవేశాన్ని కోరుతున్న హరిజనుల్లో అసహనం పెల్లుబుకుతుంది. "పావనమౌనీ గుడిలో పాదము పెట్టగలనిమ్ము హరా / మహదేవ్, జై మహదేవ్, జై మహదేవ్" - అని ప్రార్థిస్తారు. తలుపులు తోసుకుని ఆలయంలోకి వెళ్ళడానికి ప్రయత్నిస్తారు.

> ఛాందస భావాలు గల సుందర రామశాస్త్రిగా డాక్టర్ గోవింద రాజుల సుబ్బారావు, కొడుకు నాగరాజుగా గాలి వెంకటేశ్వరరావు, మాలపిల్ల చంపాలతగా ఆనాటి అందాల తార కాంచనమాల నటించారు. బసవరాజు అప్పారావు గేయాల హక్కులన్నీ కొనేసి, గూడవల్లి రామబ్రహ్మం ఈ చిత్రంలో వాడుకున్నారు. "కొల్లాయి గట్టితే నేమి మా గాంధీ మూలడై తిరిగితేనేమి?" "నల్లవాడే గొల్ల పిల్లవాడే" వంటివే కాక, ఇంకా మిగతా పాటలన్నీ తాతాజీ - అంటే తాపీ ధర్మారావు రాసినవి. అంతే కాదు, చిత్రానికి సంభాషణలు సమకూర్చింది కూడా ఆయనే!

సనాతనవాది ఆలయ ధర్మకర్త మేడిచర్ల సుందరరామశాస్త్రికి విషయం తెలుస్తుంది. "మాలలు దేవాలయం అపవిత్రం చేస్తుంటే ఊరుకోవడమేనా ఛీ-బ్రాహ్మణులమై పుట్టి ఏం ప్రయోజనం?" - అని తన వాళ్ళను దూషిస్తాడు. "మీలో బ్రాహ్మణ రక్తం లేదూ?" అని ప్రశ్నిస్తాడు. సత్య దృష్టితో, దౌర్జన్యరహితంగా బ్రాహ్మణుల కళ్ళు తెరిపించాలని గాంధేయవాది చౌదరి హరిజనులకు సర్ది చెపుతుంటాడు. సమాధాన పరుస్తుంటాడు. కానీ, మరొక వైపు బ్రాహ్మణులు తమను తాము పొగడుకుంటూ ఉంటారు. "పికిలి పిట్ట పేడ పురుగు ఒకటే అవుతుందా? సింహం, చీమ ఒకటే అవుతాయా? - అని ప్రశ్నిస్తుంటారు. తమను తాము ఉన్నతంగా ఊహించుకుంటూ ఉంటారు. అంతే కాదు, పంచములు ఆదివాసులయ్యారనీ, వారే నేడు హరిజనులయ్యారని రేపు ఇంకా ఏం కాబోతారోనని రామశాస్త్రి హేళన చేస్తాడు. కిన్నెరలు, కింపురుషులు, బ్రహ్మరుషులు అవుతారేమోనని గేలి చేస్తాడు. అవసరమైతే బ్రాహ్మణులూ క్షాత్రం పూనగలరని హెచ్చరిస్తాడు. యుగయుగాలుగా తమదై ఉన్న ఈ తాత్త్విక సంపదను పరులకు ఎంత మాత్రమూ అంటగట్టబోమని స్పష్టం చేస్తాడు. అంతే కాదు, చెరువు నీళ్ళు హరిజనుల గూడేనికి పోకుండా కట్టుదిట్టం చేస్తాడు.

జీవుల గురించి, జీవుల ప్రత్యేకతల గూర్చి మొత్తానికి మొత్తంగా జీవ పరిణామం గురించి ప్రాథమిక అవగాహన లేనివారే సింహం, చీమ ఒకటి అవుతాయా? అని ప్రశ్నిస్తారు. కిన్నెరలు, కింపురుషులు వంటివారు నిజంగా ఉండరని అవన్నీ మనువాదుల కల్పనలని తెలుసుకోని వారు అజ్ఞానంగానే ప్రశ్నలు కురిపిస్తారు. ఏమైనా తోటి మనుషులకు నీళ్ళు అందకుండా చేయడం వంటటి మూర్ఖత్వం? అగ్రవర్ణాల ఆధిపత్యం కొనసాగుతున్న రోజుల్లో అలా జరిగింది గానీ, ఈ ఆధునిక యుగంలోనైతే అది శిక్ష విధించాల్సిన నేరం! ఇక్కడ గాంధీజీ గురించి, గాంధేయవాదుల గురించి కొన్ని విషయాలు చెప్పుకోవాలి. ఆ రోజుల్లో వారి తొలి ప్రాధాన్యత భారత స్వాతంత్ర్య పోరాటం. సమాజంలోని అన్ని వర్గాల వారిని, అన్ని వర్ణాల వారిని, అన్ని స్థాయిల వారిని సంఘటిత పరిచి, భిన్నమైన విధానాలు గలవారిని కలుపుకుంటూ, వారిని స్వాతంత్ర్య పోరాటంలో భాగస్వాములు చేయడమే ముఖ్యం - అని అనుకున్నారు. ఎవరి మత విశ్వాసాలు వారు ఉంచుకుంటూ స్వాతంత్ర్య సమరంలోకి కదిలి రావాలని గాంధీజీ పిలుపునిచ్చారు. అందుకే గాంధీయవాదులు అగ్రవర్ణాల ఆధిపత్యాన్ని ఎండగట్టలేక పోయారు. నిమ్న జాతుల వారి స్థాయి పెంచడానికి "దళితులు" అని సంభోదించారు. తప్పిస్తే, దానితో వారి బతుకుల్లో వెలుగులు నిండలేదు. గాంధీజీలో ఒక మనువాది ఉన్నాడు కాబట్టే, పలు సందర్భాల్లో బాహాటంగా బయటపడి దళితుల పక్షాన నిలబడలేక పోయాడు. ఇక సమాజంలో కొందరికి ఆలయ ప్రవేశమున్నప్పుడు తమకు కూడా ఆ అర్హత ఉండాలి కదా? అని దళితులు ఆలయ ప్రవేశం కోరుకున్నారు. ఇటీవలి కాలంలో శబరిమలైలోకి మహిళలు ప్రవేశించాలనుకున్నది కూడా అందుకే! మానవహక్కులు అందరికీ సమానంగా ఉండాలని చేసిన పోరాటాలు అవి! అంతే కానీ, దేవుడి మీద భక్తితో చేసిన పోరాటాలు కాదు - వైదికులు మానవ హక్కులకు విఘాతం కలిగించిన అనేక సంఘటనలు చరిత్రలో ఉన్నాయి. కరడు గట్టిన అగ్రవర్ణాల పెత్తనం, కొనసాగుతున్న సమయంలో గూడవల్లి రామబ్రహ్మం ఈ 'మాలపిల్ల' చలన చిత్రం తీయడమన్నది గొప్ప సంచలనం! అది కూడా తెలుగు చలన చిత్ర నిర్మాణ ప్రారంభదశలోనే తీయడం ఆశ్చర్యం కలిగించే విషయం. మనువాదుల ప్రభావంలో కొట్టుకుపోయిన దర్శక నిర్మాతలు, రచయితలు, కవులు సమాజాన్ని వెనక్కి నడిపించే చలన చిత్రాలు ఇప్పటికీ తీస్తున్నారు. మానవ హక్కుల్ని దెబ్బతీసే హింస, దౌర్జన్యాలు ఇప్పటికీ ప్రదర్శిస్తున్నారు. వీరంతా - 85ఏండ్ల క్రితమే మాలపిల్లను ఎంతో ధైర్యంగా చిత్రీకరించి ఘనవిజయం సాధించిన గూడవల్లి రామబ్రహ్మం నుంచి ఎంతో నేర్చుకోవాల్సి ఉంది! కనీసం తామెంత వెనకబడి ఉన్నామన్నది ఆత్మవిమర్శ చేసుకోవాలి.

> ఈ మాలపల్లి చిత్రానికి కథను సమకూర్చింది మరో గొప్ప రచయిత గుడిపాటి వెంకటాచలం. శ్రీశ్రీ మహాప్రస్థానానికి ముందుమాట రాసినవాడు. మైదానం దైవమిచ్చిన భార్య, ప్రేమలేఖలు, మ్యూజింగ్స్ వంటి ఎన్నో రచనలు చేసిన ఆయన, ఎన్నో వ్యంగ్య నాటికలు కూడా రాశాడు. 'హరిశ్చంద్ర' నాటికలో ఒక సీను ఉంటుంది - అందులో... భార్యను వేలం వేసి అమ్ముతున్న హరిశ్చంద్రునికి పిచ్చి పట్టిందని, ప్రజలంతా గుమిగూడి అతణ్ణి కట్టేసి తంతారు! ఈ ఒక్క దృశ్యంతో చలం ఆలోచనా ధోరణి ఏమిటో అర్థం చేసుకోవచ్చు.



సరే - మళ్ళీ నాటి 'మాలపల్లి' చలన చిత్రానికి సంబంధించిన విషయంలోకి వద్దాం! గాంధీ గారి మనుషులు ఒకవైపు హరిజనులకు నీరు సరఫరా చేస్తూ, మరోవైపు బ్రాహ్మణ వర్గానికి నచ్చజెప్పడానికి ప్రయత్నిస్తుంటారు. గాంధేయవాది అయిన చౌదరి హరిజనులను రెచ్చగొడుతున్నాడని అపార్థం చేసుకుంటారు - బ్రాహ్మణులు! అద్దెకు ఉంటున్న ఆయన్ని ఇల్లు ఖాళీ చేయించి, వీధిన పడేస్తారు. ఆయన ధైర్యం కోల్పోకుండా 'మాలలు మాత్రం మనుషులు కారా?' అనుకుని వెళ్ళి మాలగూడెంలో బస చేస్తాడు. అంతే కాదు, వారిని సంఘటిత పరుస్తాడు. బ్రాహ్మణవర్గం దిగి వచ్చేదాకా సమ్మెకట్టి - సహాయ నిరాకరణోద్యమం కొనసాగించాలని ఉద్బోధిస్తాడు. కార్యకర్తలంతా కలిసి 'కూలీలందరూ ఏకం కావాలిరా' అని సమ్మె పాట పాడుతారు.

ఆలయ ధర్మకర్త సుందర రామశాస్త్రి కొడుకు ఉన్నత విద్యా భ్యాసం చేసి వస్తాడు. గాంధీయిజం వంటబట్టించుకుంటాడు. అందుకు సంబంధించిన సమావేశాలకు వెళుతుంటాడు. అభ్యుదయ వాదిగా మారతాడు. సాయంత్రాలు ఆ ఊళ్ళో ఉన్న కొండపైకి వెళుతుంటాడు. అలా ఒక రోజు కొండ మీద తిరుగుతుండగా అక్కడ ఒక అమ్మాయిని చూస్తాడు. ప్రేమలో పడతాడు. ఆమె పేరు చంపాలత అనీ, ఆమె ఒక మాలపిల్ల అని తెలుసుకుంటాడు. తన చాదస్తపు తండ్రి లాగా అసహ్యించుకోకుండా హృదయ పూర్వకంగా అంగీకరిస్తాడు. ఆమెతో దేశాంతరం పారిపోయి పెళ్ళి చేసుకుని, మంచి ఉద్యోగంలో స్థిరపడతాడు. పనికిరాని సంప్రదాయాలను దరిచేరనీయకుండా ఆధునికంగా జీవిస్తుంటాడు. తన కొడుకు ఆ విధంగా చేయగలడనీ సుందర రామశాస్త్రి ఏ మాత్రం ఊహించడు. ఆయనా, ఆయన భార్యా కృంగిపోతారు. దేశంలో త్వరితగతిన చోటు చేసుకుంటున్న మార్పులు వారు జీర్ణించుకోలేరు. కానీ, క్రమ క్రమంగా వారిలో కూడా మార్పు వస్తుంది. చిత్రాంతంలో హరిజనులు కూడా మనుషులేనని సుందర రామశాస్త్రి గుర్తించి వారి ఆలయ ప్రవేశానికి ముహూర్తం నిశ్చయిస్తాడు. ఆ వార్త ఆనాటి తెలుగు ప్రముఖ దినపత్రిక 'ఆంధ్రపత్రిక'లో చదివిన కొడుకు నాగరాజు, కోడలు చంపాలత - ఆ ముహూర్తానికి కలకత్తా నుండి తిరిగివస్తారు.

ఛాందస భావాలు గల సుందర రామశాస్త్రిగా డాక్టర్ గోవింద రాజుల సుబ్బారావు, కొడుకు నాగరాజుగా గాలి వెంకటేశ్వరరావు, మాలపిల్ల చంపాలతగా ఆనాటి అందాల తార కాంచనమాల నటించారు. బసవరాజు అప్పారావు గేయాల హక్కులన్నీ కొనేసి, గూడవల్లి రామబ్రహ్మం ఈ చిత్రంలో వాడుకున్నారు. "కొల్లాయి గట్టితే నేమి మా గాంధీ మూలడై తిరిగితేనేమి?" "నల్లవాడే గొల్ల పిల్లవాడే" వంటివే కాక, ఇంకా మిగతా పాటలన్నీ తాతాజీ - అంటే తాపీ ధర్మారావు రాసినవి. అంతే కాదు, చిత్రానికి సంభాషణలు సమకూర్చింది కూడా ఆయనే! తాపీవారి పేరు వినగానే చాలా మందికి 'దేవాలయం మీద బూతుబొమ్మలెందుకు?' 'ఇనుప కచ్చడాలు' 'పెళ్లి-దాని పుట్టు పూర్వోత్తరాలు' వంటి ఆయన పుస్తకాలు గుర్తుకు వస్తాయి. ఆ పుస్తకాల పేర్లు తెలియని ఈ కాలపు యువతీ యువకులు ఎవరైనా ఉంటే, సంపాదించి చదవడం మేలు. ఇకపోతే ఈ మాలపల్లి చిత్రానికి కథను సమకూర్చింది మరో గొప్ప రచయిత గుడిపాటి వెంకటాచలం. శ్రీశ్రీ మహాప్రస్థానానికి ముందుమాట రాసినవాడు. మైదానం దైవమిచ్చిన భార్య, ప్రేమలేఖలు, మ్యూజింగ్స్ వంటి ఎన్నో రచనలు చేసిన ఆయన, ఎన్నో వ్యంగ్య నాటికలు కూడా రాశాడు. 'హరిశ్చంద్ర' నాటికలో ఒక సీను ఉంటుంది - అందులో... భార్యను వేలం వేసి అమ్ముతున్న హరిశ్చంద్రునికి పిచ్చి పట్టిందని, ప్రజలంతా గుమిగూడి అతణ్ణి కట్టేసి తంతారు! ఈ ఒక్క దృశ్యంతో చలం ఆలోచనా ధోరణి ఏమిటో అర్థం చేసుకోవచ్చు.

చల్లపల్లి మహారాజా, గూడవల్లి రామబ్రహ్మం, యార్లగడ్డ శివరామ ప్రసాద్‌లు నిర్మాతలుగా కాగా, భీమవరపు నరసింహారావు సంగీతం సమకూర్చారు. ఆనాటి పాత పాటలు చూడాలన్న అభిరుచి ఉన్నవారు యూట్యూబ్‌లో చూడొచ్చు. నాటి సామాజిక పరిస్థితులు, వాతావరణం కనిపిస్తాయి. సంకల్పం-బలంగా ఉంటే, ఎవరైనా ఎంతటి పనైనా చెయ్యొచ్చు. అందుకు గూడవల్లి రామబ్రహ్మమే గొప్ప ఉదాహరణ! ఆయన ఆనాటి ప్రసిద్ధ పత్రికా రచయిత మాత్రమే. జమీందారో లేక ఫిల్మ్ ప్రొడక్షన్‌లో పెద్ద అనుభవమున్న వాడోకాదు. అయినా, ఆనాటి సమాజాన్ని తన శక్తిమేరకు సంస్కరించాలని 'మాలపిల్ల' 'రైతుబిడ్డ' వంటి ప్రయోజనకరమైన చలన చిత్రాల్ని రూపొందించాడు. ఆ ప్రయత్నం తక్కువదా?

- వ్యాసకర్త: కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు విజేత, జీవశాస్త్రవేత్త.

ఓబీసీల పట్ల కేంద్రం నిర్లక్ష్యం

> వాస్తవానికి రిజర్వేషన్ల ద్వారా లభించే ఉపాధి రోజురోజుకు తగ్గిపోతుంది అందుబాటులో ఉన్న మొత్తం ఉద్యోగాలలో 10 శాతం కూడా రిజర్వేషన్లు అమలుపరిచే స్థితిలో లేదు. 29 రాష్ట్రాలలో కేవలం ఎనిమిది రాష్ట్రాలు మాత్రమే. ఈ ఓబీసీ రిజర్వేషన్ల అంశాన్ని పాటిస్తున్నవి. అనేక కేంద్ర ప్రభుత్వ రంగాలలో ఓబీసీ రిజర్వేషన్ల ద్వారా ఎంపికలు, ప్రమోషన్లు అస్తవ్యస్తంగా ఉన్నవి. వీటన్నిటిపై సమగ్ర విధానాన్ని ప్రకటించకుండా, ప్రయత్నాలు చేయకుండా రాహుల్ గాంధీ మాటలను మాత్రమే ప్రస్తుతిస్తే సమస్యలు ఎలా తీరుతాయి?


కాదేది కవితకనర్హం అన్న చందాన రాజకీయ అవధానాలకు అధికార పార్టీల నేతలే తెరతీస్తున్నారు! రాహుల్ గాంధీ 2019లో మోడీ అనే పదాన్ని ఉపయోగిస్తూ ఒక ఎన్నికల సభలో చేసిన వ్యాఖ్యలను ఆసరాగా చేసుకుని అవి దేశం మొత్తం ఓబీసీ కులాలను కించపరిచేవిగా ఉన్నాయని, దేశవ్యాప్త నిరసన కార్యక్రమాలకు పిలుపునిచ్చింది. అతిపెద్ద జాతీయ పార్టీ. దీనిని తెలంగాణ భాషలో 'బజ్జాతీకి' ఎత్తుకోవడం అంటారు అనగా దొంగే దొంగ దొంగ... అని అరవడం అన్నమాట. రాహుల్ గాంధీ వ్యాఖ్యల నేపథ్యం ఆనాటి పరిస్థితులు అవన్నీ ఒక ఎత్తు, వాటిపైన రాజకీయ పార్టీగా ప్రత్యర్థులు దాడి చేయడం షరా మామూలే, అయితే నాలుగేళ్ల తర్వాత గుజరాత్ లోని ఓ కోర్టు రాహుల్ గాంధీని క్రిమినల్ డెఫమేషన్ కేసులో దోషిగా నిర్ధారించడం.. సంబంధించిన విషయాలన్నీ న్యాయ వ్యవస్థ పరిధిలోనివి. కోర్టు తీర్పుని ఇవ్వడం, ఆ వెంటనే బెయిల్ తీసుకోవడం, ఆ తర్వాత స్పీకర్ రాహుల్ గాంధీని పార్లమెంటు సభ్యత్వానికి అనర్హుని చేయడం కూడా న్యాయ ప్రక్రియలోని భాగాలే.



జి. తిరుపతయ్య
9951300016

అయితే ఉన్నట్లుండి ఈ ఓబిసికి సంబంధించిన చర్చ ఎందుకు ముందుకు తెచ్చారన్నది ఆసక్తి గొలిపే అంశం. మోడీ అనే పేరుకు సంబంధించిన వ్యాఖ్యలపై మాత్రమే ఆనాడు కేసు వేయడం జరిగింది. ఉన్నఫలంగా సదరు వ్యాఖ్యలను ఓబీసీ కులానికి ఆపాదించడం, వాటిని కులపరమైన దూషణగా భావించడం, దానిని రాజకీయ ప్రయోజనాలకు వాడుకో జూస్తున్న తీరు మాత్రం జుగుప్సాకరం కాక ఏమవుతుంది? అంతటితో ఆగకుండా ఏప్రిల్ 6 నుండి 14 వరకు దేశవ్యాప్తంగా లక్ష గ్రామాలకు, కోటి కుటుంబాలకు చేరి ఓబీసీలపై రాహుల్ గాంధీ చేసిన ఆరోపణలను అందరికీ తెలియపరిచే పెద్ద క్యాంపెయిన్ నిర్వహించాలని బీజేపీ అధ్యక్షులు జేపీ నడ్డా, ఓబీసీ మోర్చా అధ్యక్షులు లక్ష్మణ్ పిలుపునిచ్చారు. రాహుల్ గాంధీ వ్యాఖ్యలు నిజంగా కులపరమైన దూషణో కాదో ఒక విషయమైతే, నాలుగేళ్ల తర్వాత వాటి గురించి ఇలా ప్రస్తావించడం దొంగలు పడిన ఆరు నెలలకు కుక్కలు మొరిగిన సామెతను గుర్తుకు తెస్తుంది! సాక్షాత్తూ మహాత్మా గాంధీని కులం పేరుతో 'బనియా...' అంటూ మంత్రిపదవిలో ఉన్నవారు అన్నప్పుడు ఏ నిప్పూ రాజుకోలేదు! రాజ్యాంగబద్ధమైన పాలన చేసి కుల రహిత సమాజాన్ని నిర్మించండి బాబు అని అంబేద్కర్ రాజ్యాంగాన్ని మనకు సమర్పిస్తే, కులపరమైన విభజన ద్వారానే ఓట్లు రాబట్టుకునే ప్రజాస్వామ్యాన్ని నిర్మించడంలో నేతలు ఆరితేరుతున్నారు! నిజంగా లక్ష గ్రామాలకు వెళ్లి ఓబిసిల ప్రస్తావన చేస్తే ప్రజలు తిరగబడి కొట్టే ప్రమాదం ఉన్నది సుమా! ఎందుకంటే ఓబీసీల సమస్యలు అత్యంత నిర్లక్ష్యానికి గురి కాబడుతున్నవి.

ప్రజా బహుళ్యంలోకి వెళ్లే ముందు జనాభా లెక్కల సేకరణలో ఓబీసీల కుల గణన ఎందుకు చేపట్టడం లేదో సదరు పెద్దలు సమాధానం చెప్పాలి? మొత్తం జనాభాలో మూడో వంతుగా ఉన్న ఓబీసీల కుల గణన చేస్తే అసలు బండారం బయటపడుతుంది! కులాల వారిగా ఈ దేశంలో ఎంతెంత వెనుకబాటుతనం ఉన్నది, అది ఏయే ప్రాంతాలలో ఎక్కువగా ఉన్నది అనే వాస్తవాలు బయటికి వస్తే రాజకీయపరమైన తాకిడి పెరిగే అవకాశం ఉన్నది. అందుచేత కేంద్ర పెద్దలు నిమ్మకు నీరెత్తినట్టుగా వ్యవహరిస్తూ అనేక రాష్ట్ర ప్రభుత్వాలు కోరినప్పటికీ ఓబిసి కుల గణన చేయడానికి సిద్ధంగా లేరు. సంక్షేమ పథకాలను పూర్తిగా తీసివేయాలనుకుంటున్నారు కాబట్టి ఇలాంటి కులగణన చేపడితే కష్టమవుతుందని కేంద్రం భావించి ఉండవచ్చు. అంతేకాకుండా లబ్ధిదారుల ఎంపికలోను ఇబ్బందులు ఏర్పడతాయని భావించి ఉండవచ్చు. కానీ దేశ జనాభాకు సంబంధించిన సమగ్ర సమాచారం ప్రభుత్వం దగ్గరనే కాకుండా ప్రజల దగ్గర కూడా ఉండాల్సిన అవసరం ఉంది. అయినప్పటికీ పరిపాలనాపరంగా ఎదుర్కొనే సత్తా లేనందు వల్లే ఈ కుల గణనకు వెనకడుగు వేస్తున్న సంకేతాలు స్పష్టంగా తెలుస్తున్నాయి. ఇలాంటి చిత్తశుద్ధి లేకుండా కేవలం రాహుల్ గాంధీ మిమ్ములను కులం పేరుతో అవమానపరిచాడు అని చెప్పడానికి కోటి కుటుంబాలను కలవబోతున్నారా? ఓబీసీల వెనుకబాటుకు కారణం రాహుల్ గాంధీ దూషణలు కాదు, అనాదిగా నిర్ణీతమైన వృత్తులకు మాత్రమే పరిమితం చేసి, అనేక వృత్తులను నిషేధించడం తద్వారా ఏర్పడిన, నెలకొన్న అసమానతల తగ్గింపును ప్రభుత్వాలు ఏమాత్రం పట్టించుకోకపోవడం శ్రద్ధ పెట్టకపోవడం.



వాస్తవానికి రిజర్వేషన్ల ద్వారా లభించే ఉపాధి రోజురోజుకు తగ్గిపోతుంది అందుబాటులో ఉన్న మొత్తం ఉద్యోగాలలో 10 శాతం కూడా రిజర్వేషన్లు అమలుపరిచే స్థితిలో లేదు. 29 రాష్ట్రాలలో కేవలం ఎనిమిది రాష్ట్రాలు మాత్రమే. ఈ ఓబీసీ రిజర్వేషన్ల అంశాన్ని పాటిస్తున్నవి. అనేక కేంద్ర ప్రభుత్వ రంగాలలో ఓబీసీ రిజర్వేషన్ల ద్వారా ఎంపికలు, ప్రమోషన్లు అస్తవ్యస్తంగా ఉన్నవి. వీటన్నిటిపై సమగ్ర విధానాన్ని ప్రకటించకుండా, ప్రయత్నాలు చేయకుండా రాహుల్ గాంధీ మాటలను మాత్రమే ప్రస్తుతిస్తే సమస్యలు ఎలా తీరుతాయి? దేశం మొత్తం మీద మూడు వేల పైచీలుకు ఉప కులాలు ఓబీసీ వర్గంలో ఉన్నాయని అనేక రిపోర్టుల ద్వారా తెలుస్తుంది. ఓ డజనుకు పైగా ఓ బి సి కులాల, అధికారికంగా డిక్లేర్ చేయబడిన, వృత్తి "భిక్షాటన". భిక్షాటనకు వెళ్లిన వారిని ప్రజలు ఎలా చూస్తారో చెప్పనవసరం లేదు. ఇవన్నీ ఒక్కో రాష్ట్రంలో ఒక విధంగా ఉన్నవి. ఓబీసీ కమిషన్‌కు రాజ్యాంగ బద్ధత కల్పించిన తర్వాత ఒరిగిన లాభమేంటో, ఎంత మందికి ఉపశమనం కలిగిందో గ్రామాలు తిరిగినప్పుడు వివరిస్తే బాగుంటుంది. మహాత్మా గాంధీ జాతీయ ఉపాధిలో ఎక్కువ మంది ఓబిసిలే. మరి ఈ స్కీమ్ కింద నిధులు దాదాపు ముప్పై శాతం తగ్గించబడ్డాయి. ఇది వారికి అపకారం కాదా? వ్యవసాయ కార్మికుల్లో అత్యధికులు ఓబిసి లే. వీరి ఉపాధి, భద్రత కోసం జాతీయ స్థాయిలో సమగ్ర ప్రణాళిక లేదు. చేతి వృత్తుల కుటుంబాలన్నీ ఓబిసిలే. ఇప్పుడు గ్రామ స్వరాజ్యం గంగల కలిసి చేతి వృత్తుల చేతులిరిగిన మాట వాస్తవం కాదా? ఇళ్ళ పనివారల్లోనూ అత్యధికులు ఓబిసిలే ఉంటారు. ఎందుకంటే సో కాల్డ్ ఇంటి యజమానులు (ఒబిసిలతో సహా) దళితులను ముస్లింలను ఇళ్ళల్లో పనికి తీసుకోవటానికి సుముఖత చూపరని అనేక రిపోర్టులున్నవి. ఎలాగూ నడ్డా, లక్ష్మణ్ కోటి కుటుంబాలను కలుస్తారు కాబట్టి పనిలో పనిగా ఈ సమస్యలకు పరిష్కారాన్ని కూడా వెతకాలి. అలా కాకుండా, అప్పనంగా పోగైన ఎన్నికల బాండ్ల డబ్బుందిగదా అని కేవలం రాహుల్ వ్యాఖ్యల ప్రచారానికి పరిమితమైతే ఎవ్వరూ హర్షించరు. చివరకు మహిళా బిల్లునెలా మూలకు పడేశారు గనక చట్టసభల్లో ఓబిసిలకేమైనా మేలు చేస్తారేమో చెప్పాలి.

మితవాద ధోరణికి బాగా సహకరించి, రెచ్చగొడితే పరమత అసహనంతో తెగబడి జైలు పాలయ్యే భారీ సైన్యం ఈ ఓబిసిలు. అత్యంత పెద్ద ఓటు బ్యాంకుగా ఉన్న ఓబీసీలను మచ్చిక జేసుకోవడం ఈరోజు ప్రధాన పార్టీకి అవసరం. అందుచేత నాలుగేళ్ల కింది అంశాన్ని, అందులో ఏ రకమైన బలం లేక పోయినా, దానిద్వారా కులం పేరుతో అందరినీ కలిపి కూడగట్టాలనే కుటిల ప్రయత్నమే ఇది. మోడీ అనే సర్ నేమ్ ఉన్న కులం వేల కులాలలో ఒకటి మాత్రమే తప్ప, మొత్తం ఓబీసీలకు అది ప్రాతినిధ్యం వహించదనే చిన్న సత్యాన్ని ఎలా మిస్సయ్యారు పాపం?!. తెలిసి కూడా క్యాంపెయిన్ బాట దిగుతున్నారు అంటే దురుద్దేశం స్పష్టంగా కనిపించడం లేదు? ప్రాంతీయ, కుల, మత, అతి జాతీయ వాదాలన్నీ అభద్రతా, ఆధిపత్య భావజాలపు రుగ్మతలు. ఇందులో బలయ్యేది మాత్రం దీనిని ప్రేరేపించిన వాళ్ళు కాదు అమాయకంగా సహకరించిన వాళ్లు.

జుట్టును పెంచే ఆహారం

మారుతున్న జీవనశైలి, ఆహారపు అలవాట్లు మన ఆరోగ్యంపై తీవ్ర ప్రభావాన్ని చూపుతాయి. శరీరంలో ఏ హానికరమైన మార్పు జరిగినా ముందుగా ప్రభావితమయ్యేవి జుట్టు, చర్మమే. ముఖ్యంగా జుట్టు విషయానికొస్తే.. పొడవైన, అందమైన జుట్టును కోరుకోనివారుండరు. కానీ ఇటీవల చాలామంది జుట్టు సమస్యలతో సతమతం అవుతున్నారు. చుండ్రు, జుట్టు రాలిపోవడం, జుట్టు బలహీనంగా ఉండటం వంటి సమస్యలతో ఇబ్బందులు పడుతుంటారు. అయితే దీనికి అనేక కారణాలు ఉన్నాయి. కాలుష్యం ఒక కారణమైతే పౌష్టికాహార లోపం మరో కీలక కారణం. కాబట్టి మీ జుట్టు ఆరోగ్యంగా, బలంగా ఉండాలంటే తినే ఆహారంలో పోషకాలు ఉండడం తప్పనిసరి. ఆరోగ్యకరమైన ఆహారం తీసుకోవడం వల్ల జుట్టు రాలడం, జుట్టు పాలిపోవడం వంటి సమస్యల నుంచి ఉపశమనం పొందవచ్చు. ఇంకా అనేక రకాల ఆరోగ్యప్రయోజనాలు పొందవచ్చు. మరి జుట్టు బలంగా, రాలిపోకుండా ఉండాలంటే తీసుకోవలసిన ఆహారాలేమిటో తెలుసుకుందాం..

- మొలకెత్తిన గింజల్లో... మోరంగడ్డలో ఉండే బీటా కెరోటిన్ అనే యాంటీ ఆక్సిడెంట్ మూలకం సెబమ్ ఉత్పత్తిని తగ్గించడంలో సహాయపడుతుంది. ఇది శరీరం ఆరోగ్యంగా ఉంచటంతో పాటు.. జుట్టుకు కూడా మేలు చేస్తుంది.
- పొద్దుతిరుగుడు గింజల్లో విటమిన్ సి పుష్కలంగా ఉంటుంది. ఇది రక్తాన్ని ప్రసరణ సక్రమంగా జరిగేలా చూస్తుంది. అలాగే ఈ గింజలు జుట్టు పొడవుగా, సిల్కీగా ఉండటానికి సహాయపడుతాయి.
- పాలకూరలో అనేక విటమిన్లు, ఖనిజాలు ఉంటాయి. మన రెగ్యులర్ డైట్‌లో పాలకూర తింటే జుట్టుకు చాలా ఉపయోగం. పాలకూరలో విటమిన్ సి, ఫోలేట్, ఐరన్, బీటా కెరోటిన్ పుష్కలంగా ఉంటాయి. ఇవి జుట్టును ఆరోగ్యంగా ఉంచడంలో సహాయపడతాయి.



- క్యాప్సికమ్‌లో పుష్కలంగా ఉండే విటమిన్ సి రక్త ప్రసరణను పెంచడంలో సహాయపడుతుంది. ఇదే కాకుండా శరీరంలో ఐరన్ మొత్తాన్ని పెంచి జుట్టు సమస్యలను నివారిస్తుంది.
- సాల్మన్ చేపలో ఒమేగా -3 కొవ్వు ఆమ్లాలు పుష్కలంగా ఉన్నాయి. సాల్మన్ చేప జుట్టుకు ఎంతో మేలు చేస్తుంది. అంతేకాకుండా శరీరాన్ని ఆరోగ్యంగా ఉంచడంలో సహాయపడుతుంది. ఒమేగా 3 ఫ్యాటీ యాసిడ్స్ జుట్టుకు మంచి పోషకాలు అందిస్తుంది. క్రమం తప్పకుండా సాల్మన్ చేప తింటే జుట్టు రాలడం తగ్గుతుంది.
- గ్రీక్ పెరుగు కూడా జుట్టుకు చాలా మేలు చేస్తుంది. ఇది మీ జుట్టు ఆరోగ్యంగా ఉండటానికి సహాయపడుతుంది. గ్రీక్ పెరుగులో ఉండే విటమిన్ బి 5 జుట్టు రాలడాన్ని తగ్గిస్తుంది.
- జామలో అధికస్థాయిలో విటమిన్ సి ఉంటుంది. ఇది జుట్టు పెరుగుదలకు ఉపకరిస్తుంది. జామను హెయిర్ మాస్క్‌గా కూడా ఉపయోగించవచ్చు. జామ ఆకులను పేస్ట్‌గా చేసి హెయిర్ మాస్క్‌గా అప్లై చేస్తే జుట్టుకు చాలా మంచిది.



సౌందర్య 'కోమల'ం

ఫైనల్ ఇయర్ పరీక్ష రాసి ఇంట్లోకి అడుగు పెట్టింది కోమల. తల్లి ఎదురుగా వచ్చి "నువ్వు అదృష్ట వంతురాలివి, మంచి సంబంధం వచ్చింది. వాళ్ళకు నువ్వు నచ్చావంట' అని సంబరంగ చెప్పింది. "అమ్మా నీకు తెలుసు కదా నాకు డాన్స్, యాక్టింగ్ అంటే ఇష్టమని". "తెలుసు, కానీ పెండ్లి అనేది ఒక ముఖ్యమైన ఘట్టం జీవితంలో! అందులో మంచి సంబంధం" అన్నాడు తండ్రి. అలా కోమల పెండ్లి జరిగిపోయింది. కన్నవారిని, పుట్టిన దేశాన్ని విడిచి ఇరాన్ వెళ్ళిపోయింది. అయితే కార్యదీక్ష ఉన్నవారు ఎక్కడయినా ఊరికే కుర్చోరు కదా! అక్కడ ఉన్న ఆరేండ్ల కాలంలో ఆసక్తి, అభిరుచితో సరదాగా కొన్ని సౌందర్య చికిత్స కోర్సులను నేర్చుకుంది. అదే తర్వాత తన జీవితానికి ఆలంబన అవుతుందని అస్సలు ఊహించలేదు. ఆ వివరాలేంటో మనమూ తెలుసుకుందాం...

జీవితంలో జరిగిన కొన్ని విషాద సంఘటనల వల్ల పిల్లలని తీసుకుని తిరిగి స్వదేశానికి వచ్చేశారు. రోమ్ ఒక్క రోజులోనే కట్ట లేదు అన్నట్లుగా కోమల తన జీవిత ప్రయాణంలో ఎన్నో ఆటుపోట్లను ఎదుర్కొన్నారు. చివరికి లక్ష్యాన్ని చేరుకున్నారు. అయితే జీవితంలో కొన్ని చేదు అనుభవాలని చూసాక ఒక నిర్వేదమైన పరిస్థితి. అలాంటి సమయంలో ఒక రోజు కోమలను కలవడానికి వచ్చిన స్నేహితురాలు ఆమెని చూసి ఆశ్చర్య పోయింది. "ఏంటి కోమలా ఇలా అయిపోయావు. ఎంత హుషారుగా ఉండే దానివి, అయినా ఇలా ఒంటరిగా కూర్చుంటే ఎలా..? ఏదో ఒక పనిలో మమేకమవ్వాలి" అంటూ బ్యూటీ కోర్స్ చేయడానికి పునాది వేసింది. అలా తన స్నేహితురాలి సహయంతో బ్యూటీ కోర్స్ చేసి ముప్పై ఏండ్లుగా ఆ రంగంలోనే స్థిరపడింది. ముఖ్యంగా ఎలక్ట్రోలిసిస్, హెయిర్ కేర్ మీద దృష్టి సారించి దానిలో పట్టు కోసం పన్నెండు కోర్సులు చేశారు.

సొంత ఉత్పత్తులతో...

తన దగ్గర వచ్చే క్లయింట్ల సమస్యలకు పరిష్కారం కనుక్కోవాలని తనదైన సొంత హెర్బల్ కేర్ ప్రోడక్ట్‌కి శ్రీకారం చుట్టింది. అయితే తను నడిచింది పూలబాట కాదు. మొదట్లో చాలా అవరోధాలు ఎదురైంది. చిన్నతనం నుంచి తనకెంతో ఇష్టమయిన నాట్యాన్ని, నటనను దూరం పెట్టారు. నేర్చు కున్న సౌందర్య పోషణలో మెళుకువలను శాస్త్రీయంగా అభ్యసించారు. "ఆరోగ్యానికీ, అందానికి విడదీయరాని బంధం ఉంది. మనం ఎంత ఆరోగ్యంగా ఉంటామో మన శరీరం కూడా అంతే అందంగా మెరుస్తూ కనిపిస్తుందనడంలో ఎటువంటి సందేహం లేదు. ప్రతీ స్త్రీ అందంగా కనిపించాలనే ఆరాట పడుతుంది. అది సహజ స్వభావం. చాలా మంది చూడటానికి చాలా సామాన్యంగా ఉంటారు. అలాంటి వారు కొద్దిపాటి జాగ్రత్తలు పాటించి మెరుగులు దిద్దికుంటే వారి అందం మరింత అనుమడిస్తుంది. అలాంటి వారి కోసమే హెయిర్ కేర్ బ్రాండ్ వెనికా హెర్బల్స్ స్థాపించి జుట్టు, చర్మ సంరక్షణ ఉత్పత్తులను అందిస్తున్నాను" అన్నారు కోమల.

ఎంతో మందికి జీవితాన్ని ఇస్తుంది

కలలు అందరూ కంటారు. అయితే అవి సాకారం చేసుకోవడానికి పట్టుదల, కృషి చాలా ముఖ్యం. "మీరు వ్యాపారం ఎందుకు చేస్తున్నారు" అంటూ చాలా మంది అడుగుతుంటారు. వారందరికీ ఆమె చెప్పే సమాధానం ఒక్కటే "ఇది నాకు అత్యంత ఇష్టమైన పని. ఇది నా కల" అంటారు. అలాగే "వ్యాపారంలో చాలా సవాళ్లు ఉంటాయి, డీలా పడిపోకూడదు. నా సంస్థ ఎప్పుడూ మంచి ఆదాయాన్ని ఇచ్చేదే. ఎంతో మందికి జీవితాన్ని ఇస్తుంది. నాకున్న లక్ష్యం ముందు మిగతా సమస్యలన్నీ చిన్నవిగా అనిపిస్తాయి" అంటున్నారు ఆమె. ఆమెకు తన కుటుంబం చాలా మద్దత్తుగా నిలబడింది. అలాగే భర్త, పిల్లలు కూడా ఎంతో ప్రోత్సహిస్తూ తనలో ఎంతో ఆత్మస్థైర్యాన్ని నింపారంటున్నారు.

రెండు బ్రాంచ్‌లు...

తొలి నాళ్లలో హైదరాబాద్‌లో ఒక పర్షియన్ కాస్మోటాలజిస్ట్‌ను దగ్గర విద్యుద్విశ్లేషణ, ఊబకాయం చికిత్సలు, అధునాతన జుట్టు, చర్మ చికిత్సలో కోర్సులను నేర్చుకుంది. అప్పుడు సొంతంగా ఖూబ్ సూరత్ అనే బ్యూటీ పార్లర్‌ని పెట్టి సమర్థవంతంగా నిర్వహించుకుంటూ వచ్చింది. తన సొంత అవుట్‌లెట్‌తో ప్రయోగాలు చేస్తూ "ఖూబ్ సూరత్ ఒబేసిటీ ఎలక్ట్రోలిసిస్ బ్యూటీ క్లినిక్" రెండో బ్రాంచ్‌ని కూడా ప్రారంభించారు. కోమల ఇద్దరు కొడుకులు ప్రస్తుతం మంచి ఉద్యోగాల్లో స్థిరపడ్డారు. కెనడాలో ఉంటున్న తన పెద్ద కొడుకు వద్దకు అనేక సార్లు వెళ్లారు. దాంతో విదేశీ పార్లర్లలో ఉండే మెళకువలు, ఉత్పత్తుల గురించి తెలుసుకున్నారు. ఆయుర్వేదంతో పాటు వివిధ నైపుణ్యాలలో శిక్షణ పొందిన ఆమె అనుభవం, పరిష్కారాలు క్లయింట్లకు బాగా నచ్చాయి.

కష్టాలకు కుంగిపోకుండా

"జీవితంలో ఏదో చేయాలి, అనే తపన ఉన్న అందరూ తమకంటూ ఒక అభిరుచిని పెంపొందించుకోవాలి. ఎప్పుడూ నిరాశ నిస్పృహకు లోను కాకుండా ఆత్మ నిబ్బరంతో, ధైర్యంగా కష్టనష్టాలకు ఓర్చుకుంటూ ముందుకు సాగాలి" అంటారు ఆమె. అలాగే తనవంతు సాయంగా సమాజానికి తాను చేయగలగిన సహాయాన్ని అందిస్తానని చెప్పడంతో కోమలలో మానవత్వం స్పష్టంగా కనిపిస్తుంది. కష్టాలకు కుంగిపోకుండా ధైర్యంగా నిలబడి పట్టుదలతో శ్రమించే విజయం మనదే అని కోమల నిరూపించారు. ఎందరికో ఆదర్శంగా నిలిచారు.



మహిళలకే ప్రాధాన్యం

అంతటితో ఆగక ఇంకా ఏదో సాధించాలనే తపనతో ల్యాండ్‌మార్క్ ఫోరమ్ వారి వ్యక్తిగత అభివృద్ధి కోర్సు ఆమెను వ్యాపారాన్ని ప్రారంభించేలా ప్రేరేపించింది. 2015లో వెనికా హెర్బల్స్‌ను ప్రారంభించాలని నిర్ణయించుకున్నారు. ఇందులో వీలైనంత ఎక్కువ మంది మహిళలను నియమించు కోవాలని భావించారు. తద్వారా కొంత మందికైనా ఉపాధి కల్పించవచ్చని ఆమె కోరిక. అలా రూ. 1 లక్ష ప్రారంభ పెట్టుబడితో దాదాపు 11 రకాల ఆయుర్వేద ఉత్పత్తులను అభివృద్ధి చేసి మార్కెట్ చేశారు. అంతే కాదు ఇప్పుడు D2C బ్రాండ్‌గా వెనికా హెర్బల్స్ తన వెబ్‌సైట్, అమెజాన్ వంటి ప్లాట్‌ఫారమ్‌ల ద్వారా హెయిర్ ఆయిల్, హెయిర్ ప్యాక్, హెన్నా, ప్యూర్ షికాకాయ్, ప్యూర్ రీతా, హెయిర్ షాంపూ, ఫేస్ వాష్, ఫేస్ ప్యాక్ వంటి FSSAI సర్టిఫైడ్ ఉత్పత్తులను చేస్తున్నారు. ప్రస్తుతం రూ.15 లక్షల వార్షిక విక్రయాలు జరుగుతుండగా కోమల బ్యాంకు నుంచి దాదాపు రూ.7 లక్షల వర్కింగ్ క్యాపిటల్ లోన్ తీసుకున్నారు. ప్రస్తుతం ఆమె వద్ద 10 నుంచి 12 మంది వరకు ఉపాధి పొందుతున్నారు.

పసుపు నిలబెట్టింది

కోవిడ్ -19 మహమ్మారి అందరికీ కష్టతరమైన కాలంగా మారింది. అయినప్పటికీ రోగనిరోధక శక్తిని పెంచే ఆర్గానిక్ పసుపు అత్యధికంగా అమ్ముడైన ఉత్పత్తులలో అగ్రశ్రేణిగా నిలిచింది. ఇదే ఆమె వ్యాపారం నిలకడగా ఉండటానికి సహాయపడింది. సేల్స్ ఛానెల్‌ని విస్తరించడం, మరిన్ని మార్కెట్ ప్లేస్‌లలో లిస్టింగ్ చేయడం ద్వారా ఔత్సాహిక మహిళ వ్యాపారవేత్తగా 22-23 ఆర్థిక సంవత్సరంలో రూ. 50 లక్షల వార్షిక టర్నోవర్‌ను ఆశించారు. జర్మన్ ఫెడరల్ మినిస్ట్రీ ఫర్ ఎకనామిక్ కోఆపరేషన్ అండ్ డెవలప్‌మెంట్ (BMZ) తరపున మహిళా పారిశ్రామికవేత్తలకు సాధికారత కల్పించడానికి, నైపుణ్య అభివృద్ధి, వ్యవస్థాపకత మంత్రిత్వ శాఖ (MSDE) భాగస్వామ్యంతో ప్రభుత్వం ఆమెకు మద్దతు ఇచ్చింది. విశిష్ట మహిళగా ఎన్నో పురస్కారాలు, అవార్డులు అందుకున్నారు. వాటిలో అతి ముఖ్యమైనవి సావిత్రీ బాయిపూలే అవార్డు, వి హబ్ వాళ్ళ దగ్గర నుంచి ఉత్తమ ఉత్పత్తిదారి అవార్డు, అబ్దుల్ కలాం అవార్డును అందుకున్నారు కోమలా దేవి. తన విజయానికి కారణం పాజిటివ్ థింకింగ్ అంటున్నారు.

- మణి వడ్లమాని, 9652067891

ఊళ్లను..దుమ్ము కమ్మేస్తోంది..!

(మొదటిపేజీ తరువాయి)

ఉన్నాయి. అక్కడి నుంచి సిమెంట్ ఇతరత్రా వస్తువుల రవాణా కోసం మన రాష్ట్రంతో పాటు వివిధ రాష్ట్రాల నుంచి భారీ లారీలు వెళ్తుంటాయి. భోరజ్ నుంచి జైనథ్, బేల మండలాల మీదుగా మహారాష్ట్రకు వెళ్తుంటాయి. అక్కడ్నుంచి ఇదే మార్గం గుండా రావాల్సి ఉండగా మధ్యలో తర్నం బ్రిడ్జి వద్ద రాకపోకలు నిలిపివేయడంతో ఈ వాహనాలు నెలన్నర రోజులుగా నిరాల-లాండసాంగ్వి మీదుగా ప్రయాణిస్తున్నాయి. దీంతో రోజూ వందలాది లారీలు, ఆర్టీసీ బస్సులు, పెద్ద వాహనాలు ఇదే మార్గం గుండా వెళ్తుండటంతో భారీ ఎత్తున దుమ్ము లేస్తోంది. రోడ్డు కూడా గుంతలుగా ఉండటం.. ఎదురెదురుగా రెండు వాహనాలు వస్తే ప్రమాదకర పరిస్థితి ఏర్పడింది. తర్నం బ్రిడ్జి నిర్మాణం జాతీయ రహదారుల సంస్థ ఆధీనంలో ఉండటంతో వారే నిర్మాణం చేపట్టాల్సి ఉంటుంది. కానీ ఇప్పటి వరకు ఈ బ్రిడ్జి నిర్మాణంపై ఎలాంటి కదలిక కనిపించడం లేదు.

రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు : పిడుగు స్వామి, జైనథ్



నిరాల వైపు నుంచి లాండసాంగ్వి మీదుగా ఆదిలాబాద్‌కు వెళ్లాల్సి వస్తోంది. ఈ రోడ్డు కూడా గుంతలతో పూర్తిగా చెడిపోయింది. మరోపక్క ఇదే మార్గంలో భారీ వాహనాలు వెళ్తుండటంతో దుమ్ము రేగుతోంది. అధికారులు వెంటనే బ్రిడ్జి నిర్మాణాన్ని పూర్తిచేయాలి.

బీజేపీ పాలనలో అచ్ఛే దిన్ కాదు.. సామాన్యుడు చచ్చే దిన్..

(మొదటిపేజీ తరువాయి)

ధరలు పెరిగితే.. అది పేద, మధ్య తరగతి ప్రజలకి భారం అవుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ రకంగా సామాన్యుడిని ఇబ్బంది పెట్టడమే బీజేపీ ప్రభుత్వం పనిగా పెట్టుకున్నదని తెలిపారు. అవకాశం దొరికిన ప్రతిసారీ పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరలు విపరీతంగా పెంచి ప్రజల నడ్డి విరుస్తున్నదనీ, చివరకు జబ్బు చేస్తే ప్రాణాలు కాపాడే మందుల ధరలు కూడా పెంచేందుకు సిద్ధమైందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇది అత్యంత దుర్మార్గమైన చర్యని విమర్శించారు. ఇవి అచ్ఛే దిన్ కాదు.. సామాన్యుడు చచ్చే దిన్..అని విమర్శించారు. దేశంలో బీజేపీ పాలనకు రోజులు దగ్గర పడ్డాయని ఈ సందర్భంగా హరీశ్ హెచ్చరించారు.

రాహుల్‌కు పాట్నా హైకోర్టు సమన్లు

పాట్నా : కాంగ్రెస్ అధినేత రాహుల్ గాంధీ కష్టాలు తీరడం లేదు. సూరత్ కోర్టు రెండేండ్ల శిక్ష విధించడంతో రాహుల్ గాంధీ పార్లమెంటు సభ్యత్వాన్ని కోల్పోయారు. ఇప్పుడు మళ్లీ మోడీ ఇంటిపేరుపై రాహుల్ గాంధీ చేసిన వ్యాఖ్యలపై పాట్నా హైకోర్టు ఆయనకు సమన్లు జారీ చేసింది. సుశీల్ మోడీకి సంబంధించిన పరువు నష్టం కేసులో ఏప్రిల్ 12న హాజరు కావాలని రాహుల్ గాంధీని పాట్నా హైకోర్టు ఆదేశించింది. అయితే రాహుల్ వస్తారో రారో ఢిల్లీ నుంచి ఇప్పటి వరకు ఎలాంటి సమాచారం రాలేదని పార్టీ నేతలు చెబుతున్నారు.

అమెరికాలో భారతీయ టెకీలకు గుడ్ న్యూస్

వాషింగ్టన్: హెచ్1బీ వీసా తో అమెరికా పని చేస్తున్న విదేశీ సాంకేతిక నిపుణులకు, ఉద్యోగులకు అనుకూలంగా అక్కడి న్యాయస్థానం తీర్పునిచ్చింది. భార్యాభర్తలిద్దరూ ఉద్యోగం చేసుకోవచ్చని వెల్లడించింది. ఈ మేరకు 'సేవ్ జాబ్స్ యూఎస్ఏ' సంస్థ దాఖలు చేసిన దావాను యూఎస్ జిల్లా న్యాయమూర్తి తన్యా చుక్తాన్ కొట్టివేశారు. బరాక్ ఒబామా అమెరికా అధ్యక్షుడిగా ఉన్న సమయంలో హెచ్1బీ వీసాతో అమెరికాలో పని చేస్తున్న వారి జీవితభాగస్వామి కూడా ఉద్యోగం చేసుకునేందుకు వీలు కలిగేలా చట్టంలో సవరణలు తీసుకొచ్చారు. దీనివల్ల స్థానికంగా ఉన్న వారికి ఉపాధి అవకాశాలు తగ్గుతున్నాయని, అందువల్ల హెచ్1బీ వీసాదారుల జీవితభాగస్వామి ఉద్యోగంలో చేరేందుకు వీలు కల్పించకుండా కోర్టు జోక్యం చేసుకోవాలని సేవ్ జాబ్స్ యూఎస్ఏ తరఫు న్యాయవాది వాదనలు వినిపించారు. అమెజాన్, యాపిల్, గూగుల్, మైక్రోసాఫ్ట్ లాంటి పెద్ద పెద్ద సంస్థలు కూడా ఈ దావాను వ్యతిరేకించాయి. హెచ్1బీ వీసాదారులతోపాటు దాదాపు లక్షకు పైగా వారి జీవిత భాగస్వాముల ఉద్యోగాలు చేసుకునేలా గతంలో యూఎస్ ప్రభుత్వం అనుమతిచ్చింది. ఇందులో ఎక్కువ మంది భారతీయులే ఉండటం గమనార్హం. తాజాగా కోర్టు వెలువరించిన తీర్పుతో అమెరికాలోని చాలా మంది భారతీయులకు ప్రయోజనం కలుగుతుంది.

కార్పొరేట్లకు పన్నులు తగ్గించి.. ప్రజల్ని దోచుకుంటారా..?

(మొదటిపేజీ తరువాయి)

మేరకు కేటీఆర్ గురువారం కేంద్రానికి లేఖ రాశారు.

పెట్రోల్, డీజిల్ ధరలను విపరీతంగా పెంచడం వల్ల దేశంలోని పేద, సామాన్య, మధ్యతరగతి ప్రజానీకం ధరల భారంతో తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నదని మంత్రి ఈ సందర్భంగా వాపోయారు. 2014 నుంచి ఇప్పటిదాకా దాదాపు 45శాతానికి పైగా పెట్రో ధరల పెంపు వల్ల సరుకు రవాణా భారమై, నిత్యావసరాల ధరలన్నీ భారీగా పెరిగాయని గుర్తు చేశారు. కేంద్ర ప్రభుత్వ వైఫల్యం వల్ల గత 45 యేండ్లలో ఎప్పుడు లేనంతగా పెరిగిన ద్రవ్యోల్బణం దేశాన్ని పట్టిపీడిస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇన్నాళ్లూ అంతర్జాతీయ ముడి చమురు ధరల ప్రస్తావన, లేదా ఉక్రెయిన్- రష్యా యుద్ధం పేరు చెప్పి దేశ ప్రజలను ప్రధాని మోడీ మభ్యపెట్టారని విమర్శించారు. కేంద్ర ప్రభుత్వం చెబుతున్న రూ.35 వేల కోట్ల ముడిచమురు పొదుపు ప్రయోజనమంతా కేవలం ఒకటి రెండు ఆయిల్ కంపెనీలకే దక్కిందనేది వాస్తవమని స్పష్టంచేశారు. దేశీయ వినియోగం పేరు చెప్పి భారీగా రష్యా నుంచి దిగుమతి చేసుకున్న ముడిచమురును తిరిగి శుద్ధి చేసి విదేశాలకు అమ్ముకోవటం ద్వారా కేంద్ర ప్రభుత్వం ఓ దోపిడీదారుగా తయారైందని ఆగ్రహం వ్యక్తం చేశారు. విదేశాలకే పెట్రోలు అమ్ముతున్న ఆయిల్ కంపెనీలకు వస్తున్న లాభాలపై ప్రభుత్వానికి వచ్చే విండ్ ఫాల్ పన్నును ఎందుకు తగ్గించాల్సి వచ్చిందంటూ కేటీఆర్ ఈ సందర్భంగా ప్రశ్నించారు. అంతర్జాతీయ మార్కెట్లో ముడి చమురు ధర 2013 సంవత్సరంలో ఉన్న స్థాయికి ప్రస్తుతం పడిపోయిన నేపథ్యంలో భారీగా పెంచిన, పెట్రోల్ రేటును అందుకనుగుణంగా తగ్గించాలని ఆయన డిమాండ్ చేశారు. తెలంగాణ లాంటి రాష్ట్రాలు 2014 నుంచి ఒక్క రూపాయి వ్యాట్‌ను పెంచకున్నా, కేంద్ర ప్రభుత్వం మాత్రం సెస్సుల పేరుతో రూ.30 లక్షల కోట్లకు పైగా ప్రజల నుంచి కొల్లగొట్టిందని తెలిపారు. ఈ నేపథ్యంలో సెస్సులను పూర్తిగా ఎత్తివేయాలంటూ ఆయన డిమాండ్ చేశారు. జీఎస్టీ పరిధిలో ఉన్న వంటగ్యాస్ సిలిండర్ ధరను రూ.400 నుంచి రూ.1200కు పెంచిన అసమర్థ ప్రభుత్వమంటూ కేంద్రాన్ని విమర్శించారు. ధరల పెరుగుదల అంశం పార్లమెంటులో చర్చకు రాకుండా మోడీ సర్కార్ కుట్రలు చేస్తుందని మంత్రి పేర్కొన్నారు. సామాన్యులపై ఇలాంటి ధరాభారం తగ్గాలంటే బీజేపీని వదిలించుకోవడమే ఏకైక మార్గమని ఆయన తన లేఖలో ప్రజలకు సూచించారు.

పెరుగు వివాదంపై పీఛేముడ్...

చెన్నై : తమిళ నాట ఆందోళనలతో భారత ఆహార భద్రత, ప్రమాణాల ప్రాధికార సంస్థ (ఎఫ్ఎస్ఎస్ఏఐ-ఫసీ) వెనక్కి తగ్గింది. తాజాగా గురువారం ఆ ఆదేశాలను వెనక్కు తీసుకుంటున్నట్టు ఫసీ తెలిపింది. పెరుగు ప్యాకెట్లపై కర్డ్ పేరుతో పాటు బ్రాకెట్‌లో దహీ, తయిర్, మోసారు వంటి ప్రాంతీయ భాషలను వినియోగించవచ్చని తెలిపింది. ఇటీవల తమిళనాడు మిల్క్ ప్రొడ్యూసర్స్ ఫెడరేషన్ (టీఎంపీఎఫ్) కు 'పెరుగు' పేరుపై ఫసీ ఈ ఏడాది జనవరిలో కొన్ని ఆదేశాలు జారీ చేసింది. పెరుగు ప్యాకెట్లపై ఆంగ్లంలో ఉన్న 'కర్డ్' , తమిళంలో ఉన్న 'తయిర్' పేర్లను తొలగించి.. 'దహీ' అని హిందీలోకి మార్చాలని ఆదేశించిన సంగతి తెలిసిందే.

తమిళనాడు సీఎం ఆగ్రహం

కేంద్రం దహీ పేరుతో జారీచేసిన ఆదేశాలపై స్టాలిన్ తీవ్ర ఆగ్రవ్యక్తం చేశారు. హిందీని బలవంతంగా రుద్దాలనే వారి పట్టుదల మరింత పెరుగుతోందనీ, చివరకు పెరుగు ప్యాకెట్‌పైనా తమ మాతృభాషలో ఉన్న పేరును మార్చేసి హిందీలో రాయమని చెబుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. మాతృభాషల పట్ల ఇలాంటి నిర్లక్ష్యం పనికిరాదనీ, దీనికి బాధ్యులైన వారిని దక్షిణాది శాశ్వతంగా బహిష్కరిస్తుందని స్టాలిన్ ధ్వజమెత్తారు. అలాగే ఫసీ నిర్ణయాన్ని తమిళనాడు పాల ఉత్పత్తిదారుల సమాఖ్య 'ఆవిన్ ' కూడా తీవ్రంగా వ్యతిరేకించింది. తాము 'దహీ' అనే పేరును వినియోగించబోమని స్పష్టం చేసింది. వచ్చే ఆగస్టులోగా ఈ ఆ ఆదేశాలను అమలు చేయాలని తమ ప్రభుత్వానికి లేఖ అందిందని పాడి పరిశ్రమ అభివృద్ధి శాఖ మంత్రి ఎస్.ఎం. నాజర్ తెలిపారు. హిందీకి రాష్ట్రంలో చోటు లేదని అన్నారు. తమిళనాడుతో పాటు కర్నాటక, కేరళ రాష్ట్రాలకు కూడా ఇలాంటి ఆదేశాలు పంపినట్టు సమాచారం.

ఢిల్లీలో పోస్టర్ల యుద్ధం

న్యూఢిల్లీ : దేశ రాజధాని ఢిల్లీలో కేంద్రానికి, ఆప్ ప్రభుత్వానికి మధ్య 'పోస్టర్ల' యుద్ధం మరింత ముదిరింది. ప్రధాని మోడీకి వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా 11 భాషల్లో పోస్టర్‌లను విడుదల చేయనున్నట్టు గురువారం ఆప్ తెలిపింది. మార్చి 30(శుక్రవారం) దేశవ్యాప్తంగా ఉన్న అన్ని రాష్ట్రాల్లో పోస్టర్‌లను ప్రదర్శించనుందని ఆప్ నేత, ఢిల్లీ పర్యావరణ శాఖ మంత్రి గోపాల్ రారు తెలిపారు. 11 భాషల్లో ఈ పోస్టర్‌లను ముద్రించామనీ, వాటిని ఆయారాష్ట్రాల్లో అంటించనున్నట్టు వెల్లడించారు. ఇటీవల ఢిల్లీలోని అన్ని గోడలు, విద్యుత్ స్తంభాలపై 'మోడీ హటావో, దేశ్ బచావో' అన్న పోస్టర్లు వెలిసిన సంగతి తెలిసిందే. దీంతో ఈ పోస్టర్‌లపై 49 ఎఫ్ఐఆర్‌లు నమోదు కాగా, ఇద్దరు ప్రింటింగ్ ప్రెస్ యజమానులతో పాటు ఆరుగురుని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ప్రజల ఆస్తులను ధ్వంసం చేసినందుకు ఈ అరెస్టులు జరిగినట్టు పోలీసులు పేర్కొనడం గమనార్హం. అరెస్టులపై ఢిల్లీ ముఖ్యమంత్రి కేజ్రీవాల్ ఆగ్రహం వ్యక్తం చేశారు. స్వాతంత్ర్యోద్యమ సమయంలో తమకు వ్యతిరేకంగా పోస్టర్లు అంటించిన వారిపై బ్రిటిషోళ్లు కూడా అరెస్టులకు పాల్పడలేదని మండిపడ్డారు. బ్రిటిష్ పాలనను వ్యతిరేకిస్తూ భగత్ సింగ్ అనేకపోస్టర్లు అంటించారనీ, కానీ ఆయనపై ఒక్క ఎఫ్ఐఆర్ కూడా నమోదు కాలేదని అన్నారు. ఆప్‌కి వ్యతిరేకంగా ' కేజ్రీవాల్ హటావో, ఢిల్లీ బచావో ' పోస్టర్లతో బీజేపీ ఎదురు దాడికి పాల్పడింది.

శ్రీరామ నవమి ఉత్సవాల్లో విషాదం !

(మొదటిపేజీ తరువాయి)

మెట్లబావిలో పడిపోయిన వారిని కాపాడేందుకు పోలీసులు, స్థానికులు ప్రయత్నించడం మీడియా విడుదల చేసిన వీడియోలో కనిపిస్తోంది. ఈ ప్రమాదంలో మరణించిన వారిలో 10మంది మహిళలు వున్నారని రాష్ట్ర హోంమంత్రి నరోత్తమ్ మిశ్రా భోపాల్‌లో విలేకర్లకు తెలిపారు. అయితే ఆచూకీ తెలియకుండా పోయిన వారిలో కొంతమంది పిల్లలు కూడా వున్నట్లు భయపడుతున్నారు. బావిలోని నీటినంతా బయటకు తోడించి గాలింపు చర్యలు చేపట్టినట్లు చెప్పారు. తొలుత మృతుల సంఖ్య 12గా ఇండోర్ కలెక్టర్ ఇళయరాజా ప్రకటించారు. అయితే గాయపడినవారిని ఆస్పత్రికి తీసుకెళుతుండగా, వారిలో ఒకరు చనిపోయారని తెలిపారు. కాగా ఈ దుర్ఘటనపై విచారణకు ఆదేశించినట్లు ముఖ్యమంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ తెలిపారు. మృతి చెందినవారి కుటుంబాలకు రూ5లక్షలు, గాయపడినవారికి రూ.50వేలు నష్టపరిహారాన్ని అందచేయనున్నట్లు ప్రకటించారు. ఇండోర్ కలెక్టర్‌తో, పోలీసు కమిషనర్‌తో మాట్లాడిన ముఖ్యమంత్రి సహాయక చర్యలను వేగవంతంచేయాల్సిందిగా ఆదేశించారు. కాగా ప్రమాద వార్త తెలిసిన వెంటనే ప్రధాని మోడీ తీవ్ర విచారం వ్యక్తం చేశారు. ఈ మేరకు ట్వీట్ చేశారు. ముఖ్యమంత్రితో మాట్లాడి పరిస్థితులను ఎప్పటికప్పుడు తెలుసుకుంటున్నట్లు తెలిపారు.

హవన్ కార్యక్రమం సందర్భంగా పెద్ద సంఖ్యలో భక్తులు వచ్చారని, వారిలో చాలామంది స్థలాభావం కారణంగా బావి పై కప్పుపై కూర్చున్నారని ప్రత్యక్ష సాక్షి ఒకరు తెలిపారు. ప్రమాదం జరిగిన వెంటనే తమ వారెవరైనా వున్నారేమోనని భయంతో ప్రజలు ఆలయ ఆవరణలో గుమిగూడిపోయారని చెప్పారు. ప్రమాదం గురించి అధికారులు అప్రమత్తం చేసినా గంట వరకు ఒక్క అంబులెన్సు కూడా రాలేదని పటేల్ నగర్ రెసిడెంట్స్ అసోసియేషన్ అధ్యక్షులు కాంతిభాయ్ పటేల్ విమర్శించారు.

వైభవంగా రాములోరి కల్యాణం

(మొదటిపేజీ తరువాయి)

ముందుగా స్వామివారికి సుప్రభాత సేవ జరిపారు. అనంతరం ఆరాధన, ఆరాగింపు నిర్వహించారు. తొలుత ఆలయంలో ధృవమూర్తులకు ప్రత్యేక పూజలు జరిపారు. ఉదయం 8గంటల నుంచి 9 గంటల వరకు ప్రధానాలయంలో మూలవిరాట్‌కు సంప్రదాయబద్ధంగా కల్యాణం నిర్వహించారు. అనంతరం సీతారాములను ఊరేగింపుగా భక్తుల కోలాటాలు, భాజా భజంత్రీల సందడి, సన్నాయి మేళాల నడుమ మిథుల ప్రాంగణం వద్దకు తీసుకొచ్చారు. ముందుగా విశ్వక్సేన ఆరాధన, పుణ్యాహవాచనం జరిపారు. సీతారాముల వారి గోత్రనామాలను పఠిస్తూ ప్రవర క్రతువును కొనసాగించారు. సీతమ్మ వారికి యోక్త్రధారణ చేశారు. రాములవారికి యజ్ఞోపవీతధారణ నిర్వహించారు. 12 గంటలకు అభిజిత్ లగ్నం నందు అర్చకులు సీతారాముల శిరస్సులపై జీలకర్ర బెల్లం ఉంచారు. అనంతరం మాంగల్యధారణ జరిపించారు. భక్త రామదాసు వారు చేయించిన బంగారు ఆభరణాలు శ్రీ సీతారామచంద్ర స్వామి వారికి కల్యాణం సందర్భంగా ధరింప చేశారు. కల్యాణం జరుగుతున్నంత సేపు అర్చకులు కల్యాణం విశిష్టతను మైకులు, రేడియో, టీవీల ద్వారా సందర్శకులకు తెలియజేశారు. ఇదిలా ఉండగా భద్రాచలం పట్టణంలో అనేక కూడళ్లలో స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యంలో సందర్శకులకు అన్నదానం చేశారు. మజ్జిగ, మంచినీటి ప్యాకెట్లు, పానకం తదితర వాటిని అందజేశారు. కాగా, కల్యాణ మహోత్సవంలో మంత్రి అల్లోల ఇంద్రకరణ్ రెడ్డి తప్ప మరే మంత్రి కూడా హాజరు కాకపోవటం గమనార్హం. ఈసారీ కూడా ముఖ్యమంత్రి కేసీఆర్ కల్యాణ ఉత్సవానికి హాజరు కాలేదు. త్రిదండి చిన్న జీయర్ స్వామి కళ్యాణానికి హాజరై రామయ్య భక్తి భావాన్ని ఉపదేశం చేశారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టర్ అనుదీప్, జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్ దగ్గరుండి కల్యాణం ఏర్పాట్లను చేశారు. దేవస్థానం కార్యనిర్వాహణాధికారి రమాదేవి ఆలయపరంగా అన్ని ఏర్పాట్లు చేశారు. సుమారు రెండువేల మంది పోలీసులు బందోబస్తు నిర్వహించారు. హర్యానా గవర్నర్ బండారు దత్తాత్రేయ, రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవి చంద్ర, మహబూబాబాద్ పార్లమెంటు సభ్యురాలు మాలోత్ కవిత, తదితరులు హాజరయ్యారు.

డర్టీ 'బీజేపీ' ఎమ్మెల్యే

(మొదటిపేజీ తరువాయి)

సమావేశాలు జరుగుతుంటే..తన స్మార్ట్ ఫోన్ తీసుకుని అశ్లీల వీడియోలు చూసుకునే పనిలో బిజీఅయిపోయారు. ఇంతలో.. ఎమ్మెల్యే వెనుక నుంచి ఎవరో వీడియో తీసి సోషల్ మీడియాలో పోస్ట్ చేశారు.అంతే ఈ వీడియో వైరల్ అయిపోయింది.మనం అసెంబ్లీకి ఇలాంటి వాడినా ప్రజాప్రతినిధిగా ఎన్నుకున్నదని అక్కడి జనం అనుకుంటున్నారు.

సదరు ఎమ్మెల్యే ఏమంటున్నారంటే..

ఇది కుట్రపూరితంగా జరిగిందని ఎమ్మెల్యే చెబుతున్నారు. దీనిపై పార్టీకి వివరణ ఇస్తానని డర్టీ ఎమ్మెల్యే అంటున్నారు.జదబ్ లాల్ నాథ్ త్రిపురలోని బగ్‌బాసా అసెంబ్లీ నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యేగా ప్రాతినిధ్యం వహిస్తున్నారు.

2012లో కర్నాటక అసెంబ్లీలోనూ ఇదే తరహా..

2012లో కర్నాటకలో కూడా ఇదే కేసు వచ్చింది.అప్పటి బీజేపీ ప్రభుత్వంలోని సహకార శాఖ మంత్రి లక్ష్మణ్ సవాది, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి సీసీ పాటిల్ అశ్లీల వీడియోలు చూస్తుండగా పట్టుబడ్డారు. అపుడు వారు కూడా అసెంబ్లీ సమావేశాలు జరుగుతున్నపుడే అడ్డంగా దొరికిపోయారు. మంత్రుల నీలి చర్యను అసెంబ్లీ కార్యక్రమాలను కవర్ చేస్తున్న స్థానిక ఛానెల్ క్యాచ్ చేసింది. ఈ ఘటన ప్రజాస్వామ్యానికి నల్ల మచ్చ అని మాజీ ముఖ్యమంత్రి హెచ్‌డి కుమారస్వామి అప్పట్లో వ్యాఖ్యానించిన విషయం విదితమే.

పీఎఫ్ ఖాతాల్లో 4,962 కోట్లు

(మొదటిపేజీ తరువాయి)

పేరుకుపోయిందని మంత్రి లోకసభకు తెలిపారు. అయితే వీటికి హక్కుదారులున్నారని పేర్కొన్నారు. వరుసగా 36 నెలల పాటు ఏదైనా పీఎఫ్ ఖాతాలో నగదు జమ కాకపోతే వాటిని నిర్వహణలోని లేని ఖాతాలు (ఇన్ ఆక్టివ్)గా గుర్తిస్తారు. వీటికి వడ్డీ మాత్రం జమ అవుతూ ఉంటుందని మంత్రి తెలిపారు.

కర్మన్‌ఘాట్ ఆలయంలో పట్టు వస్త్రాలు సమర్పించిన ఎమ్మెల్యే



నవతెలంగాణ-సంతోష్ నగర్

కర్మన్ ఘాట్ ఆలయంలో సీతారాముల కల్యాణం అత్యంత వైభవంగా నిర్వహించారు. చంపాపేట్ డివిజన్ మారుతి నగర్ కాలనీ మాధవ్ నగర్ కాలనీ యందు హనుమాన్ ఆలయంలో సీతారాముల స్వామి వారి కల్యాణానికి ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవీ రెడ్డి సుధీర్ రెడ్డి తెలంగాణ ప్రభుత్వం తరపున పట్టువస్త్రాలను సమర్పించారు. ఈ వేడుకల్లో స్థానిక నాయకులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే ఆధ్వర్యంలో ఇఫ్తార్ విందు



నవతెలంగాణ-సంతోష్ నగర్

మలక్‌పేట్ ఎమ్మెల్యే అహ్మద్ బిన్ అబ్దుల్లా బలాల ఆధ్వర్యంలో బుధవారం రాత్రి దావత్-ఏ-ఇస్తార్ నిర్వహించారు. చాంద్రాయణగుట్ట, చార్మినార్, యాకుత్ పురా ఎమ్మెల్యేలు అక్బరుద్దీన్ ఒవైసీ, ముంతాజ్ ఖాన్, సయ్యద్ అహ్మద్ పాషా ఖాద్రీలతో పాటు ఎమ్మెల్సీ మిర్జా రియాజ్- ఉల్-హసన్ ఎ ఫెంది, పత్తరట్టి మాజీ కార్పొరేటర్ మోసిన్ బిన్ అబ్దుల్లా బలాలు హాజరయ్యారు.

పేదల సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట

- వయోవృద్ధులకు పెద్ద కొడుకు సీఎం కేసీఆర్
- మంత్రి సబితా ఇంద్రారెడ్డి
- జల్‌పల్లిలో ఆత్మీయ సమ్మేళన సభ



నవతెలంగాణ-బడంగ్‌పేట్

రాష్ట్ర ప్రభుత్వం సీఎం కేసీఆర్ నాయకత్వంలో పేద ప్రజల సంక్షేమానికి పెద్దపీట వేస్తూ ముందుకు సాగుతున్నట్టు రాష్ట్ర విద్యా శాఖ మంత్రి పి.సబితా ఇంద్రారెడ్డి తెలిపారు. బుధవారం జల్ పల్లి మున్సిపల్ పరిధిలోని శ్రీరాంనగర్ కాలనీలో కౌన్సిలర్ పల్లపు శంకర్ అధ్యక్షతన ఆత్మీయ సమ్మేళన సభ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మంత్రి హాజరై మాట్లాడుతూ రాష్ట్రంలో వయోవృద్ధులకు రూ. 2 వేల రూపాయలు పెన్షన్ ఇస్తున్న పెద్దకొడుకుగా కేసీఆర్ అని వర్ణించారు. రాష్ట్రంలో పేద ప్రజల కోసం అవలంబిస్తున్న సంక్షేమ పథకాలు, మిషన్ భగీరథ, చెరు వుల సుందరీ కరణ అక్కడితో ఆగకుండా కంటి వెలుగు ఒక గొప్ప కార్యక్రమాన్ని తీసుకొచ్చిన మహనీయుడు కేసీఆర్ అని కొనియా డారు. మహేశ్వరం నియోజకవర్గానికి కోట్లాది రూపాయలు నిధులు మంజూరు చేయగా అన్ని ప్రాంతాలలో కూడా అభివృద్ధి కార్యక్రమాలు జరుగుతున్నాయన్నారు. ఒకప్పుడు జల్ పల్లి మున్సిపల్ టికీ రావాలంటే ఎంతో ఇబ్బందిగా ఉండేదని, ప్రస్తుతం ప్రజల సౌకర్యం కోసం సీసీ, బీటీ రోడ్ల నిర్మాణం, పక్కా డ్రయినేజీ వ్యవస్థ,మిషన్ భగీరథ పథకంలో మంచినీటి వ్యవస్థ,వీధి దీపాలు ఏర్పాటు చేసుకోవడం జరిగిందన్నారు.ఇంకా కొన్ని ప్రాంతాలలో పనులు జరగాల్సిందని, దశల వారీగా త్వరలోనే పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. నిరు పేదలైన వారు ప్రభుత్వ స్థలాలలో ఇండ్లు నిర్మించుకున్న వారికి ప్రభుత్వం మరోసారి 58,59 జీ ఓ ద్వారా రేగ్యులరైజేషన్ చేసుకోవచ్చని, ఈ అవకాశం వచ్చేనెల ఒకటో తేదీ నుండి అమలులోకి రానుందని, ప్రభుత్వ స్థలాలలో ఇల్లు నిర్మించుకున్న వారు 2020 లోపు ఉన్నవారు అర్జీ పెట్టుకోవాల్సిందిగా మంత్రి తెలిపారు. రాష్ట్రం మరింత అభివృద్ధి చెందాలంటే సీఎం కేసీఆర్ నాయకత్వాన్ని బలపరచాలన్నారు. పార్టీ నియోజకవర్గం మైనార్టీ సెల్ అధ్యక్షులు ఖైసర్ బాం, బీఆర్ఎస్ కే.వీ.అధ్యక్షులు దామోదర్ రెడ్డి, కౌన్సిలర్లు కే.లక్ష్మినారాయణ, శంశోద్దిన్, బాషమ్మ కొండల్ యాదవ్, సౌద్ బాయ్, కోఆప్షన్ సభ్యులు సూరెడ్డి కష్టారెడ్డి,మాజీ సర్పంచ్ రాములు, బీఆర్ఎస్ మున్సిపల్ అధ్యక్షులు ఎక్బాల్ ఖలీఫా, వర్కింగ్ ప్రెసిడెంట్ వై.జనార్దన్, మాజీ ఎంపీటీసీలు దూడల శ్రీనివాస్ గౌడ్,సీనియర్ నాయకులు సుధాకర్ గౌడ్, యువ నాయకులు అర్జున్, అనుబంధ సంఘాల అధ్యక్షులు, మహిళలు, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తదితరులు పాల్గొన్నారు.



సరూర్‌నగర్ : సరూర్ నగర్ డివిజన్ హుడా కాంప్లెక్స్ రామాలయంలో జరిగిన సీతారాముల కళ్యాణం వేడుకల్లో మంత్రి సబితా ఇంద్రారెడ్డి పాల్గొన్నారు. బీఆర్ఎస్ మహేశ్వరం నియోజకవర్గం జనరల్ సెక్రెటరీలు బేర బాలకిషన్ (బాలన్న), మురుకుంట్ల అరవింద్ శర్మ, నాయకులు లోకసాని కొండలరెడ్డి, అశోక్, దేవాలయ కమిటీ సభ్యులు రాజకుమార్ గుప్త, మల్లారెడ్డి, మొరిశెట్టి శ్రీను, అన్నపూర్ణమ్మా, యాదయ్య గుప్తా, నేలకొండ శ్రీనివాస్ రెడ్డి, కంచర్ల శేఖర్, శ్రీమన్నారాయణ, పెంబర్తి శ్రీనివాస్ పాల్గొన్నారు.

సీపీఆర్‌పై పోలీసులకు అవగాహన





నవతెలంగాణ-వనస్థలిపురం

వనస్థలిపురం పోలీస్ స్టేషన్ లో విధులు నిర్వహిస్తున్న సిబ్బందికి బంజారా హిల్స్ కేర్ ఆస్పత్రి సౌజన్యంతో డాక్టర్ ఆంథోని పర్యవేక్షణలో సీపీఆర్‌పై అవగాహనకు ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ట్రెనింగ్ డాక్టర్ అంథోని మాట్లాడుతూ గుండు పోటు ఏ రకంగా వస్తుందో తెలియదని, సీపీఆర్ ట్రెనింగ్ ఉంటే అలాంటి సమయంలో వైద్య సేవలు అందుకోవచ్చని తెలిపారు. రాచకొండ పోలీస్ కమిషనరేట్ పరిధిలో వనస్థలిపురం, మీర్ పేట, హయత్ నగర్, అబ్దుల్లాపూర్మెట్ ఎల్బీనగర్, సరూర్ నగర్, చైతన్యపురి పోలీస్ స్టేషన్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్టు ఆయన తెలియజేశారు. ఈ కార్యక్రమంలో బంజా రా హిల్స్ కేర్ ఆస్పత్రి భద్రతా పీఆర్ఓ పీ సాయికిరణ్, టెక్నీషియన్ ఆంజనేయులు, వనస్థలిపురం సీఐ కే సత్యనారాయణ, డిటెక్టివ్ సీఐ వెంకటయ్య ,స్సైలు పరమేష్, మాధవ రెడ్డి, స్వామి, వెంకటేశ్వర్లు, రవి తదితరులు పాల్గొన్నారు.

సీతారాముల కల్యాణంలో పాల్గొన్న ఉప్పల శ్రీనివాస గుప్త



నవతెలంగాణ-నాగోల్

నాగోల్, ఆర్ కే నగర్ , ఇందు అరణ్య ,మరిపల్లి, బండ్లగూడ లోని రామాలయాల్లో, కో-ఆపరేటివ్ బ్యాంక్ కాలనీ కమ్యూనిటీ హాల్ లో, చిలకా నగర్‌లో ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో, బండ్లగూడ, జైపూరి కాలనీ- శ్రీ సాయి బాబా టెంపుల్ లో మరియు మేడిపల్లి, రామాంతపూర్ , వెంకట్ రెడ్డినగర్‌లోని- శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి టెంపుల్‌లో, అలాగే బోడుప్పల్,వాసవి నగర్, సికింద్రాబాద్, కర్ఖానా వాసవి కాలనీలలో జరిగిన శ్రీ సీతారాముల కళ్యాణ మహెూత్సవం కార్యక్రమాలకు ఉప్పల్ ఫౌండేషన్ చైర్మెన్, ఐవీఎఫ్ జాతీయ ప్రధాన కార్యదర్శి ఉప్పల శ్రీనివాస్ గుప్త హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రజలకు శ్రీరామ నవమి పండుగ శుభాకాంక్షలు తెలిపారు.





సీతారాముల కలాణోత్సవంలో పాల్గొన్న మంత్రి మల్లారెడ్డి



నవతెలంగాణ- ఘట్కేసర్

మండలంలోని చౌదరిగుడా, కొర్రెముల, ఘన్‌పూర్, ఘట్కేసర్ మున్సిపల్ పరిధిలోని శివ రెడ్డి గూడా తాళ్లగడ్డ ఆంజనేయ స్వామి ఆలయంలో సీతారాముల కళ్యాణం అంగరంగ వైభవంగా జరిపారు. మంత్రి చామకూర మల్లారెడ్డి, మాజీ ఎమ్మెల్యే మల్లిపెద్ది సుధీర్ రెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు అత్యధిక సంఖ్యలో పాల్గొన్నారు అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు ఈ కార్యక్రమంలో సర్పంచులు బైరు రమాదేవి, రాములు గౌడ్, ఓరుగంటి వెంకటేష్ గౌడ్, బద్దం గోపాల్ రెడ్డి. మున్సిపల్ చైర్ పర్సన్ ముల్లి పావని జంగయ్య యాదవ్. వైస్ చైర్మెన్ పలువుల మాధవరెడ్డి, ఉప సర్పంచ్‌లు, కౌన్సిలర్లు తదితరులు పాల్గొన్నారు



ఘనంగా సీతారాముల కల్యాణం

నవతెలంగాణ-నాగోల్

నాగోల్ గ్రామంలో సీతా రామచంద్రస్వామి దేవాలయంతో పాటు డివిజన్‌లోని దేవాలయాలలో, కాలనీలలో కాలలో సంక్షేమ సంఘాల ఆధ్వర్యంలో సీతారాముల కళ్యాణం ఉత్సవాలను నిర్వహించారు. నాగోలు గ్రామంలోని సీతారామచంద్రస్వామి దేవాలయం ఆధ్వర్యంలో జిల్లా ఉన్నత పాఠశాల ఆవరణలో నిర్వహించిన కళ్యాణ మహెూత్సవానికి ఎమ్మెల్సీ ఎంకే మల్లేశం, స్థానిక కార్పొరేటర్ చింతల అరుణ సురేందర్ యాదవ్ లతోపాటు పలువురు ప్రముఖులు హాజరయ్యారు. రాక్ టౌన్ కాలనీ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన కల్యాణోత్సవంలో కాలనీవాసులు వినోద్ రెడ్డి, ప్రతాపరెడ్డి, హనుమంతరావు, రామ్‌రెడ్డి ,మాధవరెడ్డి, నవీన్, సత్తిరెడ్డిలతోపాటు కాలనీవాసులు భక్తుల అధిక సంఖ్యలో పాల్గొన్నారు. అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు.



ఘట్కేసర్ : కొర్రెముల కమిటీ హాల్ లో గ్రామ సర్పంచ్ ఓరుగంటి వెంకటేష్ గౌడ్ ఆధ్వర్యంలో సీతారాముల కల్యాణం ఘనంగా జరిపారు ఈ సీతారాముల కల్యాణం కు అత్యధిక సంఖ్యలో భక్తులు పాల్గొని సీతారాముల కళ్యాణం ను తిలగించారు అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమం జరిపించారు ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ రాజు వార్డు సభ్యులు కార్యదర్శి కవిత గ్రామ ప్రజలు అత్యధిక సంఖ్యలో పాల్గొన్నారు

అభివృద్ధి పనులకు నిధులు కేటాయించాలి

- కార్పొరేటర్లు పెద్దబావి సుదర్శన్ రెడ్డి, రాళ్లగూడెం సంతోషి శ్రీనివాస్ రెడ్డిలు
- మేయర్ పారిజాత నర్సింహా రెడ్డికి వినతి



నవతెలంగాణ-బడంగ్‌పేట్

బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ఎస్ఎన్ డీపి నిధులతో చేపట్టిన అభివృద్ధి పనులు నిధుల కొరతతో మధ్యలో ఆగిపోయిన అభివృద్ధి పనుల కోసం ప్రత్యేక నిధులు కేటాయించాలని కోరుతూ 20వ, 23వ డివిజన్ల కార్పొరేటర్లు పెద్దబావి సుదర్శన్ రెడ్డి,రాళ్లగూడెం సంతోషి శ్రీనివాస్ రెడ్డిలు మంగళవారం మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో మేయర్ చిగిరింత పారిజాత నర్సింహ రెడ్డికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అభివృద్ధి పనులను పూర్తి చేయటానికి మున్సిపల్ కార్పొరేషన్ బడ్జెట్ సమావేశంలో నిధులు మంజూరు చేసి కాలనీ ప్రజలను ఆదుకోవాలని కోరారు. కార్యక్రమంలో కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.

చంపాపేట్ డివిజన్ అభివృద్ధే నా లక్ష్యం

- కార్పొరేటర్ వంగా మధుసూదన్ రెడ్డి



నవతెలంగాణ-సంతోష్ నగర్

చంపాపేట్ డివిజన్ దుర్గా భవాని నగర్ కాలనీలో నెలకొన్న భూగర్భ డ్రయినేజీ, సీసీ రోడ్ల సమస్యలను అధికారులతో కలసి స్థానిక కార్పొరేటర్ వంగా మదుసుదన్ రెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దుర్గాభవాన్ని నగర్ కాలనీ రోడ్ నెంబర్ 7లో ప్రస్తుతం డ్రయినేజీ 4 అడుగుల పైపు లైన్లు ఉన్నవని, అందుకే తరచూ సమస్యలు ఉత్పన్నమవుతున్నాయన్నారు. ప్రస్తుతం పెరిగిన జనాభాకు అనుగుణంగా 8 అడుగుల పైపు లైన్లకు ప్రణాళిక సిద్ధం చేసి పనులు పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. కాలనీలో నెలకొన్న సీసీ రోడ్ల సమస్య కాలనీ వాసులు ఆయన దష్టికి తీసువచ్చారు. సానుకూలంగా స్పందించి అట్టి సమస్యను వారంలో ప్రారంభించాలని సంబంధిత అధికారులకు కార్పొరేటర్ తెలిపారు. డివిజన్ పరిధిలోనే ప్రతి కాలనీకి మౌలిక సదుపాయాలు కల్పించి అభివృద్ధి చేచడమే తన లక్ష్యమన్నారు. కార్యక్రమంలో ఏఈ సురేష్, వర్క్ ఇన్‌స్పెక్టర్ రాజు, భవాని నగర్ కాలనీ అధ్యక్షులు రమేష్ రెడ్డి, ఉపాధ్యక్షులు వెంకట్, నాయకులు అంజి, అమిత్, సుమిత్ అభిమానులు కార్యకర్తలు పెద్దలు నాయకులు స్థానికులు తదితరులు పాల్గొన్నారు.

శివ నాయక్ జూనియర్ సివిల్ జడ్జిగా ఎంపిక కావడం పట్ల హర్షం



నవతెలంగాణ-బడంగ్‌పేట్

బడంగ్ పేట్ కార్పొరేషన్ 5వ డివిజన్ ఇంద్రాహిల్స్ కాలనీలో నివాసం ఉండే హరి నాయక్ కుమారుడు శివ నాయక్ జూనియర్ సివిల్ జడ్జిగా ఎంపిక కావటం పట్ల కార్పొరేటర్ బోయపల్లి దీపిక శేఖర్ రెడ్డి కాలనీ వాసులతో కలిసి హర్షం వ్యక్తంచేశారు. ఈ సందర్భంగా శివ నాయక్‌ను పూల మాలలు శాలువాతో ఘనంగా సన్మానించారు. కార్పొరేటర్ మాట్లాడుతూ విద్యార్థి దశలోనే కృషి, పట్టుదల తో చదివి ఉన్నత శిఖరాలకు చేరుకోవలన్నారు. కార్యక్ర మంలో కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.

కుటుంబ ఆరోగ్యానికి బాదము



నవతెలంగాణ - హైదరాబాద్

ఆల్మండ్ బోర్డ్ ఆఫ్ కాలిఫోర్నియా వారు 'ఆయుర్వేద మరియు న్యూట్రిషనల్ సైన్స్‌తో సంపూర్ణ ఆరోగ్యం పొందడం' అనే అంశంపై చర్చా కార్యక్రమాన్ని నిర్వహించారు. సెలబ్రిటీ ఫిట్‌నెస్ ట్రెనర్ కిరణ్ డెంబ్లా, న్యూట్రిషన్ మరియు వెల్‌నెస్ కన్సల్టెంట్ షీలా కృష్ణస్వామి మరియు ఆయుర్వేద నిపుణులు డాక్టర్ నితిక కోహ్లీ ఈ చర్చలో పాల్గొన్నారు. ప్రతి ఒక్కరూ తమ కుటుంబ సభ్యుల మెరుగైన ఆరోగ్యానికి ప్రాధాన్యతనివ్వాలని వారు వెల్లడించారు. డైట్, న్యూట్రిషన్, విభిన్న రకాల ఆహారాలను సరైన మోతాదులో తీసుకోవడం గురించి తెలుపుతూనే ఆయుర్వేద మరియు న్యూట్రిషనల్ సైన్స్ సహా భారతీయ ఆరోగ్య పద్ధతులు గురించి వెల్లడించారు. గత దశాబ్దకాలంలో భారతీయ సంస్కృతిలో వస్తోన్న మార్పులను గురించి వీరు చర్చించారు. భారతీయ వంటగదిలో విదేశీ వంటకాలు రాకను ప్రస్తావించిన వీరు అల్ట్రా ప్రాసెస్డ్, హై కేలరీ భోజనాలు, స్నాక్స్‌కు బదులుగా సంప్రదాయ, రుచికరమైన ఆహారం అయిన బాదములు, మిల్లెట్స్, ఉసిరికాయ, రెడ్ రైస్ వంటివి తీసుకోవాల్సిందిగా సూచించారు. ఆయుర్వేద మరియు న్యూట్రిషనల్ సైన్స్ నుంచి తమ ఆరోగ్యం ఏ విధంగా మెరుగుపరుచుకోవచ్చో వెల్లడించిన ప్యానలిస్టులు, ఈ రెండు అధ్యయనాల ఆధారంగా తీసుకోవాల్సిన ఆహారం గురించి వెల్లడించారు.

సెంట్రల్ విస్టా ప్రాజెక్ట్‌లో పనిచేసిన 910మంది కార్పెంటర్‌లకు స్కిల్ ఇండియా సర్టిఫికెట్లు



నవతెలంగాణ - హైదరాబాద్

ఆత్మనిర్భర్ భారత్‌కు ప్రతీకగా ఇండియా ఇప్పుడు తమ నూతన పార్లమెంట్ భవనం పట్ల గర్విస్తుంది. ప్రజాస్వామ్యానికి దేవాలయంగా కీర్తించబడుతున్న ప్రస్తుత భవనం త్వరలోనే 100 సంవత్సరాలు పూర్తి చేసుకోనుంది. నూతన పార్లమెంట్ భవనాన్ని మన సొంత ప్రజలు, సొంత కార్మికులు నిర్మిస్తున్నారు. ఈ కార్మికుల ప్రయత్నాలను గుర్తిస్తూ నైపుణ్యాభివృద్ధి మరియు వ్యవస్థాపకత (ఎంఎస్‌డీ ఈ) నేతృత్వంలోని ఫర్నిచర్ అండ్ ఫిట్టింగ్ స్కిల్ కౌన్సిల్ (ఎఫ్ఎఫ్ఎస్‌సీ), ఎన్‌డీఎంసీ జ్యూరిస్‌డిక్షన్ మరియు నార్సి గ్రూప్ భాగస్వామ్యంతో రికగ్నిజేషన్ ఆఫ్ ప్రయర్ లెర్నింగ్ (ఆర్‌పీఎల్) కింద 910 మంది కార్పెంటర్లకు శిక్షణ అందించడంతో పాటుగా సర్టిఫికెట్లను అందించింది. ఈ ప్రాజెక్ట్ ద్వారా కార్పెంటర్ల నైపుణ్య శిక్షణను మెరుగుపర చడంతో పాటుగా భారతదేశపు అభివృద్ధి మరియు ప్రజాస్వామ్య విలువలకు ప్రతీకగా నూతన పార్లమెంట్ భవన మౌలిక సదుపాయాల సృష్టిలో వీరిని విలువైన ఆస్తిగా తీర్చిదిద్దుతుంది.

అమేజాన్‌లో సూపర్ వేల్యూడేస్ ఆఫర్స్

నవతెలంగాణ - హైదరాబాద్

వేసవి కాలం ఆరంభమవుతున్న నేపథ్యంలో, పోషకాహారాలతో పోషణ మరియు హైడ్రేషన్ ను కలిగి ఉండటం తప్పనిసరి. ఏప్రిల్ 1 నుండి 7 వరకు సూపర్ వేల్యూ డేస్ సమయంలో మీరు అభిమానించే అవసరాలను వేల్యూ ఆఫర్స్ తో నిల్వ చేయండి. మామిడి పండ్లు, పుచ్చకాయలు, ద్రాక్ష పండ్లు మొదలైన తాజా పండ్ల నుండి కూరగాయలు, గృహ అవసరాలు మరియు ఫార్చ్యూన్, ప్యాంపర్స్, టాటా, దావత్ వంటి ప్రసిద్ధి చెందిన బ్రాండ్స్ నుండి ఇంకా ఎన్నో వాటి పై 45% వరకు తగ్గింపు మరియు సౌకర్యవంతమైన డెలివరీ ఆప్షన్స్ పొందండి. ప్రైమ్ సభ్యులు తమ మొదటి అమేజాన్ ఫ్రెష్ ఆర్డర్ పై రూ. 250 వరకు క్యాష్ బ్యాక్ పొందవచ్చు మరియు ఇప్పటికే ఉన్న అమేజాన్ కస్టమర్స్ తమ మొదటి అమేజాన్ ఫ్రెష్ ఆర్డర్ పై రూ. 200 వరకు క్యాష్ బ్యాక్ పొందవచ్చు.

ఆలయాల్లో ఘనంగా సీతారాముల కళ్యాణం



హయత్‌నగర్‌లో

నవతెలంగాణ-హయత్‌నగర్

శ్రీరామనవమి సందర్భంగా గురువారం పలు ఆలయాల్లో సీతారాముల కళ్యాణ మహెూత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ మేరకు సందర్శకులు ఇబ్బందులు పడకుండా ఆయా దేవాలయాల కమిటీ సభ్యులు ఏర్పాట్లు చేశారు.

హయత్‌నగర్‌లో శ్రీ సీతారాముల కళ్యాణ మహెూత్సవ నిర్వహణను జీహెచ్ఎంసీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ కొప్పుల నర్సింహ్మ రెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. శ్రీ రామ్ నగర్ కాలనీలో సాయిబాబా ఆలయ ప్రాంగణంలో నిర్వహించిన శ్రీ సీతారాముల కళ్యాణ మహెూత్సవానికి ఎమ్మెల్సీ ఏవీఎన్ రెడ్డి,సినీ నటి జీవిత రాజశేఖర్‌లు విచ్చేసి సీతారాముల వారికి పట్టు వస్త్రాలు, ముత్యాల తలంబ్రాలు సమర్పించి ఘనంగా కళ్యాణం నిర్వహించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి యేటా ఎంతో ఘనంగా నిర్వహంచే సీతారాముల కళ్యాణ మహెూత్సవానికి పట్టువస్త్రాలు, తలంబ్రాలు సమర్పించడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, వివిధ కాలనీ వాసులు, వివిధ రాజకీయ పార్టీ నాయకులు, మహిళలు పాల్గొన్నారు.



హయత్‌నగర్‌లో

హయత్‌నగర్ డివిజన్ పరిధిలోని పలు కాలనీల్లో జరిగిన వేడుకల్లో స్థానిక కార్పొరేటర్ కళ్లెం నవజీవన్ రెడ్డి పాల్గొన్నారు.



వనస్థలిపురం

వారి వెంట పలు కాలనీ వాసులు ఉన్నారు. మన్సూరాబాద్ డివిజన్ పరిధిలోని లెక్చరర్స్ కాలనీ లో ఉన్న శ్రీ సీతారాముల దేవాలయంలో జరిగిన శ్రీ రామ నవమి వేడుకలలో వనస్థలిపురం ఏసీపీ పురుషోత్తం రెడ్డి,హయత్ నగర్ ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వర్లు తో పాటుగా బీఆర్ఎస్ డివిజన్ అధ్యక్షుడు కొసనం ధనలక్ష్మి వెంకట్ రెడ్డిలు పాల్గొన్నారు.

వనస్థలిపురం : వనస్థలిపురం డివిజన్ పరిధిలోని హిల్స్ కాలనీ రామాలయంలో నిర్వహిస్తున్న సీతారాముల కళ్యాణం మహెూత్సవంలో ఎమ్మెల్యే దేవి రెడ్డి సుధీర్ రెడ్డి, బీఆర్ఎస్ డివిజన్ అధ్యక్షుడు చింతల్ రవికుమార్ గుప్తా పాల్గొన్నారు.

గణేష్ టెంపుల్‌లో ఆలయ కమిటీ సభ్యులు అన్ని ఏర్పాట్లతో కళ్యాణాన్ని నిర్వహించి, భక్తులకు ఎలాంటి ఆటంకం రాకుండా భక్తిశ్రద్ధలతో అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. హయత్ నగర్ సెవెన్ మెట్రోపాలిటీ మెజిస్ట్రేట్ మారుతి ప్రసాద్ తో పాటు వనస్థలిపురం సీఐ కే సత్యనారాయణ, ఎస్సైలు స్వామి, మాధవరెడ్డి, ఆలయ కమిటీ చైర్మెన్ అశోక్ కుమార్ గౌడ్, వైస్ చైర్మెన్‌లు మిట్ట రామ్మో హన్, కంచి కష్ణమోహన్, జనరల్ సెక్రెటరీ డాక్టర్ ప్రభాకర్, సురేష్, బాలేశ్వర్, బ్రహ్మాచారి, పురోహితులు కృష్ణ మూర్తి, పురుషో త్తమా చారి, లక్ష్మణ చారి తదితరులు పాల్గొన్నారు.



వనస్థలిపురం

హిల్స్ కాలనీలోని రామాలయంలో ఆలయ కమిటీ సభ్యులు కళ్యాణోత్సవం నిర్వహించారు. ఆలయ కమిటీ చైర్మెన్ దంపతులతో పాటు బీఆర్ఎస్ వనస్థలిపురం అధ్యక్షుడు చింతల రవికుమార్ గుప్తా దంపతులు, హయత్ నగర్ మెట్రోపాలిటీ మెజిస్ట్రేట్ మారుతి ప్రసాద్ దంపతులు పాల్గొన్నారు.

సరూర్‌నగర్ : ఆర్కే పురం డివిజన్ గ్రీన్ హిల్స్ కాలనీలో శ్రీరామనవమి సందర్భంగా సీతారాముల వారి కళ్యాణం కాలనీ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఘనంగా జరిగింది. ముఖ్యఅతిథిగా బీఆర్ఎస్ మహేశ్వరం నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి మురుకంట్ల అరవింద్ పాల్గొని స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కాలనీ అధ్యక్షులు వజ్రాల సంజీవరెడ్డి, చైర్మెన్ పైల సంజీవరెడ్డి, కన్వీనర్ ఏ మహేందర్, వైస్ చైర్మెన్ పుష్పలత రెడ్డి, కో కన్వీనర్ మురళీధర్ రెడ్డి, బీఆర్ఎస్ డివిజన్ మహిళా అధ్యక్షురాలు ఊర్మిల రెడ్డి, నాయకులు జగన్ మోహన్ రెడ్డి, చామల శైలజ, శ్రీనివాస్ రెడ్డి, గొడుగు శ్రీనివాస్, పెంబర్తి శ్రీనివాస్, కంచర్ల శేఖర్ పాల్గొన్నారు.



సరూర్‌నగర్

సరూర్ నగర్ బంగారు మైసమ్మ కాశీ వైద్యనాదేశ్వర దేవాలయంలో దేవాలయం ఫౌండర్ ట్రస్టీస్ బేర బాలకిషన్ (బాలన్న),ఆకుల అరవింద్ కుమార్ ల ఆధ్వర్యంలో సీతా రాముల కళ్యాణం ఘనంగా జరిగింది.మాజీ శాసనసభ్యులు తీగల కృష్ణారెడ్డి, బీఆర్ఎస్ నాయకులు శ్రీశైలం యాదవ్, బబ్బురి ఆనంద్ కుమార్ , మీడియా ఇన్‌చార్జి మొగిళ్ళ మల్లేష్, దేవాలయం అర్చకులు సాయికష్ణ, చంద్రశేఖర్ పాల్గొన్నారు. కళ్యాణం అనంతరం దేవాలయం కమిటీ వారు అన్నప్రసాదం పంపిణీ చేశారు.



సరూర్‌నగర్



సరూర్‌నగర్

చౌడి విజయ రామాలయంలో శ్రీ సీతారామ కళ్యాణ మహెూత్సవానికి ముఖ్య అతిథులుగా కాంగ్రెస్ రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు చల్లా నరసింహారెడ్డి హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రజలకు శ్రీరామనవమి శుభాకాంక్షలు తెలియజేశారు. సరూర్‌నగర్ సీనియర్ కాంగ్రెస్ నాయకులు శంకర్ యాదవ్, విజయ రామాలయం దేవాలయ చైర్మెన్ మహేందర్ యాదవ్, నర్సింగ్ గౌడ్, అంజయ్య, దత్తాత్రి, మీర్ పెట్ కార్పొరేటర్ చల్లా బాల్ రెడ్డి , జిల్లా జనరల్ సెక్రెటరీ ఎరుకల వెంకటేష్ గౌడ్, సుభాష్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

మీర్‌పేట్ : మీర్ పేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని వెంకటేశ్వ స్వామి ఆలయంలో సీతారాముల కళ్యాణంలో మంత్రి సబితా ఇంద్రారెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆంజనేయ స్వామి విగ్రహాన్ని పునర్ ప్రతిష్టాపన కార్యక్రమంలో పాల్గొన్నారు. డిప్యూటీ మేయర్ తీగల విక్రమ్ రెడ్డి, ఫ్లోర్ లీడర్ అర్కల భూపాల్ రెడ్డి, బీఆర్ఎస్ నేత అర్కల కామేష్ రెడ్డి, స్థానిక కార్పొరేటర్లు, నాయకులు, భక్తులు హాజరయ్యారు.



మీర్‌పేట్

బడంగ్‌పేట్ : బడంగ్ పేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ఉన్న వివిధ గ్రామాల్లో శ్రీ సీతా రాముల కళ్యాణ మహెూత్సవం వేడుకలుఘనంగా నిర్వహించారు. బడంగ్ పేట్, బాలాపూర్, అల్మాస్ గూడ, నాదర్ గుల్, కుర్మల్ గూడ,గుర్రంగూడ, జల్ పల్లి మున్సిపల్ లోని వివిధ దేవాలయంలో జరిగిన శ్రీ సీతారాముల కళ్యాణంలో రాష్ట్ర విద్యా శాఖ మంత్రి పి.సబితా ఇంద్రారెడ్డి, మాజీ ఎమ్మెల్యే తీగల కృష్ణారెడ్డి, పీసీసీ కార్యదర్శి యేల్మటి అమరేందర్ రెడ్డి, బడంగ్ పేట్ మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ చిగురింత పారిజాత నర్సింహారెడ్డి,మహేశ్వరం నియోజకవర్గం బీజేపీ ఇంచార్జి అందెల శ్రీరాములు యాదవ్, ప్రజా ప్రతినిదులు, నాయకులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.



బడంగ్‌పేట్

శ్రీ సత్య సాయి సేవా సంస్థ ఆధ్వర్యంలో చలివేంద్రం ప్రారంభం



నవతెలంగాణ-కాప్రా
ఈసీఐఎల్ బస్టాండ్‌లో శ్రీ సత్యసాయి సేవా సంస్థ ఆధ్వర్యంలో చలివేంద్రాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కుషాయిగూడ డిపో మేనేజర్ పి.చంద్రకాంత్ మాట్లాడుతూ ఈసీఐఎల్ ప్రయాణికులకు వడదెబ్బ తగలకుండా మంచినీటి సౌకర్యం, ఈ చలివేంద్రం గత ఐదు సంవత్సరాల నుండి ఏర్పాటు చేస్తున్నామన్నారు సత్యసాయి సేవా సంస్థ చేస్తున్న కార్యక్రమాలు చాలా బాగున్నాయని కుషాయిగూడ సత్యసాయి చారిటబుల్ ట్రస్ట్ సభ్యులకు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కుషాయిగూడ అసిస్టెంట్ మేనేజర్ రజిత సత్యసాయి ట్రస్ట్ సభ్యులు ఈసీఐఎల్ స్టేషన్ మేనేజర్ రామ్‌రెడ్డి ఉద్యోగులు పాల్గొన్నారు.

జవహర్‌నగర్ మున్సిపాల్టీ స్టాండింగ్ కౌన్సిల్‌గా సురేందర్ రావు



నవతెలంగాణ-కాప్రా
న్యాయవాది, బీఆర్ఎస్ నాయకుడు, మాజీ వార్డ్ మెంబర్ పెంచాల సురేందర్ రావు జవహర్‌నగర్ మున్సిపాలిటీ స్టాండింగ్ కౌన్సిల్‌గా నియమితులైన సందర్భంగా హార్దిక శుభాకాంక్షలు తెలియజేసిన మాజీ మేయర్ బొంతు రాంమోహన్, మాజీ కార్పోరేటర్ గొల్లూరి అంజయ్య, తెలంగాణ రాష్ట్ర వంజరి సంఘం ఆర్గనైజింగ్ సెక్రటరీ వంజరి ప్రవీణ్ కరిపే , బీఆర్ఎస్ నాయకులు రేగిళ్ళ సతీష్‌రెడ్డి, రుద్రాంగి కర్ణాకర్, బాల్ నరసింహ, సంపత్, ధశరత్,శ్రీకాంత్ రెడ్డి, నరసింహా వంశి రాజ్, తదితరులు పాల్గొన్నారు.

నాచారంలో చిన్నారులపై వీధి కుక్కల దాడి





నవతెలంగాణ-నాచారం
నాచారం డివిజన్ పరిధిలోని రాఘవేంద్ర నగర్‌కు చెందిన పాప(4) ఇందిరా నగర్‌కు చెందిన బాలుడు(8) వీధి కుక్కలు దాడిలో గాయపడ్డారు. నిత్య కృత్యంగా మారుతున్న వీధి కుక్కల దాడులను అరికట్టడంలో జీహెచ్ఎంసి అధికారులు విఫలమయ్యారని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తల్లిదండ్రులు ఆదమర్చి పిల్లలను వదిలేస్తే కుక్కల దాడికి బలి కావలసి వస్తుందని నాచారంకు చెందిన మహేష్ యాదవ్ వాపోయారు. నగరంలో ప్రతిరోజు కుక్కల స్వైర విహారం పిల్లలపై దాడులు జరుగుతున్నా జీహెచ్ఎంసి అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించడంతో వీధి కుక్కల దాడులకు బలవుతున్న చిన్నారులు ఎందరో ఉన్నారని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇన్ని సంఘటనలు జరిగిన జీహెచ్ఎంసి అధికారులు వీధి కుక్కల నియంత్రణలో చర్యలు తీసుకోకపోవడం పట్ల జీహెచ్ఎంసి అధికారులు, ప్రభుత్వం విమర్శల పాలవుతుంది. గాయపడిన చిన్నారులను తల్లిదండ్రులు వెంటనే ఆసుపత్రికి తీసుకువెళ్లి చికిత్స చేయించారు. గాయాలుపాలు కావడంతో ఊపిరి పీల్చుకున్న తల్లిదండ్రులు జరగరాని సంఘటన జరిగి ఉంటే బాధ్యులు ఎవరని ప్రశ్నిస్తున్నారు. జీహెచ్ఎంసి అధికారులు, ప్రభుత్వం ప్రత్యేక చొరవ తీసుకొని వీధి కుక్కల నియంత్రణపై చర్యలు తీసుకోవాలని చిన్నారుల తల్లిదండ్రులు ప్రజలు ప్రభుత్వాన్ని వేడుకుంటున్నారు.

సెవెన్ టెంపుల్స్‌లో పట్టు వస్త్రాలు సమర్పించిన మంత్రి తలసాని



నవతెలంగాణ-బేగంపేట
శ్రీ సీతారాముల కల్యాణం వాడవాడలా కన్నులపండువగా అత్యంత ఘనంగా నిర్వహించారు. గురువారం శ్రీరామనవమి సందర్భంగా నియోజకవర్గ పరిధిలోని పలు ప్రాంతాలలో నిర్వహించిన శ్రీ సీతారాముల కల్యాణం మహోత్సవంలో మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. సనత్‌నగర్‌లోని సెవెన్ టెంపుల్స్‌లో మంత్రి శ్రీనివాస్ యాదవ్ దంపతులు మంగళ వాయిద్యాలతో వెళ్ళి స్వామి వారికి పట్టువస్త్రాలు సమర్పించారు. అనంతరం జెక్ కాలనీ రెసిడెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్, సుందర్‌నగర్ రెసిడెంట్స్ ఆధ్వర్యంలో నిర్వహించిన సీతారాముల కళ్యాణంలో మంత్రి దంపతులు, సికింద్రాబాద్ పార్లమెంట్ బీఆర్ఎస్ ఇన్‌చార్జి తలసాని సాయి కిరణ్ యాదవ్‌లు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. మంత్రి శ్రీనివాస్ యాదవ్ ముందుగా బన్సీలాల్‌పేట డివిజన్, అరుణ్ జ్యోతి కాలనీలోని వీరాంజనేయ స్వామి ఆలయంలో పాల్గొన్నారు. ముషీరాబాద్ సర్కిల్‌లోని శ్రీ సీతారామచంద్ర స్వామీ ఆలయంలో నిర్వహించిన కల్యాణంలో పాల్గొని స్వామివారికి పట్టు వస్త్రాలు సమర్పించారు. స్వామివారి పల్లకి సేవలో పాల్గొన్నారు. అదేవిధంగా రాంగోపాల్‌పేట డివిజన్‌లోని జీవైఆర్ కాంపౌండ్‌లోని భజరంగ్ దేవాలయం, గైడన్‌బాగ్‌లోని దేవాలయం లను దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. బేగంపేట డివిజన్‌లోని పీజీ రోడ్‌లో గల కృష్ణా కాలనీలో స్థానికులు నిర్వహించిన సీతారాముల కళ్యాణ మహోత్సవంలో పాల్గొన్నారు. ఆయా ప్రాంతాలలో ప్రత్యేక పూజల అనంతరం మంత్రిని పండితులు వేదమంత్రాలతో ఆశీర్వచనం చేసిన అనంతరం నిర్వాహకులు శాలువాలతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో సనత్‌నగర్, బన్సీలాల్‌పేట కార్పొరేటర్‌లు కొలన్ లక్ష్మి బాల్‌రెడ్డి, హేమలత లక్ష్మీపతి, రాంగోపాల్‌పేట మాజీ కార్పొరేటర్ అత్తిలి అరుణ శ్రీనివాస్ గౌడ్, పద్మారావునగర్ బీఆర్ఎస్ ఇన్‌చార్జి గుర్రం పవన్ కుమార్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు. నాయకులు శ్రీహరి, సురేష్ గౌడ్, కర్ణాకర్ రెడ్డి, ప్రవీణ్ రెడ్డి, ప్రేమ్, శ్రీకాంత్ రెడ్డి, రమణ తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్యం, ఆత్మ రక్షణ కోసం కరాటే అవసరం

జపాన్ కరాటే అసోసియేషన్ తెలంగాణ రాష్ట్ర చీఫ్ రాపోలు సుదర్శన్



నవతెలంగాణ-నాచారం
ఆత్మ రక్షణ కోసం కరాటే ప్రతి ఒక్కరికీ అవసరమని జపాన్ కరాటే అసోసియేషన్ తెలంగాణ రాష్ట్ర చీఫ్ రాపోలు సుదర్శన్ అన్నారు. గురువారం నాచారం డివిజన్ పరిధిలోని ఎర్రకుంట సిడిఎస్ భవన్ లో నిర్వహించిన కరాటే బెస్ట్ బెల్ట్ టెస్ట్ ప్రోగ్రాంకు ముఖ్య అతిథిగా హాజరై ఆయన మాట్లాడుతూ దయానందన జీవితంలో ప్రతి ఒక్కరికి కరాటే అవసరమని అన్నారు. ఆరోగ్యం ఆత్మరక్షణ కోసం ప్రతి ఒక్కరు కరాటే నేర్చుకోవాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. జపాన్ కరాటే అసోసియేషన్ ఆధ్వర్యంలో కరాటే క్రీడలో శిక్షణ పొందుతున్న విద్యార్థులకు బెల్ట్ టెస్టు నిర్వహించి ప్రతిభ కనబరిచిన వారికి బెల్టులను సర్టిఫికెట్లను అందజేశారు. అతి తక్కువ ఫీజులతో అందరికీ కరాటే నేర్పించాలనే లక్ష్యంతో జపాన్ కరాటే అసోసియేషన్ గత 20 సంవత్సరాలుగా వందలాదిమంది కరాటే క్రీడలు శిక్షణ అందిస్తున్నట్లు కరాటే మాస్టర్ రాజశేఖర్ రెడ్డి తెలిపారు. కరాటే క్రీడలో ప్రతిభ వంతులకు నేషనల్, ఇంటర్నేషనల్ స్థాయిలో అవకాశాలు కల్పించేందుకు జపాన్ కరాటే అసోసియేషన్ అన్ని విధాల సహకారం ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో కరాటే మాస్టర్ రాజశేఖర్ రెడ్డి, మల్యాల రాజు, చిదురాల యాకస్వామి, రాజు, రామ్ , చరణ్, శ్రీనివాస్, కరాటే క్రీడాకారులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఈ స్థలం మాదో మీదో ప్రజాదర్బార్‌లో తేల్చుకుందామా?

మాజీ వైస్ చైర్మెన్ ఎం.బాల్‌లింగం



నవతెలంగాణ -నేరేడ్‌మెట్
ముదిరాజ్ శ్మశాన వాటికకు చెందిన ఈ స్థలం మాదో మీదో ప్రజాదర్బార్‌లో తేల్చుకుందామా? అని మల్కాజిగిరి మున్సిపల్ మాజీ వైస్ చైర్మెన్ ఎం.బాల్ లింగం సవాల్ విసిరారు. నేరేడ్‌మెట్ ముదిరాజ్ సంఘం సభ్యులతో మూడుగుళ్ల ప్రాంతంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ముదిరాజుల శ్మశానవాటిక చుట్టూ గోడలు నిర్మించినప్పటికీ, ఈనెల 26వ తేదీన వై.మల్లయ్య, మెహర్‌బాబాలు 100 మంది వ్యక్తులను తీసుకువచ్చి ముదిరాజుల శ్మశానవాటిక గోడలను కూలగొట్టారని తెలిపారు. వై.మల్లయ్య, వై.మెహర్ బాబులు 151/1, 153/1లో గల ముదిరాజ్ శ్మశానవాటిక స్థలంపై కన్నేసి, పక్కన సీలింగ్ భూమిని కబ్జా చేసుకుని అందులో నిర్మాణాలు చేస్తున్నారని తెలిపారు. ఇదే అదునుగా భావించి ముదిరాజుల శ్మశానవాటికను ఆక్రమించుకొని చుట్టూ ప్రహరీగోడని కూల్చివేశారని చెప్పారు. ఇంటింటికీ ఎంతో కొంత సొంత డబ్బులు వేసుకొని కష్టపడి ముదిరాజుల శ్మశానవాటిక చుట్టూ రక్షణ కూడా నిర్మించుకున్నామని తెలిపారు. అయితే వారు ఈ నిర్మాణాలను కూలగొట్టడం వలన తమకు చాలా నష్టం వాటిల్లిందని ఆవేదన చెందారు. తప్పుడు పత్రాలు సృష్టించుకుని అటు ప్రభుత్వాన్ని, ఇటు ప్రజలను మభ్యపెడుతూ ఎన్‌ఓసి తెచ్చుకుంటామని ప్రచారం చేస్తున్నారని ఈ విషయాలన్నీ తాము కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లినట్లు చెప్పారు. దీంతో తప్పుడు పత్రాలు సృష్టించి వారు తెచ్చుకున్న ఎన్‌ఓసిని రద్దు చేశారని తెలిపారు. 1981 నుండి కూడా ఎన్నో కేసులు గెలిచి ఈ స్థలం తమదని నిరూపించుకున్నామని చెప్పారు. ఈ సందర్భంగా మల్లయ్య, మెహర్‌బాబులకి ఓ సవాల్ విసిరారు. మీరు న్యాయంగా ఉంటే, మీది న్యాయపరమైన సమస్య అయితే, ప్రజల ముందు ప్రజాదర్బార్ నిర్వహించి, ప్రజలు ఎవరిది తప్పని తేలుస్తారో చూద్దామన్నారు. ఒకవేళ మాదే తప్పని ప్రజలు తీర్పు ఇస్తే, పక్కకు తప్పుకుంటాం, మీది అన్యాయమైతే మీరు తప్పుకుంటారా అని సవాల్ విసిరారు. ఈ సమావేశంలో భలరి, అశోక్, వైస్ ప్రెసిడెంట్ డి సాయి నాథ్, టీ.జనార్ధన్, డి.సాయినాథ్, శ్రీకాంత్, బాల నరసింహ, టి.జనార్దన్, శోభన్‌బాబు, కిషోర్, ప్రవీణ్, నవిన్, కోటేస్, అశోక్, విజయ్ కుమార్, జి.శ్రీనివాస్, అశోక్, పుట్ట అంజయ్య తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా సీతారాముల కళ్యాణం





నవతెలంగాణ-జవహర్‌నగర్
జవహర్‌నగర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని నోబెల్ స్కూల్. కెఎస్ఆర్ కాలనీ నాచారం ఫెయిర్ విక్టమ్ కాలనీలోని స్థానిక హనుమాన్ అభయఆంజనేయ దేవాలయంలో ఆలయ ఆవరణలో అంగరంగ వైభవంగా ఆలయ ధర్మకర్తల ఆధ్వర్యంలో ఘనంగా శ్రీ సీతారాముల కళ్యాణం మహోత్సవం జరిగింది. నాచారం ఫెయిర్ విక్టిమ్ కాలనీ పరిధిలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో చుట్టుపక్కల మహిళలు, భక్తులు భారీ ఎత్తున తరలివచ్చారు. ఆలయ కమిటీ చైర్మెన్ సిహెచ్.రమేష్, అధ్యక్షుడు ఎర్రగుడ్ల వెంకటేశ్వర్లు, కోశాధికారి అందే నరేందర్, పరమేష్‌చారి, దశరథ శ్రీనివాస్‌గౌడ్, నర్సింహ, బాల్రాజ్, కృష్ణ గౌడ్, నగేష్, రజక యాదగిరి, వేలాదిగా భక్తులు పాల్గొన్నారు.
సీతారాముల కళ్యాణ మహోత్సవంలో మేయర్ మేకల కావ్య, డిప్యూటీ మేయర్, మేడ్చల్ బీఆర్ఎస్ ఇన్‌చార్జి చామకూర మహేందర్ రెడ్డి, కార్పొరేటర్లు, కోఆప్షన్ సభ్యులు, పార్టీ అధ్యక్షుడు కొండల్ ముదిరాజ్, యువజన నాయకుడు భార్గవ్ రామ్ తదితర బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.



శ్రీరామనవమి పర్వదినం సందర్భంగా ఫస్ట్ ఫేస్ ప్లేగ్రౌండ్, ఆనంద్ నగర్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన శ్రీరామనవమి కల్యాణ మహోత్సవంలో మాజీ మేయర్ బొంతు రాంమోహన్, మాజీ కార్పొరేటర్ గొల్లూరి అంజయ్య, తెలంగాణ రాష్ట్ర వంజరి సంఘం ఆర్గనైజింగ్ సెక్రెటరీ వంజరి ప్రవీణ్ కరిపే, ఉప్పల్ మేరు సంఘం అధ్యక్షుడు రుద్రాంగి కర్ణాకర్, బీఆర్ఎస్ నాయకులు రేగిళ్ళ సతీష్ రెడ్డి, శివ, శ్రీకాంత్ రెడ్డి, రాజేశ్వర్ రెడ్డి, కాలనీ అసోసియేషన్ సభ్యులు ప్రతాప్ రెడ్డి, ప్రసాద్ పాల్గొన్నారు.
-నవతెలంగాణ,కాప్రా



కుషాయిగూడ శ్రీ పద్మావతి వేంకటేశ్వర దేవస్థానంలో శ్రీరామ నవమిని పురస్కరించుకొని శ్రీ సీతారాముల కళ్యాణోత్సవం సందర్భంగా ముత్యాల తలంబ్రాలు,పట్టు వస్త్రాలను సమర్పించిన మాజీ మేయర్ రామ్మోహన్ ,కార్పొరేటర్ బొంతు శ్రీదేవి యాదవ్ దంపతులు.ఈ కళ్యాణ వేడుకలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.
-నవతెలంగాణ,కాప్రా



శ్రీరామ నవమిని పురస్కరించుకొని చర్లపల్లి డివిజన్‌లోని రెడ్డి కాలనీ, ఆదర్శ్ నగర్, వాసవి శివ నగర్, గాంధీ నగర్, టీచర్స్ కాలనీ, నాగార్జున నగర్, ఇందిరానగర్‌లోని శ్రీ సీతారామచంద్ర స్వామి వార్ల కళ్యాణ మహోత్సవంలో చర్లపల్లి డివిజన్ కార్పొరేటర్ బొంతు శ్రీదేవి యాదవ్ పాల్గొన్నారు. -నవతెలంగాణ,కాప్రా

కీసర మండలంలో ఘనంగా సీతారాముల కల్యాణం







-నవతెలంగాణ,మేడ్చల్ కలెక్టరేట్

హనుమాన్ జయంతి నిర్వహించేందుకు అనుమతివ్వాలి

నవతెలంగాణ-కంటోన్మెంట్
తిరుమలగిరి లాల్బజార్ మిల్ట్రీ ఆవరణలో ఉన్న హనుమాన్ దేవాలయంలో పూజలకు అనుమతించాలని స్థానికులు విజ్ఞప్తి చేస్తున్నారు. ఏళ్ల చరిత్ర కలిగిన ఈ హనుమాన్ ఆలయంలో గతంలో భక్తులకు ఎంతో ఘనంగా పూజలు నిర్వహించేవారు అని, హనుమాన్ శ్రీరామనవమి వేడుకలు అట్టహాసంగా నిర్వహించుకునే వాళ్లని, అయితే మిలిటరీ వారి ఆంక్షలు వల్ల ఈసారి ఆలయంలో కాకుండా రోడ్డు మీదే పూజలు చేసుకోవాల్సి వచ్చిందని స్థానికులు ఆగ్రహాన్ని వ్యక్తం చేశారు. కనీసం హనుమాన్ జయంతి సందర్భంగా ఆలయంలో పూజలు చేసుకునేందుకు అనుమతి ఇవ్వాలని డిమాండ్ చేశారు. గతంలో ఆలయానికి భక్తులు ఘనంగా పూజల నిర్వహించుకునే వారని కరోనా మొదటి దశ వచ్చినప్పటినుండి మిలిటరీ వారు తాత్కాలికంగా మూశారని, ప్రస్తుతం శాశ్వతంగా కూడా ఆలయంలో భక్తులకు వెళ్ళనీయకుండా చుట్టూ కంచవేసేసారని, కనీసం శనివారాలలో కూడా భక్తులకు ఆలయంలో వెళ్ళనివ్వడం లేదని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయంలో అధికారులు చర్యలు తీసుకుని వెంటనే హనుమాన్ జయంతి కార్యక్రమాలు నిర్వహించేందుకు అనుమతి వచ్చేలా చూడాలని కోరుతున్నారు.

ఉప్పల్ నియోజక వర్గంలో..



నవతెలంగాణ-కాప్రా
ఉప్పల్ ఎమ్మెల్యే సుభాష్ రెడ్డి ఉప్పల్ నియోజక వర్గంలోని అన్ని డివిజన్లో గల శ్రీ సీతారామ, భక్తాంజనేయ, అభయాంజనేయ దేవాలయాలలో శ్రీ సీతారాముల కళ్యాణం మహోత్సవ కార్యక్రమాలకు ముఖ్యఅతిథిగా హాజరై శ్రీసీతారాముల కళ్యాణంలో అన్నదాన కార్యక్రమంలలో పాల్గొన్నారు. శ్రీ సీతారాముల కల్యాణం అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమాలలో ఆలయాల కార్యనిర్వహణ అధికారులు భాగ్యలక్ష్మి, కృష్ణమాచార్యులు, శ్రీనివాసరావు, వీరేశం, కుషాయిగూడ సీఐ వెంకటేశ్వర్లు, జవహర్‌నగర్ సీఐ సీతారాములు, కార్పొరేటర్లు జేరిపోతుల ప్రభుదాసు, పన్నాల దేవేందర్ రెడ్డి, మాజీ కార్పొరేటర్లు కొత్త రామారావు, పజ్జూరి పావని మణిపాల్ రెడ్డి, సింగిరెడ్డి, ధనపాల్ రెడ్డి, గుండారపు శ్రీనివాస్ రెడ్డి, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు, స్థానిక భక్తులు, కాలనీ సంక్షేమ సంఘాల ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించిన కార్పొరేటర్ దీపిక



నవతెలంగాణ-కంటోన్మెంట్
శ్రీరామనవమి పురస్కరించుకొని ముండా డివిజన్ లో పలు దేవాలయాలలో సీతారాముల కళ్యాణం కార్యక్రమంలో కార్పొరేటర్ కొంతం దీపిక పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు సుబ్రమణ్య స్వామి ఆలయంలో జరిగిన కళ్యాణం మహోత్సవంలో కూడా ఆమె పాల్గొని పూజలు చేశారు ఈ సందర్భంగా ఆలయ ప్రతినిధులు ఆమెను ఘనంగా సన్మానించారు అలాగే రెజిమెంటల్ బజార్లను దేవాలయంలో కార్పొరేటర్ దీపిక పానకం ప్రసాదాలను పంపిణీ చేశారు.



శ్రీ రామ నవమి సందర్భంగా సికింద్రాబాద్ ఎస్పీ రోడ్డు లోని శ్రీ వీర హనుమాన్ దేవాలయంలో జరిగిన సీతారామ కళ్యాణంలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించిన బేగంపేట కార్పొరేటర్ మహేశ్వరి శ్రీహరి, ఆలయ మాజీ ధర్మకర్త పత్తిపాక సంజయ్ పాల్గొన్నారు.
-నవతెలంగాణ,బేగంపేట్

కాకతీయనగర్ సౌత్ ఈస్ట్ కాలనీ అసోసియేషన్ ఆధ్వర్యంలో..



నవతెలంగాణ-నేరేడ్‌మెట్
కాకతీయనగర్ సౌత్ ఈస్ట్ కాలనీ అసోసియేషన్ ఆధ్వర్యంలో గురువారం శ్రీ సీతారామచంద్రస్వామి వారి కళ్యాణం మహోత్సవం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు నందికంటి శ్రీధర్ హాజరై ప్రత్యేక పూజలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో కాలనీ అసోసియేషన్ అధ్యక్షులు జె.శ్రీనివాస్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి ఎన్.సీతారామారావు, ఉపాధ్యక్షులు దశరథ, శ్రీనివాస్, సత్యనారాయణ, దామోదర్, లహరి, గుత్తి రామచందర్, సానాది శంకర్, పాండు తదితరులు పాల్గొన్నారు.



మల్కాజ్గిరి కోర్టులో ప్రాక్టీస్ చేస్తున్న బీఆర్ఎస్ నాయకుడు పెంచాల సురేందర్‌రావు, జవహర్ నగర్ మున్సిపాలిటీ స్టాండింగ్ కౌన్సిల్‌గా తెలంగాణా ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిన సందర్భంగా మాజీ కార్పొరేటర్ పావని మణిపాల్ రెడ్డి శాలువా కప్పి సన్మానించారు. ఈ కార్యక్రమంలో వంజరి ప్రవీణ్, మోహన్ సిద్దు తదితరులు ఉన్నారు.
-నవతెలంగాణ,కాప్రా



శ్రీరామనవమి పురస్కరించుకొని సాయిబాబా దేవాలయం వద్ద అన్నదాన కార్యక్రమం నిర్వహించిన మాజీ కార్పొరేటర్ ఆకుల రూప హరికృష్ణ అన్నదాన కార్యక్రమం నిర్వహించారు భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని పూజలు నిర్వహించారు.

నాణ్యమైన వస్తువులను అందిస్తే వినియోగదారుల ఆదరణ

నవతెలంగాణ-నేరేడ్‌మెట్



వినియోగదారులకు నాణ్యమైన వస్తువులను అందిస్తే వ్యాపారాభివృద్ధి సాధ్యమని మల్కాజిగిరి ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు అన్నారు. గురువారం ఓల్డ్ ఆల్వాల్ తిరుమల ఎన్‌క్లేవ్ దగ్గర జై శ్రీ ఫ్రైవుడ్ అండ్ హార్డ్వేర్ గాయత్రి ఫ్రెండ్స్ అండ్ శానిటరీ విభాగాన్ని ఎమ్మెల్యే, కార్పొరేటర్లు శాంతి శ్రీనివాస్ రెడ్డి, రాజ్ జితేంద్రనాథ్, సబిత అనిల్ కిషోర్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నాణ్యమైన వస్తువులను సరసమైన ధరలకు అందజేయాలన్నారు. ఇందుకు అనుగుణంగా మెసులుకుని వ్యాపారం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో నాయకులు బొబ్బిలి సురేందర్ రెడ్డి, రాజసింహారెడ్డి, బలవంత రెడ్డి, నాగేశ్వరరావు, శ్రీనివాస్‌గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

సీతారాముల కల్యాణాన్ని తిలకించిన కార్పొరేటర్

నవతెలంగాణ-నేరేడ్‌మెట్



నేరేడ్‌మెట్ డివిజన్‌లోని వివిధ ప్రాంతాల్లో నిర్వహించిన సీతారాముల కల్యాణానికి స్థానిక కార్పొరేటర్ మీనా ఉపేందర్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. జేజే నగర్, సంతోష్ కాలనీ, జీకే కాలనీ, యాప్రాల్, డిఫెన్స్ కాలనీలో నిర్వహించిన శ్రీ సీతారాముల కల్యాణాన్ని ఆమె తిలకించారు.ఈ సందర్భంగా ఆమె ప్రజలకి శ్రీరామనవమి శుభా కాంక్షలు చెప్పారు. ఈ కార్యక్రమంలో మల్కాజిగిరి సర్కిల్ ఉపాధ్య క్షుడు ఉపేందర్ రెడ్డి, ఎస్ఆర్ ప్రసాద్, చెన్నారెడ్డి, శివ, రాజు, మహేష్, రాజేష్, సాయి గౌడ్, సుబ్బరాయుడు, కిషోర్, నవీన్,ఉత్తమ్ రెడ్డి, రోహిత్, గోపి, ఆంజనేయులు, మహీందర్, మోహిత్, శోభ, రమాదేవి, పరిమళ, తదితరులు పాల్గొన్నారు.

బల్దియాలో నిఘా ఏది..?

- నిన్న నకిలీ జనన, మరణ ధ్రువపత్రాలు
- నేడు మార్కుల మెమో టాంపరింగ్
- పట్టించుకోని విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగం
- గాడి తప్పిన పరిపాలన
- కమిషనర్‌పై విమర్శలు

నవతెలంగాణ-సిటీబ్యూరో

గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (జీహెచ్ఎంసీ) పరిధిలో పరిపాలన గాడి తప్పింది. నిఘా నిద్రపోతోంది. ఎక్కడ ఏం జరుగుతోందో పట్టించుకునే నాథుడే కరువయ్యారు. పరిపాలన విభాగం, హెల్త్ విభాగం, శానిటేషన్ విభాగంలో చోటుచేసుకుంటున్న పరిణామాలపై విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు, కమిషనర్ పట్టించుకోవడంలేదని నగర ప్రజలు, యూనియన్ నేతలు అభిప్రాయపడుతున్నారు. అవినీతి ఆరోపణలు, డబ్బులు తీసుకుని ప్రమోషన్లు ఇవ్వడం, నకిలీ సర్టిఫికెట్ల బాగోతం విషయంలో ఇంతవరకు చర్యలు తీసుకోవడంలేదని విమర్శలూ లేకపోలేదు.

31 వేల సర్టిఫికెట్లు రద్దు

జీహెచ్ఎంసీ అధికారుల నిర్లక్ష్యంతో జారీచేసిన సర్టిఫికెట్లు సరైనవని కావని బహిర్గతమవడంతో 31వేల జనన, మరణ ధ్రువపత్రాలను రద్దు చేశారు. జనవరి 2020 నుంచి 2022 డిసెంబర్ మధ్య 31వేల సర్టిఫికెట్లను జారీచేశారు. వీటిలో సుమారు 27వేల సర్టిఫికెట్లు ఫేక్ ఉన్నాయని, మరో 4వేల సర్టిఫికెట్లను నిబంధనల ప్రకారమే జారీచేసినట్టు అధికారులు గుర్తించారు. వీటిని రద్దు చేయడంతో నిబంధనల ప్రకారం సర్టిఫికెట్లు తీసుకున్నవారు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయంలో ఏ ఒక్క అధికారిపై చర్యలు తీసుకోలేదని విమర్శలొస్తున్నాయి. అయితే నకిలీ జనన, మరణ ధ్రువపత్రాల జారీ, తర్వాత రద్దు అంశానికి పరిపాలన విభాగానికి లింకు ఉందని, పరిపాలన విభాగంలోని ఓ అధికారి అంతా నడిపిస్తున్నారని, అందుకే ఏ ఒక్క అధికారిపైనా చర్యలు తీసుకోలేదని బల్దియా వర్గాలు అభిప్రాయపడుతున్నాయి. దీనిపై ఏ మాత్రం నిఘాలేదనే విషయం స్పష్టమవుతోందని పలువురు విమర్శిస్తున్నారు.



మెమో టాంపరింగ్

ఓ అమాయకురాలి డబ్బులు తీసుకోవడంతోపాటు ఆమె మార్కుల మెమోను టాంపరింగ్ చేసి తప్పుడు ఉద్యోగం ఇచ్చిన అధికారులపైనా చర్యలు తీసుకోవడంలేదంటే 'తిలపాపం తల పిడికెడు' అన్న చందంగా అందరికి ముడుపులు అందాయనే ప్రచారం జరుగుతోంది. 15 డిసెంబర్ 2021న అపాయింట్‌మెంట్ ఆర్డర్ ఇచ్చి నేటికి సదరు మహిళకు ఐడీ నెంబర్ ఇవ్వకపోగా సంబంధిత ఫైల్‌ను కనీసం రిజెక్ట్ కూడ చేయలేదు. అసలు లేబర్ సెక్షన్ నుంచి జరగాల్సిన కారుణ్య నియామకం జనరల్ బ్రాంచ్ జరగడమేంటని పలువురు అధికారులు అనుమానం వ్యక్తంచేస్తున్నారు. నిబంధనల ప్రకారం ఓ క్లర్క్ ఫైల్ పెడితే సూపరింటెండెంట్, ఏఎంసీ, పర్సనల్ ఆఫీసర్, జేసీ, అడిషనల్ కమిషనర్, కమిషనర్‌కు వెళ్తుంది. ఈ క్రమంలోనే అన్ని సర్టిఫికెట్లను పరిశీలించడంతోపాటు అందరి సంతకాలతోనే అపాయింట్‌మెంట్ ఆర్డర్ ఇవ్వాల్సి ఉంటుంది. కాని మెమో టాంపరింగ్ కేసులో జేసీ సంతకం పెట్టకపోవడం అనుమానంగా ఉందని పలువురు అధికారులు అభిప్రాయపడతున్నారు.

విజిలెన్స్ విచారణ ఏది?

మార్కుల మెమోను టాంపరింగ్ చేసి 15 డిసెంబర్ 2021న అపాయిట్‌మెంట్ ఆర్డర్ ఇస్తే ఈఎన్‌సీ రిజెక్ట్ చేశారు. అప్పటి నుంచి ఇప్పటి వరకు విజిలెన్స్ విభాగం పంపించలేదు. దీంతోపాటు ఈ కారుణ్యనియామకంలో విషయంలో స్థానిక పోలీసులు జీహెచ్ఎంసీ పరిపాలన విభాగానికి వస్తే 'ఈ విషయం గురించి మీకు సంబంధంలేదు. మా దగ్గర విజిలెన్స్ విభాగం ఉంది. వాళ్లు చూసుకుంటారు' అని ఓ అధికారి, క్లర్క్ పోలీసులను వెనక్కి పంపించారు. ఇదిలా ఉండగా ఏదైనా ఫైల్ 4 రోజుల కంటే ఎక్కువగా పెండింగ్‌లో ఉంటేనే సంబంధిత అధికారులపై చర్యలు తీసుకుంటామని కమిషనర్ ఆదేశాలు జారీ చేసిన విషయం తెలిసిందే. కానీ టాంపరింగ్ కేసు ఫైల్ రెండేండ్లుగా పెండింగ్‌లోనే ఉన్నా సంబంధిత విభాగం క్లర్క్ పై ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ఉద్యోగులు ప్రశ్నిస్తున్నారు. జీహెచ్ఎంసీలో భాగమైన విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగానికి పంపించకుండా ఎందుకు తాత్సారం చేస్తున్నారని, విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగానికి పంపిస్తే దొంగలెవరో బయటికొస్తారని పలువురు ఉద్యోగులు మండిపడుతున్నారు. ఈ విషయంపై ఇప్పటికే స్టేట్ విజిలెన్స్ విభాగానికి ఫిర్యాదు చేసినట్టు తెలిసింది. జీహెచ్ఎంసీలో వరుసగా జరుగుతున్న సంఘటనలపై ఏసీబీ అధికారులు సైతం నిఘా పెట్టినట్టు సమాచారం. ఉద్యోగుల బదిలీలు, ప్రమోషన్లలో అవకతవకలు, మెమో టాంపరింగ్ విషయంలో భారీగా డబ్బులు చేతులు మారినట్టు తమ దృష్టికి వచ్చిందని, వీటిపై మంత్రి కేటీఆర్, చీఫ్ సెక్రటరీ శాంతికుమారి, పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ అరవింద్ కుమార్‌లకు ఫిర్యాదు చేయనున్నట్టు పలువురు యూనియన్ నేతలు చెబుతున్నారు.

సీఎంఓహెచ్ విచారణ ఎందుకు..?

ఈ ట్యాంపరింగ్ కేసులో చీఫ్ మెడికల్ ఆఫీసర్‌ను విచారణాధికారిగా నియమించినట్టు తెలిసింది. జీహెచ్ఎంసీలో బర్త్ డెత్ సర్టిఫికెట్ల అవకతవకల అంశాన్ని విచారించడానికి విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగానికి ఇచ్చిన అధికారులు మార్కుల మెమో టాంపరింగ్ కేసును చీఫ్ మెడికల్ ఆఫీసర్‌కు అప్పగించడమేంటని పలువురు ప్రశ్నిస్తున్నారు. విచారణ బాధ్యతలు సీఎంఓహెచ్‌కు ఇస్తే మరి విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఎందుకని, జీహెచ్ఎంసీలో సర్కార్ నిబంధనలు పాటించకుండా ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నదని యూనియన్ నేతలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. తెలంగాణ ప్రభుత్వంలో జీహెచ్ఎంసీ భాగం కాదా? జీహెచ్ఎంసీలో జరుగుతున్న అవినీతిపై ప్రభుత్వం ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని పలువురు ప్రశ్నిస్తున్నారు.

నగరంలో శోభయాత్ర ప్రశాంతం



నవతెలంగాణ-సిటీబ్యూరో/సుల్తాన్‌బజార్

హైదరాబాద్‌లో శ్రీరామనవమి శోభయాత్ర ప్రశాంతంగా జరిగింది. శోభయాత్ర నేపథ్యంలో నగర పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. దాదాపు 15 వందల మంది పోలీసులు విధులు నిర్వహించారు. శోభాయాత్ర మార్గంలో సీసీటీవీ కెమెరాలు, డ్రోన్లతో ప్రత్యేక నిఘా ఉంచారు. యాత్ర సాగుతున్న ఆయా ప్రాంతాల్లో ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకున్నారు. పలు ప్రాంతాల్లో ట్రాఫిక్‌ను మళ్లించారు.

మంగళ్‌హాట్ డివిజన్‌లోని సీతారాంబాగ్ రామాలయం నుంచి మధ్యాహ్నం శోభాయాత్ర ప్రారంభమైంది. సీతారాంబాగ్ ఆలయం-బోయగూడ కమాన్ నుంచి మంగళ్‌హాట్ పోలీస్‌స్టేషన్ రోడ్డు, జాలి హనుమాన్, ధూల్‌పేట, పురానాపూల్, జుమేరాత్ బజార్, చుడిబజార్, బేగంబజార్ చత్రి, బర్తన్ బజార్, సిద్దంబర్ బజార్ మసీదు, శంకర్ షేర్ హెూటల్, గౌలిగూడ కమాన్, గురుద్వారా, పుత్లిబౌలి చౌరస్తా, కోఠి ఆంధ్రా బ్యాంక్ మీదుగా సుల్తాన్ బజార్‌లోని హనుమాన్ వ్యాయామశాల వరకు యాత్ర కొనసాగింది. ఎలాంటి అవాఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా పోలీసులు భారీ బందోబస్తును ఏర్పాటు చేశారు. బంజారాహిల్స్‌లోని కమాండ్ కంట్రోల్ నుంచి సీపీ సీవీ ఆనంద్ శోభయాత్రను క్షుణ్ణంగా పరిశీలించారు. అక్కడి నుంచే సిబ్బందికి కావాల్సి సూచనలు, సలహాలను అందించారు. శోభయాత్ర ప్రశాంతవాతావరణంలో పూర్తి చేసేందుకు సీపీ అన్ని ముందస్తు జాగ్రత్తలు తీసుకోవడంతో ర్యాలీ ప్రశాంతంగా ముగిసింది. దాంతో పోలీసులు ఊపిరి పీల్చుకున్నారు.

ఏప్రిల్ 3, 4 తేదీల్లో బీసీల చలో ఢిల్లీ



నవతెలంగాణ-అడిక్‌మెట్

కేంద్ర ప్రభుత్వం బీసీల బడ్జెట్ రూ.రెండు లక్షల కోట్లకు పెంచాలని ఏప్రిల్ 3, 4వ తేదీన తలపెట్టిన చలో ఢిల్లీ కార్యక్రమానికి మద్దతు తెలిపాల్సిందిగా బీసీ సంక్షేమ సంఘం జాతీయ కన్వీనర్ గుజ్జ కృష్ణ, బీసీ యువజన సంఘం రాష్ట్ర కన్వీనర్ టి.రాజ్ కుమార్ ఆధ్వర్యంలో బీసీ సంక్షేమశాఖ మంత్రి గంగుల కమలాకర్‌ను కలసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బీసీలకు అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల్లో 50శాతం రిజర్వేషన్లు కల్పించాలి డిమాండ్ చేశారు. అన్ని రాజకీయ పార్టీలు బీసీలను ఓటు బ్యాంకుగా వాడుకుంటున్నాయన్నారు. రాజ్యాధికారంలో వాటా ఇవ్వకుండా 75 ఏండ్లుగా అన్యాయం చేస్తున్నారని చెప్పారు. జెండాలు మోసుకుంటూ, జిందాబాద్ నినాదాలు ఇస్తూ బీసీలను వాడుకుంటున్నారని తెలిపారు. బీసీల విద్య, ఉద్యోగ రిజర్వేషన్లను 25 శాతం నుంచి 50 శాతం పెంచాలనీ, కేంద్రంలో బీసీలకు ప్రతేక మంత్రిత్వశాఖ ఏర్పాటు చేసి రూ.2 లక్షల కోట్లతో ప్రతేక అభివృద్ధి పథకం ప్రకటించాలని డిమాండ్ చేశారు. హై కోర్టు, సుప్రీంకోర్టు జడ్జిల నియమాకంలో, ప్రైవేట్ రంగాల్లో రిజర్వేషన్లు ప్రవేశపెట్టాలన్నారు. బీసీల న్యాయమైన డిమాండ్ సాధన కోసం పార్లమెంట్ వద్ద భారీ ప్రదర్శన జరపాలని రాజ్యసభ సభ్యులు, జాతీయ బీసీ సంఘం అధ్యక్షులు ఆర్.కృష్ణయ్య పిలుపు మేరకు బీసీ నాయకులు భారీ స్థాయిలో హాజరై విజయవంతం చేయాల్సిందిగా కోరారు. ఈ కార్యక్రమంలో గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షులు భూపేష్ సాగర్, ప్రధాన కార్యదర్శులు నందగోపాల్, కే.రాము, ఇతర తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా శ్రీరామ నవమి వేడుకలు

నవతెలంగాణ-ఓయూ

బౌద్ధనగర్ కార్పొరేటర్ శైలజ సీనియర్ నాయకులు కంది నారాయణతో కలిసి బౌద్ధనగర్ పలు ప్రాంతాల్లో శ్రీరామ నవమి వేడుకల్లో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో శ్రీకాంత్, రాజేష్, సాయి యాదవ్, మనస పాల్గొన్నారు.

ఓయూ : శ్రీరామనవమి సందర్భంగా తార్నాక డివిజన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో నిర్వహించిన సీతారాముల కల్యాణం మహెూత్సవంలో బీఆర్ఎస్ కార్మిక విభాగం రాష్ట్ర అధ్యక్షులు మోతె శోభన్ రెడ్డి తార్నాక హనుమాన్ నగర్, సండే మార్కెట్, కిమ్టి కాలనీ, లాలాపేట్, శాంతినగర్, శ్రీపూర్ నగర్ కాలనీ, వినోబా



నగర్ ఆయా ప్రాంతాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం పండితులు వేదమంత్రాలతో ఆశీర్వచనం చేసిన అనంతరం నిర్వాహకులు శోభన్ రెడ్డిని శాలువాలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో టీటీయూసీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి నాను నాయక్, జెల్లా బాబు, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

ఓయూ : హబ్సిగూడ కార్పొరేటర్ చేతన హరీష్ శ్రీరామ నవమి వేడుకల్లో పాల్గొన్నారు. ఆమె డివిజన్ పరిధిలో పలు ఆలయాల్లో కల్యాణంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో హరీష్ పాల్గొన్నారు.

ఓయూ : సీతాఫల్ మండి కార్పొరేటర్ సామల హేమ సీతాఫల మండిలోని పలు ప్రాంతాల్లో జరిగిన సీతారాముల కల్యాణ మహెూత్సవంలో కుటుంబ సభ్యులతో కలిసి పాల్గొన్నారు.

ధూల్‌పేట్ : శ్రీ రామనవమి సందర్భంగా పాతనగర గౌలిపురా



ఛత్రినాకలోని చారిత్రక కోదండ రామస్వామి ఆలయంలో కన్నుల



పండువగా సాగిన శ్రీ సీతారామ కల్యాణోత్సవంలో ఆలయ ధర్మకర్తలు కొంపల్లి భరద్వాజ్, కొంపల్లి నవీన్,



ఏర్పాట్లను పర్యవేక్షించారు. ఈ కార్యక్రమంలో స్థానిక కాంగ్రెస్ నాయకులు ఎస్.పి.క్రాంతి కుమార్, తదితరులు పాల్గొన్నారు.

అంబర్‌పేట : సీతారాముల కళ్యాణంను పురస్కరించుకుని స్వామివారి కళ్యాణనానికి ముత్యాల తాళంబ్రాలు, పుస్తెమెట్టెలు, జీలకర్ర బెల్లం సమర్పించి స్వామివారి కళ్యాణం జరిపించిన అంబర్‌పేట నియోజకవర్గం బీఆర్ఎస్ ఇన్‌చార్జి ఎడ్ల సుధాకర్



రెడ్డి దంపతులు.

అంబర్‌పేట : బాగ్ అంబర్‌పేట డివిజన్ పరిధిలోని మల్లికార్జున్ నగర్ లో ప్రముఖ సంఘ సేవకులు బోనం వీరబాబు ఆధ్వర్యంలో శ్రీరామ నవమి వేడుకలు పురస్కరించుకుని పానకం పంపిణీ చేశారు. కార్యక్రమంలో వివిధ పార్టీల నాయకులు పాల్గొన్నారు.

బంజారాహిల్స్ : కాంగ్రెస్ ఖైరతాబాద్ జిల్లా అధ్యక్షులు డాక్టర్ సి.రోహిన్‌రెడ్డి జూబ్లీహిల్స్ డివిజన్ ఇందిరానగర్‌లో సీతారాముల కల్యాణోత్సవంలో స్థానిక కాంగ్రెస్ నాయకులతో కలిసి పాల్గొన్నారు. సీతారాముల కళ్యాణ మహెూత్సవం సందర్భంగా





ఏర్పాటు చేసిన అన్నదానం కార్యక్రమంలో బీఆర్ఎస్ ఖైరతాబాద్ ఇన్‌చార్జి మన్నె గోవర్ధన్ రెడ్డి పాల్గొన్నారు. జూబ్లీహిల్స్ కార్పొరేటర్ వెల్దండ వెంకటేష్ డివిజన్ పరిధిలోని వివిధ రామాలయాల్లో ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమంలో భాగస్వాములై అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం









నాగేందర్ నియోజకవర్గం పరిధిలోని వివిధ రామాలయాల్లో ప్రత్యేక పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఖైరతాబాద్ డివిజన్ కార్పొరేటర్ పి.విజయారెడ్డి నియోజకవర్గం పరిధిలోని వివిధ రామాలయాలను సందర్శించి కల్యాణంలో పాల్గొన్నారు.

సాంకేతిక శస్త్ర చికిత్సను అందిపుచ్చుకోవాలి

నవతెలంగాణ-బంజారాహిల్స్



స్టార్ హాస్పిటల్‌లో మోకాలి మార్పిడి ప్రక్రియ కోసం సరికొత్త అత్యంత అధునాతనమైన రోబోటిక్-సహాయక సాంకేతికతను పరిచయం చేస్తున్నందుకు గర్వంగా ఉందని యాజమాన్యం తెలిపింది. శుక్రవారం బంజారాహిల్స్‌లోని హాస్పిటల్ ఆడిటోరియంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. కొత్త సాంకేతికత ప్రతి రోగికీ ఆశించిన స్థాయిలో శస్త్రచికిత్స ప్రణాళికను రూపొందించడానికి అనుమతిస్తుందనీ, దీని ఫలితంగా అత్యంత ఖచ్చితమైన అనుకూలమైన మోకాలి మార్పిడి శస్త్రచికిత్స సాధ్యమవుతుందని కన్సల్టెంట్ ఆర్థోపెడిషియన్ అండ్ జాయింట్ రీప్లేస్‌మెంట్ డాక్టర్ నీలం వి.రమణ రెడ్డి అన్నారు. మోకాలి మార్పిడిని చేసే శస్త్ర చికిత్సలు కచ్చితంగా శక్తివంతం చేయడానికి ఆధారమైన సాంకేతికతతో పాటు తక్కువ ఖర్చు, మెరుగైన చికిత్స అందించడానికి ప్రయత్నిస్తారని సూచించారు. ప్రక్రియ సమయంలో సర్జన్ సిస్టమ్ రోబోటిక్ చేతిని ఉపయోగిస్తారని తెలిపారు. ఇంప్లాంట్ ఖచ్చితమైన కోతలు వాటి స్థానాలు చేయడం ఫలితంగా మరింత ఖచ్చితమైన సమర్థవంతమైన మోకాలి మార్పిడి టెక్నాలజీ మోకాలి కోసం గేమ్-చేంజర్ భర్తీ శస్త్రచికిత్స రోగులకు అందించగలదని విశ్వసిస్తున్నట్టు చెప్పారు.

మహిళల అభివృద్ధి, వీధి వ్యాపారాల సంక్షేమానికి కృషి

నవతెలంగాణ-సుల్తాన్‌బజార్



ప్రభుత్వం బ్యాంకుల ద్వారా మహిళా పొదుపు సంఘాలు (ఎస్ హెచ్ జీ ఎస్), వీధి వ్యాపారులు (స్ట్రీట్ విండర్స్), ముద్ర లోన్స్ వారి అభివృద్ధి కోసం బ్యాంకుల ద్వారా రుణాలు అందేలా చర్యలు తీసుకుంటోంది. జీహెచ్ఎంసీ గోషామహల్ సర్కిల్ -14 కార్యాలయంలో యూసీడీ పీఓ విద్యాసాగర్ మాట్లాడుతూ తమ యూసీడీ సిబ్బందితో మహిళ పొదుపు సంఘాల అభివృద్ధికి కృషి చేస్తున్నామన్నారు. 112 మహిళా పొదుపు సంఘాలకు ఇప్పటివరకు రూ.6కోట్లు అందించినట్టు తెలిపారు. చిరు వ్యాపారులకు ముద్ర లోన్లు రూ.13 లక్షలు ఇప్పించామన్నారు. వీధి వ్యాపారులకు 430 మందికి రుణాలు బ్యాంకుల ద్వారా ఇప్పించ్చామన్నారు. మహిళలు, వీధి వ్యాపారులు, చిరు వ్యాపారం చేసుకునే వారికి యూసీడీ అండగా ఉంటూ వారి ఆర్థిక అభివృద్ధికి తోడ్పాటు అందిస్తుందని తెలిపారు. తమ సర్కిల్‌లో 25 మంది ఆర్‌పీలు ఉన్నారని చెప్పారు. ప్రభుత్వం చేపట్టే సంక్షేమ పథకాల్లో కంటి వెలుగు, ప్రజలకు వివిధ కార్యక్రమాలపై అవగాహన కల్పించే కార్యక్రమాలకు వీరిని భాగస్వామ్యం చేస్తూ ముందుకు సాగుతున్నామన్నారు. తమ సర్కిల్‌లో 850 మహిళా పొదుపు సంఘాలు ఉన్నట్టు తెలిపారు.



ఘనంగా వసంతోత్సవం

నవతెలంగాణ-సుల్తాన్‌బజార్

నవ్య సాహితీ సమితి నృవ్య నాటక సమితి సంయుక్త ఆధ్వర్యంలో సుల్తాన్‌బజార్‌లోని శ్రీకృష్ణదేవరాయ తెలుగు భాష నిలయంలో నిర్వహించిన వసంతోత్సవం కార్యక్రమం ఘనంగా జరిగింది. రాష్ట్ర ఖజానా లెక్కల శాఖ డిప్యూటీ డైరెక్టర్ జీ.వసుంధర కార్యక్రమాన్ని ప్రారంభించారు. టి.గౌరీ శంకర్ (సాహిత్య విమర్శ) డాక్టర్ ముక్తి దేవి భారతి (కథ సాహిత్యం) డాక్టర్ సంఘన భట్ల నరసయ్య (చారిత్రిక పరిశోధన) కుంతీపురం కౌడీల్య తిలక్ (పద్య కవిత్వం) లకు వసంతోత్సవ పురస్కారాలను ప్రధానం చేశారు. కవి సమ్మేళనంలో డాక్టర్ వై.రామకృష్ణారావు, డాక్టర్ భవానీ దేవి తాళ్లపల్లి, డాక్టర్ నండూరి విద్యారణ్యస్వామి, నవ్య సాహితీ సమితి అధ్యక్షులు ఆచార్య పణీంద్ర, సాహితీవేత విశ్వసాహితీ అధ్యక్షులు డాక్టర్ జయ రాములు, వి.విజయ్ కుమార్, లక్ష్మీ మానస, పలురు సాహితీవేత్తలు, తదితరులు పాల్గొన్నారు.

పానకం పంపిణీ



నవతెలంగాణ-జూబ్లీహిల్స్

శ్రీరామనవమి సందర్భంగా సీఐటీయూ జూబ్లీహిల్స్ జోన్ ట్రాన్స్‌పోర్టు యూనియన్, ఆటో యూనియన్ నాయకుల ఆధ్వర్యంలో వెంగళరావు నగర్ డివిజన్ కృష్ణ కాంత్ పార్క్ వద్దగల ఆటో యూనియన్ స్టాండ్ వద్ద పానకం పంపిణీ చేశారు.

సొంత భవనాల్లోకి అంగన్‌వాడీ కేంద్రాలు

- జిల్లాలో 30 భవనాల నిర్మాణానికి కసరత్తు
- ఒక్కో భవనానికి రూ.12-15 లక్షల ఖర్చు
- దాతల సహకారంతో కొత్త హంగులు
- నగరంలో రెండు చోట్ల కొనసాగుతున్న పనులు

నవతెలంగాణ-సిటీబ్యూరో

గత పాలకుల వైఫల్యంతో పసి పిల్లలు అక్షరాలు నేర్చుకునే కేంద్రాలైన అంగన్‌వాడీ కేంద్రాలు సొంత భవనాలు లేక అద్దె ఇండ్లు, కమ్యూనిటీ హాల్‌లో నడిపించేవారు. దీంతో కేంద్రాలకు వచ్చే గర్భిణులు, బాలింతలు, చిన్నారులు ఇబ్బందులు పడేవారు. వీరి కష్టాలకు చెక్ పెట్టి.. ఐసీడీఎస్ సొంత భవనాలకు శ్రీకారం చుట్టింది. ఇందుకు దాతల సహకారాన్ని తీసుకుంటుంది. వివిధ కార్పొరేట్ సంస్థల సీఎస్ఆర్ నిధులు, ఆయా సంస్థల యాజమానులతో సంప్రదింపులు జరిపి జిల్లాలో 30 చోట్ల సొంత భవనాలు నిర్మించాలని మహిళా శిశు సంక్షేమశాఖ కార్యచరణ సిద్ధం చేసింది.

హైదరాబాద్ జిల్లాలో మొత్తం 917 అంగన్‌వాడీ కేంద్రాలున్నాయి. వీటిలో కేవలం 17 కేంద్రాలు మాత్రమే సొంత భవనాల్లో కొనసాగుతుండగా.. 178 కమ్యూనిటీ హాళ్లు, 719 అంగన్‌వాడీ కేంద్రాలు అద్దె ఇండ్లలో కొనసాగుతున్నాయి. అయితే భవన నిర్మాణ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపించేందుకు సొంత భవనాలు నిర్మించాలని ఐసీడీఎస్ భావిస్తోంది. ఈ క్రమంలోనే సయ్యద్‌నగర్, చార్మినార్ మండలంలోని అరుంధతీనగర్‌లో అంగన్‌వాడీ సెంటర్ భవన నిర్మాణానికి శంకుస్థాపన నిర్వహించగా.. సుమారు రూ.12-15లక్షల వ్యయంతో సరికొత్త హంగులతో మోడల్ అంగన్‌వాడీ నిర్మించనున్నారు. ఒక్కో అంగన్‌వాడీ కేంద్రంలో హాల్, కిచెన్, స్టోర్ రూమ్, అటాచ్డ్ బాత్‌రూమ్‌తో పాటు



పిల్లలకు ఆహ్లాదకరంగా ఉండేలా గోడలకు రంగులు, జంతువుల బొమ్మలు, అక్షరమాలలు, ప్రత్యేక చిత్రాలు ఉండేలా తీర్చిదిద్దనున్నారు. అంతేకాకుండా పిల్లలు అనువుగా కూర్చునేందుకు చైర్‌లు, ఆడుకునే ఆట వస్తువులు ఉండేలా ఏర్పాట్లు చేస్తున్నారు.

30 భవనాలకు స్థలాల గుర్తింపు

కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు గత అయిదేండ్లుగా అంగన్‌వాడీ నూతన భవన నిర్మాణాలకు సముచిత బడ్జెట్ కేటాయించకపోవడంతో సొంత భవనాలు లేక ఏండ్లుగా అద్దె ఇండ్లలో కాలం వెళ్లదీస్తున్నారు. 917 కేంద్రాల్లో కమ్యూనిటీ హాళ్ల పక్కనపెడితే.. 790 భవనాలకు కిరాయిల రూపంలో ప్రతినెలా సుమారు రూ.18 లక్షల వరకు చెల్లిస్తుండడంతో నిర్వహణ భారం పెరుగుతోంది. మరోవైపు మహిళా శిశుసంక్షేమ శాఖకు జిల్లాలోని వివిధ మండలాల్లో ఉన్న 30 స్థిర ఆస్తులు కబ్జాకు గురికాకుండా చూడడం పెద్ద సవాలుగా మారింది. ప్రస్తుతం నగరంలో ఎక్కడా ఖాళీ జాగా కనిపిస్తే చాలు.. కబ్జాదారులు రెచ్చిపోతున్న పరిస్థితులు కనిపిస్తున్నాయి. ఈ నేపథ్యంలో హైదరాబాద్ జిల్లా మహిళా, శిశు సంక్షేమాధికారి అక్కేశ్వర్‌రావు ప్రత్యేక కృషితో ఆయా స్థలాల్లో సొంత భవనాలు నిర్మించాలని నిర్ణయించారు. ప్రభుత్వాల సహకారం గురించి ఆలోచించకుండా దాతల సహకారంతో తొలి దశలో పదింటిలో నిర్మాణాలు చేపట్టాలని యోచిస్తున్నారు. వీటిలో రెండింటికి ఇప్పటికే భవన నిర్మాణం కోసం భూమిపూజ కూడా చేయగా.. పనులు నడుస్తున్నాయి. మిగిలిన వాటి నిర్మాణ కోసం దాతలతో సంప్రదింపులు జరుపుతుండగా.. ముత్తుట్ ఫైనాన్స్ సంస్థ నాలుగు మోడల్ అంగన్‌వాడీ కేంద్రాలు నిర్మించేందుకు ముందుకువచ్చింది. మరో నాలుగింటిని రోటరీ క్లబ్ నిర్మించేందుకు ముందుకొచ్చింది. ఇందుకు సంబంధించిన ప్రతిపాదనలు కూడా సిద్ధమయ్యాయి. ఈ భవనాల నిర్మాణం కోసం ఆయా సంస్థలు రూ.15-20లక్షల నిధులు వెచ్చించేందుకు ముందుకొచ్చినట్టు సంబంధిత అధికారులు చెబుతున్నారు. కొద్దినెలల క్రితం నాట్కో సంస్థ దాదాపు రూ.40లక్షలకుపైగా నిధులు ఖర్చు చేసి బోరబండలో మోడల్ అంగన్‌వాడీ కేంద్రాన్ని నిర్మించిన విషయం తెలిసిందే. ప్రస్తుతం ఐసీడీఎస్‌కు 30 స్థలాల్లో భవనాలు నిర్మించేందుకు సరిపడ బడ్జెట్ లేక.. మరోవైపు సొంత భవనాలు లేక.. అద్దె భవనాల్లో కాలం వెళ్లదీస్తున్నారు.

దశలవారీగా పూర్తి చేస్తాం : జిల్లా సంక్షేమాధికారి అక్కేశ్వరరావు

నగరవ్యాప్తంగా ఉన్న అయిదు ఐసీడీఎస్ ప్రాజెక్టుల పరిధిలో తమకు మొత్తం 30 స్థిర ఆస్తులు ఉన్నాయి. ఆయా స్థలాల్లో మోడల్ అంగన్‌వాడీ కేంద్రాలు నిర్మించేందుకు ప్రణాళికలు సిద్ధం చేశాం. ప్రభుత్వ సహకారంతో పాటు దాతల సహకారం తీసుకుంటున్నాం. ఇప్పటికే రెండు ప్రాంతాల్లో పనులు నడుస్తున్నాయి. దశలవారీగా మిగతా వాటిని పూర్తిచేస్తాం.

వంపుగూడలో మజ్జిగ చలివేంద్రం ఏర్పాటు



నవతెలంగాణ-కాప్రా
తులసమ్మ చారిటబుల్ ట్రస్ట్, సోలిస్ కంటి ఆసుపత్రి అధినేత నందనంపాటి రామాంజనేయులు ఆధ్వర్యంలో ఈసీఐఎల్ చౌరస్తా, రాధిక చౌరస్తా, వంపుగూడలో చల్లటి మజ్జిగతో చలివేంద్రం ఏర్పాటు చేశారు. ఈ చలివేంద్రం ప్రారంభోత్సవానికి ఉప్పల్ ఎమ్మెల్యే బేతి సుభాష్‌రెడ్డి చేతుల మీదుగా ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కుషాయిగూడ సీఐ వెంకటేశ్వర్లు మాజీ కార్పొరేటర్ కొత్త రామారావు, ఏఎస్ రావు నగర్ డివిజన్ అధ్యక్షులు కాసం మహిపాల్ రెడ్డి, బేతాళ బాలరాజు, సోలిస్ హాస్పిటల్ ఇన్చార్జ్ మహేష్, విజేందర్ రెడ్డి, చంద్రశేఖర్, వెంకటేశ్వర రెడ్డి, భాస్కర్ రెడ్డి, గడ్డం రవి, కుమారస్వామి రాజశేఖర్ రెడ్డి, కాప్రా శివ సోలిస్ హాస్పిటల్ సిబ్బంది పాల్గొన్నారు.

అర్చకుడు మురళీకృష్ణ సస్పెండ్

నవతెలంగాణ-కంటోన్మెంట్
కంటోన్మెంట్ నియోజకవర్గంలోని ప్రఖ్యాతిగాంచిన సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌కి సమీపంలో ఉన్న శ్రీ గణపతి ఆలయంలో అర్చకుడు మురళీకృష్ణను ఈవో సస్పెండ్ చేశారు సస్పెన్షన్ చేశారు. గణపతి ఆలయంలో 6.5 కిలోల ఆభరణాల అవకతవలకు కారణమైన ఆలయ అర్చకుడు మురళీ కృష్ణను ఆలయం కార్యనిర్వహణ అధికారి వినోద్ సస్పెండ్ చేశారు. ఈ నెల 14, 15న జువెలరీ వెరిఫికేషన్ అధికారి అంజనాదేవి అధ్వర్యంలో అప్రైజింగ్ చేసే సమయంలో అర్చకుడు మురళి కృష్ణ వద్ద ఉండే 6.5 కిలోల వెండి ఆభరణాలు కనిపించలేదు. ఈ విషయమై అర్చకుడికి ఈవో మెమో జారీ చేశారు. ఆయన అర్చకుడు మురళీకృష్ణను నుండి ఎలాంటి సమాధానం రాకపోవడంతో సస్పెండ్ సస్పెండ్ చేసిన విషయం విలువలోకి వచ్చింది

బాటసారుల దాహార్తి తీర్చడం అభినందనీయం

కార్పొరేటర్ కొలుకుల జగన్



నవతెలంగాణ-జగద్గిరిగుట్ట
మండుతున్న వేసవికాలంలో బాటసారుల దాహార్తి తీర్చడం కోసం దాతలు ముందుకు రావడం అభినందనీయమని జగద్గిరిగుట్ట డివిజన్ కార్పొరేటర్ కొలుకుల జగన్ అన్నారు. శ్రీరామ నవమి పర్వదినం పురస్కరించుకుని గురువారం జగద్గిరిగుట్ట చివరి బస్‌స్టాప్‌లో స్థానిక ఫ్రెండ్స్ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని, మజ్జిగ కేంద్రాన్ని, మేడ్చల్ జిల్లా ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షులు పార్శి ప్రకాష్‌గుప్తా, ఫ్రెండ్స్ అసోసియేషన్ సభ్యులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫ్రెండ్స్ యూత్ అసోసియేషన్ సభ్యులు గత 30 ఏళ్లుగా సామాజిక సేవలతోపాటు ఇటువంటి చక్కని కార్యక్రమాలు నిర్వహించడం పట్ల నిర్వాహకులను అభినందించారు. భవిష్యత్తులో కూడా సేవా కార్యక్రమాలు విస్తృతం చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఫ్రెండ్స్ యూత్ అసోసియేషన్ ప్రతినిధులు సిహెచ్.భాస్కర్‌రెడ్డి, రేపన్ గిరిబాబు, కె.కరుణాకర్ రాజు, బొగ్గుల సురేష్, కే.శ్రీరామరాజు, పల్లా వెంకటరెడ్డి, కూర పరశురాం, వెలగరామారావు, వై.హరినాథ్, పాండాల శ్రీనివాస్‌గౌడ్, బింగి శ్రీనివాస్‌గౌడ్, పి.శేషారెడ్డి, ఆర్.ప్రవీణ్‌గుప్త, జి.సంజీవచారి, తేరాల శ్రీనివాసగుప్త, సరస్వతి, నరేందర్, రాజు, జి.ద్రోణాచారి, జగన్మోహన్, నరేష్, కృష్ణమూర్తి, మురళీధర్, వి.కృష్ణగౌడ్, పల్లె దత్తాత్రేయ, ఎ.నరసింహులు, ఎస్.వెంకటేష్, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

ఒత్తిడికి గురికాకుండా పరీక్షలు రాస్తే మంచి ఫలితాలు సాధించవచ్చు

మండవ శ్రీనివాస్‌గౌడ్



నవతెలంగాణ - కుత్బుల్లాపూర్
తల్లిదండ్రుల ఆశయ సాధనకు విద్యార్థులు కష్టపడి కాకుండా ఇష్టపడి చదివితేనే మంచి ఫలితాలు వస్తాయని పాఠశాల ప్రధానోపాధ్యాయులు మండవ శ్రీనివాస్ గౌడ్ అన్నారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గం, సుభాష్‌నగర్ 130వ డివిజన్ పరిధిలోని వివేకానంద విద్యామందిర్ హైస్కూల్‌లో 10వ తరగతి విద్యార్థులకు వీడ్కోలు సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు మండవ శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడుతూ ఒత్తిడికి గురికాకుండా ప్రశాంత వాతావరణంలో పరీక్షలు రాస్తే మంచి ఫలితాలు వస్తాయన్నారు. ఉపాధ్యాయులు బోధించిన పాఠ్యాంశాలను ఎప్పటికప్పుడు చదివితే సులభంగా మంచి మార్కులు సాధించవచ్చు అన్నారు. 10వ తరగతి పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించి పాఠశాలకు మరియు తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని ఆయన విద్యార్థులను కోరారు. విద్యార్థులకు పరీక్ష సామాగ్రిని బహుమతిగా పంచారు. ఈ కార్యక్రమంలో భాగంగా పాఠశాల కరస్పాండెంట్ ఎం.సునీత, ఉపాధ్యాయుల బృందం, విద్యార్థులు వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ప్రభుత్వ స్థలాలు కాపాడాలంటే ఇంటిపై దాడులు చేయిస్తారా?

కాంగ్రెస్ నాయకుడు సాదు యాదవ్



నవతెలంగాణ-దుండిగల్
ప్రభుత్వ ప్రభుత్వ స్థలాలు చేసి అవే భూములను నిరుపేదలకు ప్లాట్లు చేసి అమ్మి వ్యాపారాలు చేసుకోవడంపై ప్రజావాణి, ఇతర అధికారులకు ఫిర్యాదు చేయడంతో ఆక్రమణదారులు కొంతమంది ప్రజలను ఉసిగొల్పి దాడికి పాల్పడుతున్నారని, వారి కబ్జాలను నియంత్రించాలని, కాంగ్రెస్ నాయకుడు సాదు యాదవ్ తెలిపారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గం, దుండిగల్ మున్సిపాలిటీ, బహదూర్‌పల్లి సర్వేనెంబర్ 239లో అక్రమంగా ప్రభుత్వ స్థలాన్ని కొందరు రాజకీయ నాయకులు కబ్జా చేసి ప్లాట్లు అమ్మడం జరుగుతుందని, తెలిసీ తెలియక అమాయక ప్రజలు కొనుగోలు చేసి మోసపోతున్నారని సాదుయాదవ్ అన్నారు. ఈ స్థలం అమ్మకాలపై ఆర్డీవో, కలెక్టర్, కార్యాలయాల్లో ఫిర్యాదు చేసినందుకు నాపై కక్ష పెట్టుకొని ఆక్రమణదారులు మా ఇంటిపై, మహిళలతో కర్రలతో వచ్చి దాడికి యత్నించారని, దౌర్జన్యంగా మహిళలతో ఇష్టానుసారంగా దుర్భాషలాడారని తెలిపారు, ప్రభుత్వ స్థలాలు పరిరక్షించాలని, అట్టి స్థలాలు ప్రజాప్రయోజనాలకు ఉపయోగపడాలన్నదే తాను చేసిన తప్పిదమా అని, ఆక్రమణదారుల తప్పిదాలపై అధికారులకు ఫిర్యాదులు చేస్తే ఇంటిపై దాడులు చేయడం ఎంతవరకు సమంజసమని, తనపై కుట్రపూరితంగా అడుగులు దాడులు చేసిన వారిపై ఈ మేరకు దుండిగల్ పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేసినట్లు, ఇప్పటికైనా పై అధికారులు ప్రభుత్వ స్థలాలు కాపాడేందుకు చర్యలు తీసుకోవాలని, ఈ స్థలాలు ప్రజాప్రయోజనాలకు కమ్యూనిటీ హాల్, పార్కుల వంటి ఉపయోగపడే వరకు పోరాడుతామని తెలిపారు.

వాడవాడల ఘనంగా సీతారాముల కల్యాణ మహోత్సవాలు

నవతెలంగాణ-జగద్గిరిగుట్ట
శ్రీ రామనవమి పర్వదినోత్సవాన్ని పురస్కరించుకొని గురువారం కుత్బుల్లాపూర్, గాజులరామారం జంట సర్కిళ్ల పరిధిలోని పలు ప్రాంతాల్లో సీతారామాంజనేయ, హనుమాన్ దేవాలయాల్లో సీతారామ కల్యాణోత్సవాలు వాడవాడల ఘనంగా జరిగాయి.



రంగారెడ్డి నగర్ డివిజన్ పరిధి, పంచశీల కాలనీలో గల శ్రీ లలితా పరమేశ్వరి కపర్దీశ్వర స్వామి బాలాశాస్త్ర సీతారా మాంజనేయ స్వామి సాయి బాబా దేవాలయంలో ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సీతారాముల కళ్యాణం వేద పండితుల మధ్య అంగరంగ వైభవంగా జరిగింది. ఈ కార్యక్రమానికి విశ్రాంత డీజీ గోపీనాథ్ రెడ్డి, (ఐపీఎస్), కార్పొరేటర్లు కొలుకుల జగన్, బి.విజయ శేఖర్‌గౌడ్, మంత్రి సత్యనారాయణలు పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మెన్ అనంతుల కరుణాకర్ రెడ్డి, అధ్యక్షులు లయన్ డాక్టర్ చిల్లా రాజశేఖర్ రెడ్డి, కోశాధికారి సలాది సత్యనారాయణమూర్తి, నిర్వాహక కార్యదర్శి రామిని శ్రీనివాస్, సభ్యులు కిషోర్‌బాబు, సూర్యనారాయణ, వెంకటేశ్వర రెడ్డి, స్థానిక నాయకులు కాపా సుబ్బారెడ్డి, పెండ్లి సతీష్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

రంగారెడ్డి నగర్ డివిజన్ పరిధిలోని రంగారెడ్డి నగర్, విజయనగర్ కాలనీ, పంచశీల కాలనీ, గిరినగర్, గురుమూర్తి నగర్, ఇందిరా గాంధీనగర్, ఆదర్శనగర్, మారుతీ నగర్, నందనగర్, వెంకట్రామిరెడ్డి నగర్ తదితర ప్రాంతాల్లో జరిగిన సీతారాముల కల్యాణోత్స వేడుకల్లో కార్పొరేటర్ బి.విజయ శేఖర్‌గౌడ్ పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. గాంధీ నగర్‌లో గల శ్రీ రామలింగేశ్వర శ్రీ ఆంజనేయస్వామి దేవస్థానంలో జరిగిన సీతారాముల కల్యాణోత్సవం వేడుకలకు హాజరైన కార్పొరేటర్‌ను ఆలయ కమిటీ సభ్యులు సన్మానించారు. ఈ కార్యక్రమంలో బస్తీ మాజీ అధ్యక్షులు జల్దా రాఘవులు, ఆలయ కమిటీ సభ్యులు సత్యనారాయణరావు, చింతయ్య, బిక్షపతి, జల్దా లక్ష్మీనాథ్, శ్రీనివాస్, మేకల ఎల్లయ్య, వెంకటసాయి, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. అనంతరం ఆయా దేవాలయాల్లో అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు.

గిరి నగర్ ప్రాంతంలో..



రంగారెడ్డి డివిజన్ పరిధి గిరి నగర్‌లో గల సీతారా మాంజనేయ స్వామి దేవస్థానంలో జరిగిన సీతారా ముల కళ్యాణం ఉత్సవానికి మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలంగౌడ్, కార్పొరేటర్ బి.విజయ శేఖర్‌గౌడ్ పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు గరిగే శేఖర్ ముదిరాజ్, మల్లేష్ గౌడ్, బొంబాయి రమేష్, సంతోష్ కుమార్ కురుమ, పుల్లూరి నాగరాజు, తదితరులు పాల్గొన్నారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

జగద్గిరిగుట్ట డివిజన్‌లో...



జగద్గిరిగుట్ట డివిజన్ పరిధి పలు ప్రాంతాల్లో గల సీతారాముల హనుమాన్ దేవాలయాల ప్రాంగణంలో ఆయా కమిటీ నిర్వాహకులు ఏర్పాటు చేసిన సీతారాముల కళ్యాణ వేడుకలకు కార్పొరేటర్ కొలుకుల జగన్ పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. మగ్దూంనగర్‌లోని శివ సీతారామాంజనేయ స్వామి దేవాలయంలో నిర్వహించిన కల్యాణోత్సవం వేడుకలకు హాజరై ప్రత్యేక పూజలు చేసిన అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు బండి సత్యనారాయణ, బొడ్డు ఉమామహేశ్వరరావు, నారానరేందర్, వెంకట్‌రెడ్డి బీ.ఆర్.ఎస్. నియోజకవర్గ యూత్ నాయకులు కొలుకుల జైహింద్, నాయకులు గూడ సత్యరాజ్, రాయి విఘ్నేష్, రాయి రాజేష్, వినోద్ కుమార్, మైలారం రాజు, తదితరులు పాల్గొన్నారు.

గాజుల రామారం డివిజన్‌లో....



డివిజన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన సీతారాముల కళ్యాణం వేడుకలకు కార్పొరేటర్ రావుల శేషగిరి పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఉమాదేవి నగర్‌లో గల హనుమాన్ దేవాలయంలో సీతారాముల వేడుకలకు హాజరై అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ, బస్తీ కమిటీ నాయకులు పి.సమ్మయ్యయాదవ్, కూరపాటి కరుణాకర్ రాజు, కూరపాటి శ్రీరామరాజు అశోక్ చారి, కృష్ణమూర్తి, సూర్య రాజు, సాయి కృష్ణ యాదవ్, భీమ్ శెట్టి, ప్రవీణ్, డివిజన్ ప్రధాన కార్యదర్శి నవాబ్, మురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు

జగద్గిరిగుట్ట డివిజన్...
జగద్గిరి నగర్‌లోని స్థానిక సంఘ సేవకులు, జి.ద్రోణాచారి మిత్ర బృందం ఏర్పాటు చేసిన సీతారాముల కల్యాణోత్సవానికి పలువురు హాజరై ప్రత్యేక పూజలు చేశారు అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

వైభవంగా సీతారామ కల్యాణోత్సవ వేడుకలు



నవతెలంగాణ-దుండిగల్
కుతుబుల్లాపూర్ నియోజక వర్గం నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని పలు దేవాలయాల్లో శ్రీరామనవమి సందర్భంగా శ్రీ సీతా రామ కళ్యాణోత్సవాలు అంగరంగ వైభవంగా ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ కోలన్ నీలా గోపాల్ రెడ్డి, సీనియర్ నాయకులు కోలన్ గోపాల్ రెడ్డి వారి కుటుంబ సభ్యులతో కలిసి శ్రీ రామనవమి సందర్భంగా నిజాంపేట్ శ్రీ అభయ ఆంజనేయ స్వామి దేవాలయం, 12వ డివిజన్ సాయినాథ్ నగర్ శ్రీచంద్రశేఖర స్వామి ఆలయం, సీతారామచంద్ర స్వామి వారి కల్యాణ మహోత్సవ వేడుకలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మేయర్ నిజాంపేట్ ప్రజలందరికీ శ్రీ రామనవమి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ వేడుకలో నిజాంపేట్ మాజీ సర్పంచ్ ప్రమీల సాయిలు యాదవ్, కార్పొరేటర్లు ప్రణయ ధనరాజ్ యాదవ్, ఆవుల పావని జగన్ యాదవ్, రాజేశ్వరీ వెంగయ్య చౌదరి, సీనియర్ నాయకులు వెంగయ్య చౌదరి, మహిళా నాయకురాలు సబిత జలంధర్ రెడ్డి, ఎన్ఎంసి బీఆర్ఎస్ బిసి సెల్ వైస్ ప్రెసిడెంట్ తలారి సాయి ,12వ డివిజన్ బీఆర్ఎస్ అనుబంధ కమిటీ సభ్యులు వెంకటేష్, బట్ట మురళి, ఎల్ఐసి శ్రీనివాస్, రమేష్, చందూ, సురేష్, గోల్కొండ శ్రీనివాస్, భక్తులు, ఇతర ముఖ్యులు తదితరులు పాల్గొన్నారు.



కుత్బుల్లాపూర్ నియోజకవర్గం, దుండిగల్, కొంపల్లి మున్సిపాలిటీల పరిధిలోని భౌరంపేట్, గండిమైసమ్మ, దుండిగల్, బహదూర్‌పల్లి, దూలపల్లి గ్రామాల్లో శ్రీరామ నవమి సందర్భంగా నిర్వహించిన శ్రీసీతా రామచంద్ర స్వామి కళ్యాణ మహోత్సవాల్లో గురువారం ఎమ్మెల్యే కేపి వివేకానంద్ ముఖ్య అతిథిగా పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో స్థానిక కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులు, బీఆర్ఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.



కుత్బుల్లాపూర్ నియోజకవర్గం మల్లంపేట్‌లోని శ్రీసాయి బాలాజీ కాలనీలో కైలాష్ నూతనంగా ఏర్పాటు చేసిన స్వప్న జ్యువలర్స్ షాపును ప్రభుత్వ విప్, మేడ్చల్ జిల్లా బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు, ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు గురువారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, పార్టీ శ్రేణులు, ప్రజలు, నిర్వాహకులు తదితరులు పాల్గొన్నారు.

నిజాంపేట మున్సిపల్ శ్రీ సీతారాముల కళ్యాణం



నవతెలంగాణ-దుండిగల్
శ్రీరామ నవమి సందర్భముగా నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్‌లో సుప్రసిద్ధం శ్రీ సీతారాముల ఆలయంలో ఆలయ ధర్మకర్త కొలను శ్రీనివాస్‌రెడ్డి సతీ సమేతంగా శ్రీసీతారాముల కళ్యాణానికి ముత్యాల తలంబ్రాలు, పట్టు వస్త్రాలు సమర్పించారు. శ్రీ అభయ ఆంజనేయ స్వామి దేవాలయంలోను ప్రత్యేకముగా, మేళతాళాలతో ఆలయ ప్రధాన ధర్మకర్త కోలన్ శ్రీనివాస్ రెడ్డి తేజ శ్రీనివాస్ రెడ్డి (33వ వార్డ్ కార్పొరేటర్ మాజీ నిజాంపేట్ సర్పంచ్ సతీ సమేతంగా పట్టు వస్త్రాలు, ముత్యాల తలంబ్రాలు సమర్పించి శ్రీ సీతారాములలి కల్యాణ మహోత్సవంలో ప్రత్యేక పూజలో పాల్గొన్నారు. అనంతరం శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ భార్యభర్తల బంధానికి, అన్నతమ్ముల అనుబంధానికి, న్యాయ పాలనకు సమపాలన కు ఆదర్శం శ్రీ సీతారాములు అని, వారికి ప్రతి సంవత్సరం కళ్యణోత్సవాన్ని జరిపించడం ఆలయ ధర్మకర్తగా చాలా సంతోషంగా ఉందని, ప్రతి ఒక్కరూ శ్రీ సీతారాములను దైవారాధనతో కీర్తిస్తూ అన్ని విషయాలలో ఆధర్శముగా తీసుకోవాలని కోరుతూ ప్రజలందరికీ శ్రీరామ నవమి శుభాకాంక్షలు తెలిపారు. కల్యాణ మహోత్సవంలో భక్తులు చాలా అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

శ్రీ సాయి బాలాజీ ఎన్‌క్లేవ్‌లో



నవతెలంగాణ-దుండిగల్
దుండిగల్ మున్సిపాలిటీ పరిధి మల్లంపేట్‌లోని శ్రీసాయి బాలాజీ ఎన్‌క్లేవ్‌లో గురువారం శ్రీరామ నవమి సందర్భంగా సీతారాముల కళ్యాణం కాలనీ ప్రజల మధ్య ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎంఎల్‌సి శంబీపూర్ రాజు, హాజరై సీతారాముల కళ్యాణాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో దుండిగల్ మున్సిపల్ చైర్మెన్ కృష్ణ, కృష్ణవేణి, మున్సిపల్ కౌన్సిలర్‌లు అనంతస్వామి, ఎ.ఆంజనేయులు, ఎం.వెంకన్న, హనుమంతరావు, శ్రీధర్, సీఎంఆర్ పాఠశాల ఏవో సత్తిబాబు, చిరంజీవి, అరుణ్‌కుమార్, బస్వరాజు, సుబ్రహ్మణ్యం, రవీంద్రరెడ్డి, రాజవర్ధన్ రెడ్డి, నరేష్, మహేష్, కాలనీ ప్రజలు పాల్గొని అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.



నవతెలంగాణ- మేడ్చల్
మేడ్చల్ మండలములో శ్రీరామ నవమి వేడుకలు గురువారం ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా వివిధ గ్రామాలల్లో, మేడ్చల్, గుడ్లపోచంపల్లి మున్సిపల్‌లలోని హనుమన్, సీతరామ చంద్ర స్వామి ఆలయాల్లో వేద పండితుల మంత్రోచ్చరణల మధ్య సీత రామచంద్రుల స్వామి వారి కళ్యాణం ఘనంగా నిర్వహించారు.అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

శామీర్ పేట :



శ్రీరామ నవమి సందర్భంగా గురువారం తుంకుంట మున్సిపాలిటీ, శామీర్‌పేట, మూడు చింతలపల్లి మండల వ్యాప్తంగా శ్రీరామ నవమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యే మలిపెద్ది సుధీర్ రెడ్డి, మేడ్చల్ జిల్లా కాంగ్రెస్ ఫ్లోర్ లీడర్ సింగిరెడ్డి హరివర్ధన్ రెడ్డి, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు నక్క ప్రభాకర్ గౌడ్, బీఆర్ఎస్ మేడ్చల్ నియోజకవర్గ ఇంచార్జి మహేందర్ రెడ్డి, డీసీఎంఎస్ వైస్ చైర్మెన్ మధుకర్ రెడ్డి, సర్పంచ్ సింగం ఆంజనేయులు, ఎంపీటీసీ పారుపల్లి నాగరాజు పాల్గొన్నారు.

శామ్‌సంగ్ నుంచి అధిక స్టోరేజీతో పోర్టబుల్ ఎస్ఎస్‌డీ

నవతెలంగాణ - హైదరాబాద్
హార్డ్ డిస్కుల నుండి వినియోగదారులు ఎస్ఎస్‌డీలకు మారిపోయారు. ఎస్ఎస్‌డీ స్టోరేజీ పరికరాల మార్కెట్లో మీకు ముఖ్యంగా వినిపించే పేరు శాంసంగ్ పోర్టబుల్ ఎస్-ఎస్‌డీ పరికరాలు. శాంసంగ్ పోర్టబుల్ ఎస్ఎస్‌డీ టీ7 షీల్డ్ 4టీబీ కంపెనీ యొక్క కఠినమైన పోర్టబుల్ ఎస్ఎస్‌డీల నుండి వచ్చిన సరికొత్త అధిక స్టోరేజీ కలిగిన మోడల్. ఇది బయటి వినియోగదారులు మరియు విశ్వసనీయమైన మరియు ఎక్కువ స్టోరేజీ పరిష్కారం అవసరమయ్యే కంటెంట్ సృష్టికర్తల కోసం ఉద్దేశించబడింది. టీ7 షీల్డ్ మన్నిక కోసం అదనపు ఫీచర్లను కలిగి ఉంది. పెద్ద మొత్తంలో డేటాను త్వరగా మరియు సురక్షితంగా నిల్వ చేయడానికి మరియు బదిలీ చేయడానికి అవసరమైన వినియోగదారు కోసం ఉద్దేశించబడింది. శాంసంగ్ యొక్క 4టీబీ శామ్‌సంగ్ పోర్టబుల్ ఎస్ఎస్‌డీ టీ7 షీల్డ్ పరికరం అనేది అవుట్‌డోర్ యూజర్‌లు మరియు కంటెంట్ క్రియేటర్‌ల కోసం ప్రత్యేకంగా రూపొందించబడిన అధిక-సామర్థ్యం, కఠినమైన నిల్వ కలిగిన పరికరం.

క్వార్టర్స్‌లో శ్రీకాంత్

పి.వి సింధు సైతం ముందంజ..స్పెయిన్ మాస్టర్స్ టోర్నీ



మాడ్రిడ్ (స్పెయిన్) : భారత అగ్ర షట్లర్లు కిదాంబి శ్రీకాంత్, పి.వి సింధు గెలుపు బాట పట్టారు. ఈ సీజన్‌లో వరుస టోర్నీల్లో నిరాశపరిచిన తెలుగు తేజాలు స్పెయిన్ మాస్టర్స్ సూపర్ 300 టోర్నీలో క్వార్టర్‌ఫైనల్స్‌కు చేరుకున్నారు. మాజీ వరల్డ్ నం.1 కిదాంబి శ్రీకాంత్ సహచర షట్లర్ సాయిప్రణీత్‌పై గెలుపొందగా.. రెండు సార్లు ఒలింపిక్ మెడలిస్ట్ పి.వి సింధు ఇండోనేషియా అమ్మాయిని చిత్తు చేసింది. పురుషుల, మహిళల సింగిల్స్‌లో అటు శ్రీకాంత్, ఇటు పి.వి సింధు ఈ ఏడాది తొలిసారి క్వార్టర్‌ఫైనల్ ఆడనున్నారు. సెమీస్‌పై కన్నేసిన సింధు నేడు డెన్మార్క్ షట్లర్ మియా బ్లిచ్‌ఫెల్ట్‌తో పోటీపడనుండగా, టాప్ సీడ్ కెంటా నిషిమోటతో కిదాంబి శ్రీకాంత్ ఆడనున్నాడు.

పురుషుల సింగిల్స్‌లో కిదాంబి శ్రీకాంత్ 21-15, 21-12తో బి. సాయిప్రణీత్‌పై గెలుపొందాడు. 36 నిమిషాల్లోనే సహచర షట్లర్‌ను చిత్తు చేసిన శ్రీకాంత్ వరుస గేముల్లో క్వార్టర్స్ బెర్త్‌ను సొంతం చేసుకున్నాడు. రెండు గేముల్లోనూ సాయిప్రణీత్ నుంచి శ్రీకాంత్‌కు చెప్పుకోదగిన పోటీ ఎదురు కాలేదు. యువ ఆటగాడు కిరణ్ జార్జ్ ప్రీ క్వార్టర్‌ఫైనల్లో డెన్మార్క్ షట్లర్ మాగ్నస్ చేతిలో ఓటమి చెందాడు. 17-21, 12-21తో వరుస గేముల్లో పోరాడి ఓడాడు. సమీర్ వర్మ సైతం రెండో సీడ్ జపాన్ ఆటగాడు కెంట సునెయమకు 12-21 14-21తో క్వార్టర్స్ స్థానం కోల్పోయాడు. మహిళల సింగిల్స్‌లో రెండో సీడ్ పి.వి సింధు 21-14, 21-16తో అలవోక విజయం సాధించింది. స్విస్ ఓపెన్‌లో ఇండోనేషియా అమ్మాయి కుసుమ చేతిలో కంగుతిన్న సింధు.. మాడ్రిడ్‌లో లెక్క సరి చేసింది. 36 నిమిషాల ప్రీ క్వార్టర్స్ పోరులో సింధు సులువుగా క్వార్టర్స్‌కు చేరింది. మాళవిక బాన్సోద్ వాకోవర్‌తో టోర్నీ నుంచి నిష్క్రమించింది. స్పెయిన్ స్టార్ కరొలినా మారిన్‌తో మ్యాచ్‌కు ముందే మాళవిక బాన్సోద్ ఫిట్‌నెస్ కారణంతో పోటీ నుంచి వైదొలిగింది. యువ షట్లర్లు అష్మిత చాలిహ 15-21, 15-21తో, ఆకర్షి కశ్యప్ 13-21, 8-21తో పరాజయం పాలయ్యారు. మహిళల డబుల్స్‌లో సిక్కి రెడ్డి, ఆరతి సునీల్ జంట పోరాడి ఓడింది. జపాన్ జోడీ 21-12, 21-13తో వరుస గేముల్లో సిక్కి రెడ్డి జంటపై విజయం సాధించింది. పురుషుల డబుల్స్‌లో అర్జున్, ధ్రువ్ కపిల జోడీ 16-21, 20-22తో జపాన్ జోడీ చేతిలో ఉత్కంఠ మ్యాచ్‌లో తడబాటుకు లోనైంది.





ఐపీఎల్ 16 ట్రోఫీతో భువి, వార్నర్, సంజు, హార్దిక్, ధోని, రాహుల్, ధావన్, రాణా, డుప్లెసిస్. అనారోగ్యంతో రోహిత్ ఫోటో సెషన్‌కు రాలేదు.

ధనాధన్‌కు వేళాయె!

ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్). ధనాధన్ క్రికెట్‌కు కేరాఫ్ అడ్రస్. ప్రతి ఏడాది ఐపీఎల్ హంగామా సహజమే. కానీ ఈసారి హంగామా మజా వేరు!. మూడేండ్ల విరామం అనంతరం సొంత అభిమానుల నడుమ జరుగనున్న ఐపీఎల్.. సరికొత్త సంగతులకూ వేదిక కానుంది. ఫుట్‌బాల్, బాస్కెట్‌బాల్ వంటి క్రీడల్లో సబ్‌స్టిట్యూట్ ఆటగాళ్లు మ్యాచ్ ఫలితాన్ని నిర్దేశించే ఘట్టాలు.. ఇక నుంచీ ఐపీఎల్‌లోనూ చూడబోతున్నాం. ఓ సబ్‌స్టిట్యూట్ ఆటగాడు పూర్తి స్థాయి బ్యాటర్, బౌలర్ బాధ్యతలు నిర్వర్తిస్తూ.. ఆటలో ఎక్స్ ఫ్యాక్టర్ కానున్నాడు. ఇండియన్ ప్రీమియర్ లీగ్ 2023 సీజన్ నేడు అహ్మదాబాద్ వేదికగా ఆరంభం.

- నేటి నుంచి ఐపీఎల్ 16 హంగామా
- ఆరంభ వేడుకలకు ఘనంగా ఏర్పాట్లు
- తొలి మ్యాచ్‌లో టైటాన్స్, సూపర్‌కింగ్స్ ఢీ



నవతెలంగాణ-అహ్మదాబాద్

కొత్త రూల్స్ గురూ!

గ్లోబల్ టీ20 లీగ్‌లు అధికం అవుతున్న కాలంలో ఐపీఎల్‌ను ఆకర్షణీయ, కమర్షియల్ లీగ్‌ను నిలిపేందుకు కొత్త సొబగులు అవసరం. బీసీసీఐ యంత్రాంగం ఈ విషయంలో సరైన సమయంలో విప్లవాత్మక నిర్ణయాలు తీసుకుంది. క్రికెట్‌లో సబ్‌స్టిట్యూట్ ఆటగాడు బ్యాటింగ్, బౌలింగ్ చేయలేడు. కానీ ఐపీఎల్‌లో ఇంపాక్ట్ ప్లేయర్ రూల్ ప్రకారం సబ్‌స్టిట్యూట్ ఆటగాడు బ్యాటింగ్, బౌలింగ్ చేయవచ్చు. టాస్ అనంతరం తుది జట్టుతో పాటు నలుగురు సబ్‌స్టిట్యూట్ ఆటగాళ్ల పేర్లను సైతం ఇవ్వాలి. మ్యాచ్‌లో ఏ సమయంలోనైనా ఇంపాక్ట్ ప్లేయర్ రూల్‌తో సబ్‌స్టిట్యూట్ ఆటగాడి సేవలను ఇరు జట్లు వినియోగించుకోవచ్చు. ఇక ఐపీఎల్‌లో గత కొన్ని సీజన్లుగా నో బాల్స్, వైడ్లకు సంబంధించి అంపైర్ల నిర్ణయాలు వివాదాస్పదం అవుతున్నాయి. ఈ వివాదాలకు చెక్ పెట్టేందుకు వైడ్లు, నో బాల్స్‌కు సైతం డిఆర్ఎస్ పద్ధతిని తీసుకొచ్చారు. ఇరు జట్లు సమీక్షను వాడుకుని అంపైర్ నిర్ణయాన్ని సవాల్ చేయవచ్చు. ఇక, క్రికెట్‌లో సాధారణంగా టాస్‌కు ముందు తుది జట్టు జాబితాను ఇరు జట్ల కెప్టెన్లు పంచుకుంటారు. ఆ తర్వాత మార్పులకు అవకాశం ఉండదు. కానీ ఐపీఎల్‌లో టాస్ అనంతరం తుది జట్టును ఎంపిక చేసుకోవచ్చు. దీంతో తొలుత బ్యాటింగ్, తొలుత బౌలింగ్ చేసేటప్పుడు జట్ల వ్యూహాల ప్రకారం ప్లేయింగ్ ఎలెవన్‌ను ఎంచుకోవచ్చు.

పాత ఫార్మాట్

ఇండియన్ ప్రీమియర్ లీగ్ ప్లేయింగ్ ఫార్మాట్ అభిమానులను విశేషంగా ఆకట్టుకున్న విషయం. ఫ్రాంచైజీలు సొంత గడ్డపై సగం మ్యాచులు, ప్రత్యర్థి వేదికపై సగం మ్యాచులు ఆడాలి. కరోనా కారణంగా గత మూడేండ్లలో లీగ్ ఈ ఫార్మాట్‌ను పాటించలేదు. యుఏఈలో మూడు స్టేడియాలు, భారత్‌లోనూ మూడు స్టేడియాల్లోనే నిర్వహించారు. 2019 తర్వాత తొలిసారి ఐపీఎల్ మళ్లీ పాత పద్దతిలో జరిగేందుకు షెడ్యూల్ చేశారు. పది జట్లు తమ సొంత మైదానంలో ఏడు మ్యాచులు ఆడనున్నాయి. రాజస్థాన్ రాయల్స్, పంజాబ్ కింగ్స్ వంటి ఫ్రాంచైజీలు సొంత మైదానాలుగా రెండు వేదికలను ఎంచుకున్నాయి. పాత ఫార్మాట్ ఐపీఎల్‌లో దేశవ్యాప్తంగా ఐపీఎల్ హంగామా కనిపించనుంది.

కొత్త చాంపియన్‌ను చూస్తామా?

కొత్త చాంపియన్‌ను చూస్తామా? మెగా ఈవెంట్ ఏది జరిగినా ఎదురయ్యే ప్రశ్న. గత సీజన్‌లో ఐపీఎల్ నూతన విజేతను చూసింది. అరంగేట్ర జట్టు గుజరాత్ టైటాన్స్ టైటిల్ ఎగరేసుకుపోయింది. ఐపీఎల్ టైటిల్ కోసం గత ఏడాది కొత్తగా వచ్చిన లక్నో సూపర్ జెయింట్స్‌కు తోడు.. 2008 నుంచీ అలుపెరుగని పోరాటం చేస్తున్న జట్లూ ఉన్నాయి. రాయల్ చాలెంజర్స్ బెంగళూర్, పంజాబ్ కింగ్స్, ఢిల్లీ క్యాపిటల్స్ టైటిల్ నెగ్గని జాబితాలో ఉన్నాయి. రాయల్ చాలెంజర్స్ బెంగళూర్ మూడుసార్లు టైటిల్ పోరులో పోటీపడినా.. ఫలితం దక్కలేదు. పంజాబ్ కింగ్స్, ఢిల్లీ క్యాపిటల్స్ లీగ్ దశలో గొప్ప ప్రదర్శన చేసి అంచనాలు పెంచినా.. ప్లే ఆఫ్స్/నాకౌట్‌లో నిలబడలేదు. 2023 సీజన్‌లోనైనా ఐపీఎల్ పాత జట్ల నుంచి కొత్త చాంపియన్‌ను చూస్తుందా? మళ్లీ పాత చాంపియన్ చెంతకే చేరుతుందా? ఆసక్తికరం. ముంబయి ఇండియన్స్, చెన్నై సూపర్‌కింగ్స్, సన్‌రైజర్స్ హైదరాబాద్ (డెక్కన్ చార్జర్స్), కోల్‌కత నైట్‌రైడర్స్, రాజస్థాన్ రాయల్స్, గుజరాత్ టైటాన్స్ ఇప్పటి వరకు ఐపీఎల్ టైటిల్‌ను గెల్చుకున్నాయి.


హైదరాబాద్‌లో కిక్కే కిక్కే!

ఇటీవల కాలంలో హైదరాబాద్‌లో క్రికెట్ మ్యాచులకు డిమాండ్ గణనీయంగా పెరిగింది. అంతర్జాతీయ మ్యాచుల టికెట్ల కోసం అభిమానులు పడరాని పాట్లు పడ్డారు. తెలంగాణ, ఏపీ ప్రజల ప్రత్యక్ష క్రికెట్ వినోదం దాహం తీర్చేందుకు సన్‌రైజర్స్ హైదరాబాద్ సిద్ధమైంది. ఐపీఎల్‌లో సన్‌రైజర్స్ ఉప్పల్ వేదికగా ఏడు మ్యాచులు ఆడనుంది. ఏప్రిల్ 2న రాజస్థాన్ రాయల్స్‌తో తొలి మ్యాచ్. రెండు నెలల పాటు సుమారుగా వారం రోజుల వ్యవధిలో సన్‌రైజర్స్ హైదరాబాద్ సొంతగడ్డపై మ్యాచ్ ఆడనుంది. వారానికో ఐపీఎల్ మ్యాచ్‌తో హైదరాబాద్ వాసులు క్రికెట్ కిక్ అనుభూతి పొందనున్నారు.

మంధాన, రష్మిక చిందులు

ఐపీఎల్ 2023 ఆరంభ వేడుకలకు అహ్మదాబాద్‌లోని మోతెరా స్టేడియం ముస్తాబైంది. బాహుబలి స్టేడియంలో ఐపీఎల్ యంత్రాంగం ఇప్పటికే ఏర్పాట్లు ఘనంగా చేసింది. ఆరంభ మ్యాచ్‌లో డిఫెండింగ్ చాంపియన్ గుజరాత్ టైటాన్స్‌తో చెన్నై సూపర్ కింగ్స్ తలపడనుంది. ఆరంభ వేడుకల్లో సినీ తారల నృత్య, సంగీత ప్రదర్శన తొలినాళ్ల నుంచీ ప్రత్యేక ఆకర్షణ. బాహుబలి ఫేం తమన్నా భాటియా, పుష్ప ఫేం రష్మిక మంధాన సహా మ్యూజిషిన్ అరిజిత్ సింగ్ ఆరంభ వేడుకల్లో అలరించనున్నారు. ఆరంభ వేడుకల కోసం రూ.10 కోట్ల బడ్జెట్ కేటాయించినట్టు తెలుస్తోంది!.

నవచిత్రం



'ఆదిపురుష్' చిత్రంలో ఒక దృశ్యం

ధర్మ సంస్థాపన కోసం..

ప్రభాస్, కృతిసనన్ జంటగా నటించిన సినిమా 'ఆదిపురుష్'. ఓం రౌత్ డైరెక్షన్‌లో రామాయణ ఇతిహాస నేపథ్యంలో రూపొందిన ఈ చిత్రంలో సైఫ్ అలీఖాన్ రావణుడు పాత్రలో, హనుమంతుడి పాత్రలో సన్నీ సింగ్ నటిస్తున్నారు.
శ్రీ రామనవమి సందర్భంగా ఈ చిత్రం నుంచి కొత్త పోస్టర్‌ను విడుదల చేసింది మూవీ టీమ్. శ్రీరామ ధర్మాన్ని మరోసారి చాటిచెప్పేలా, అందుకు తగ్గట్టుగానే శ్రీ రాముడి నైజాలైన ధర్మం, ధైర్యం, త్యాగం వంటి అంశాలు పోస్టర్‌లో ప్రతిబింబించేలా ఈ పోస్టర్ ఉంది. యూవీ క్రియేషన్స్ వంశీ, ప్రమోద్‌లతో కలిసి టి- సిరీస్, భూషణ్ కుమార్, క్రిషన్ కుమార్, ఓం రౌత్, ప్రసాద్ సుతార్, రెట్రోఫైల్స్ రాజేష్‌నాయర్ నిర్మించారు. జూన్ 16న ఈ సినిమా ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుంది.

దసరాకి.. అవే పెద్ద మైనస్సులా..?


'సరిగ్గా 40 నిమిషాల్లో చూపించే చిత్రాన్ని 2.32 నిమిషాల సుదీర్ఘ సినిమాగా చూపించడం, యూనివర్సల్‌గా అందరికీ తెలిసిన రొడ్డ కొట్టుడు ప్రేమ, పగ, స్నేహం కాన్సెప్ట్‌లో పస లేదంటూ 'దసరా' చిత్రాన్ని చూసిన నెటిజన్లు, సినీ విమర్శకులు సోషల్ మీడియా వేదికగా కామెంట్లు చేస్తున్నారు.
నాని నటించిన తొలి పాన్ ఇండియా సినిమా 'దసరా'. నూతన దర్శకుడు శ్రీకాంత్ ఓదెల దర్శకత్వంలో రూపొందిన ఈ సినిమా గురువారం ప్రేక్షకుల ముందుకొచ్చింది. భారీ అంచనాలతో విడుదలైన ఈ సినిమా సాదా సీదా కథతో ఉండటంతో భారీ కలెక్షన్లు ఉన్నప్పటికీ ఆ అంచనాలను మాత్రం అందుకోలేక అందర్నీ నిరాశపర్చిందని వినిపిస్తోంది.
ఈ సినిమా బలాలు, బలహీనతల గురించి సినీ విశ్లేషకులు, నెటిజన్ల వ్యూ ఎలా ఉందో ఓసారి గమనిస్తే, కేజీఎఫ్, రంగస్థలం, పుష్ప, కాంతార, 1976 పలాస, మగధీర, లగాన్, రుద్రవీణ, ముఫ్తీ, మహా సముద్రం, గూండే, ఆర్య2.. ఇలాంటి సినిమాలన్ని ఒక్కొక్క సన్నివేశంలో గుర్తుకు రావడం, సన్నివేశాల సాగతీత, రొటీన్ రివేంజ్ డ్రామా, రా, రఫ్ బ్యాక్‌డ్రాప్‌లో రఫ్‌గా కనిపించే నాని నానా సినిమాల సమ్మేళం, సుదీర్ఘ నిడివి బలహీనతలుగా, తెలంగాణ సింగరేణి బొగ్గు గనుల నేపథ్యం, బిజీఎం, కళా దర్శకత్వం, డైలాగ్స్, దర్శకుడి పని తీరు, ఫొటోగ్రఫీ, నిర్మాణ విలువలు, నాని, కీర్తి సురేష్‌ల నటన బలాలుగా చెబుతున్నారు.



నాని

విమర్శలు గెలిచాయి..

బూతులు, అసహజ అశ్లీల దృశ్యాలతో రూపొందిన 'రానా నాయుడు' వెబ్ సిరీస్‌పై వచ్చిన విమర్శల వెల్లువకి తట్టుకోలేక తెలుగు వర్షెన్ సిరీస్‌ని నెట్‌ఫ్లిక్స్ తొలగించింది. దీంతో విమర్శలు గెలిచాయంటూ సోషల్ మీడియా వేదికగా నెటిజన్లతోపాటు వెంకటేష్ అభిమానులు సైతం ప్రశంసలు కురిపించారు.
వెంకటేష్, రానా ప్రధాన పాత్రల్లో నటించిన 'రానా నాయుడు' వెబ్‌సిరీస్ ఇటీవల నెట్‌ఫ్లిక్స్ ఓటీటీలో విడుదలైంది. శ్రుతిమించిన బూతులున్నాయంటూ ఈ వెబ్ సిరీస్‌పై విడుదలైన మొదటి రోజు నుంచే తీవ్ర అభ్యంతరాలు వ్యక్తమయ్యాయి. దర్శకులకు స్వేచ్ఛనిచ్చింది సృజనాత్మకంగా సినిమాలు తెరకెక్కించడం కోసమే కానీ అశ్లీలాన్ని వ్యాపింపచేయడం కోసం కాదని, ఇలాంటి వాటిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఇటీవల కేంద్ర సమాచార మంత్రి అనురాగ్ ఠాకూర్ ఘాటుగా స్పందించారు. ఆయన స్పందించిన రోజుల వ్యవధిలోనే నెట్‌ఫ్లిక్స్ నుంచి 'రానా నాయుడు'ని తీసెయ్యడంతో ఇకపై ఇలాంటి బూతు, అశ్లీలం, మహిళలను కించపరిచే సిరీస్‌లను రిలీజ్ చేయాలనుకున్న వారికి కూడా గట్టి హెచ్చరిక అయ్యింది.



వెంకటేష్

అంచనాలు పెంచిన ట్రైలర్

మణిరత్నం దర్శకత్వంలో లైకా ప్రొడక్షన్స్, మద్రాస్ టాకీస్ బ్యానర్స్‌పై సుభాస్కరన్, మణిరత్నం నిర్మిస్తున్న భారీ బడ్జెట్ పాన్ ఇండియా చిత్రం 'పొన్నియిన్ సెల్వన్ 2'.
గత ఏడాది విడుదలై ప్రేక్షకులతో పాటు విమర్శకుల ప్రశంసలు అందుకుని, బ్లాక్‌బస్టర్ టాక్‌తో బాక్సాఫీస్ దగ్గర కలెక్షన్స్ రాబట్టిన 'పొన్నియిన్ సెల్వన్ 1' చిత్రానికి ఇది కొనసాగింపు. చోళుల గురించి తెలియజేసే సినిమా ఇది. అత్యద్భుతమైన విజువల్స్‌తో లార్జర్ దేన్ లైఫ్ మూవీగా దీన్ని మణిరత్నం సిల్వర్ స్క్రీన్‌పై ఆవిష్కరిస్తున్నారు. దీంతో ప్రేక్షకులు ఈ చిత్రాన్ని ఎప్పుడెప్పుడు చూద్దామా అని ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు.
అలాగే దీనిపై ఇప్పటికే హై ఎక్స్‌పెక్టేషన్స్ నెలకొన్నాయి. ఈ అంచనాలను మరింత పెంచేలా 'పొన్నియిన్ సెల్వన్ 2' ట్రైలర్‌ను చిత్ర యూనిట్ విడుదల చేసింది. ఐశ్వర్యా రాయ్, విక్రమ్, జయం రవి, కార్తి, త్రిష కృష్ణన్ ప్రధాన పాత్రధారులుగా నటించిన ఈ చిత్రంలో శరత్ కుమార్, ప్రభు, లాల్, కిషోర్, అశ్విన్ కాకమాను, ఐశ్వర్య లక్ష్మి ఇతర పాత్రల్లో నటించారు. చెన్నైలో పొన్నియిన్ సెల్వన్2 ట్రైలర్‌తో పాటు ఆడియో లాంచ్ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. చిత్రయూనిట్‌తోపాటు పలువురు తమిళ చిత్ర ప్రముఖులు సైతం ఈ ఈవెంట్‌లో పాల్గొన్నారు. ఏ.ఆర్.రెహమాన్ సంగీతాన్ని అందించిన ఈ సినిమాను ఏప్రిల్ 28న వరల్డ్‌వైడ్‌గా తమిళం, తెలుగు, హిందీ, కన్నడ, మలయాళ భాషల్లో విడుదల చేస్తున్నారు.



ఐశ్వర్యరాయ్

నయా సినిమాలు.. నయా కాంబినేషన్లు



విశ్వక్ సేన్

విశ్వక్ సేన్ కథానాయకుడిగా సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ పతాకంపై ప్రొడక్షన్ నెం.21గా ఓ సినిమా రూపొందనుంది.
ప్రసీద చిత్ర నిర్మాణ సంస్థ సితార ఎంటర్‌టైన్‌మెంట్స్, శ్రీకర స్టూడియోస్ సమర్పణలో ఫార్చ్యూన్ ఫోర్ సినిమాస్‌తో కలిసి ఈ చిత్రాన్ని నిర్మించనుంది. సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య సంయుక్తంగా నిర్మిస్తున్న ఈ చిత్రానికి వెంకట్, గోపి సహ నిర్మాతలుగా వ్యవహరించనున్నారు. కృష్ణ చైతన్య ఈ చిత్రానికి దర్శకుడు. అనౌన్స్‌మెంట్ నేపథ్యంలో రిలీజ్ చేసిన వీడియోని బట్టి చూస్తే, రాజమండ్రి పరిసర ప్రాంతాలలోని చీకటి సామ్రాజ్యం బ్యాక్‌డ్రాప్‌లో రూపొందనున్న పీరియాడిక్ ఫిల్మ్ అనిపిస్తోంది.

హీరో శ్రీనివాస్ బెల్లంకొండ 'భీమ్లా నాయక్' చిత్రాన్ని తెరకెక్కించిన దర్శకుడు సాగర్ చంద్ర కాంబినేషన్‌లో ఓ చిత్రంలో నటించబోతున్నారు. మాస్-యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా రూపొందనున్న ఈ చిత్రాన్ని 14 రీల్స్ ప్లస్ సంస్థ పై రామ్ ఆచంట, గోపి ఆచంట నిర్మించనున్నారు. శ్రీనివాస్, వి.వి.వినాయక్ కాంబోలో తెరకెక్కిన హిందీ 'ఛత్రపతి' మే 12న రిలీజ్ కానుంది.



బెల్లంకొండ శ్రీనివాస్

ఆ ఇద్దరినీ కలిపితే.. నేను

'లక్ష్యం', 'లౌక్యం' వంటి సూపర్ హిట్ సినిమాల తరువాత గోపీచంద్, డైరెక్టర్ శ్రీవాస్ కాంబినేషన్‌లో రూపొందుతున్న హ్యాట్రిక్ ఫిల్మ్ 'రామబాణం'.
పీపుల్ మీడియా ఫ్యాక్టరీ బ్యానర్ పై టీజీ విశ్వప్రసాద్, వివేక్ కూచిభొట్ల ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు.
ఇందులో గోపీచంద్ సరసన నాయికగా డింపుల్ హయతి నటిస్తుండగా, జగపతిబాబు, కుష్బూ ప్రధాన పాత్రల్లో నటిస్తున్నారు. శ్రీరామ నవమి పండుగ శుభాకాంక్షలు తెలుపుతూ మేకర్స్ ఓ ప్రత్యేక పోస్టర్‌ను రిలీజ్ చేశారు.
పండుగ వాతావరణాన్ని ప్రతిబింబించేలా గుడి ఆవరణంలో పంచె కట్టు, నుదుటన బొట్టుతో గోపీచంద్, జగపతి బాబు ఒకరి చేయి ఒకరు పట్టుకొని నడిచొస్తున్న పోస్టర్ తెలుగుదనం ఉట్టిపడేలా ఎంతో అందంగా ఉంది.ఈ పోస్టర్‌తోపాటు రిలీజ్ చేసిన ప్రత్యేక వీడియోలో,'ఆ రాముడుకి లక్ష్మణుడు, హనుమంతుడు అని ఇద్దరు ఉంటారు. ఆ ఇద్దరినీ కలిపితే నేను' అనే బలమైన డైలాగ్‌తో అందర్నీ ఆకట్టుకుంటోంది.
ఫ్యామిలీ ఎమోషన్స్‌తో పాటు సామాజిక సందేశం ఉన్న ఈ చిత్రం త్వరలోనే ప్రేక్షకుల ముందుకు రానుంది.

గోపీచంద్, జగపతిబాబు



Printed and Published by Nandayala Narsimha Reddy On behalf Of Navatelangna Printers Private Limited, Printed At M.H Bhavan, 1st Floor, Plot No. 21/1, Azamabad Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020,Telangana State,
Published at Navatelangana Printers Private Limited, M.H Bhavan,1st Floor No.21/1, Azamabad, Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020, Telangana State, Editor : R.Sudha Bhaskar TELTEL/2014/59462.